V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
23-10-2024
సంపుటి : 01 | సంచిక : 171 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD



## పరస్పరం సహకరించుకుందాం

### ద్వైపాక్షిక అంశాలపై మోదీ, పుతిన్ చర్చలు

### బ్రిక్స్ సదస్సుకు ముందు భేటీ అయిన అధినేతలు

**మాస్కో:** బ్రిక్స్ సదస్సు లో పాల్గొనేందుకు రష్యాకు వెళ్లిన ప్రధాని నరేంద్రమోదీ ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో భేటీ అయ్యారు. బ్రిక్స్ సదస్సుకు ముందుగా కజాన్ లో ఈ ఇరుదేశాల అధినేతల భేటీ జరిగింది. ఈ సందర్భంగా రెండు దేశాల ద్వైపాక్షిక అంశాలపై వారు చర్చించారు. ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేసుకుని, పరస్పర సహకారం అందించుకుంటూ అభివృద్ధి చెందాలని సదస్సులో నిర్ణయించారు. 'బ్రిక్స్' కూటమి 16వ శిఖరాగ్ర సదస్సు మంగళవారం ప్రారంభమైంది. రష్యాలోని కజాన్ నగరం ఈ సదస్సుకు వేదిక అయింది. ఈ నెల 24 వరకు సదస్సు కొనసాగనుంది. 'ప్రపంచ అభివృద్ధి, భద్రత కోసం బహుళపక్షవాదాన్ని మిగతా2లో...



## సియోల్‌లో రెండో రోజు తెలంగాణ మంత్రుల పర్యటన 2

రాష్ట్రంలో ధరణి సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు...భూ సమస్యల పరిష్కారం కోసం గత బీఆర్ ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ సంస్కరణపై తీవ్ర చర్చోపచర్చలు జరిగాయి. ఎంతో కసరత్తు చేసి తీసుకువచ్చిన ధరణి పెనువిప్లవమని, భూముల క్రయవిక్రయాలను అత్యంత సులభతరం చేసిందని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొనగా..ఇందులో సవాలక్ష లోపాలున్నాయని కాంగ్రెస్ మండిపడింది. తాము అధికారంలోకి వస్తే రూపురేఖలు మారుస్తామని ప్రకటించింది. అందుకు తగ్గట్లే తాజాగా పోర్టల్ నిర్వహణ బాధ్యతలను మార్చింది. త్వరలో ధరణి సమస్యల నుంచి ప్రజలకు పూర్తి విముక్తి కల్పిస్తామని ప్రకటించింది.

# చేతులు మారిన ధరణి

### పోర్టల్ నిర్వహణను ఎన్ఐసీకి అప్పగిస్తూ ఉత్తర్వులు





### త్వరలో సమస్యల నుంచి పూర్తిగా విముక్తి కల్పిస్తాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**విశ్వంభర,హైదరాబాద్:**

ఇప్పటి వరకు విదేశీ సంస్థ టెర్రాసిస్ చేతిలో ఉన్న ధరణి నిర్వహణ బాధ్యతను స్వదేశీ సంస్థ ఎన్.ఐ.సి.కి అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డిసెంబర్ 1 వతేదీ నుంచి తెలంగాణలో భూ రికార్డుల నిర్వహణ బాధ్యతను జాతీయ సమాచార సంస్థ (ఎన్ఐసి) నిర్వహిస్తుందని ఈ మేరకు ఉత్వర్వులు జారీ చేసినట్లు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. త్వరలో ధరణి సమస్యల నుంచి ప్రజలకు పూర్తి విముక్తి కల్పిస్తామని వెల్లడించారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం లోని పెద్దలు ఎలాంటి ముందు చూపు లేకుండా హడావుడిగా తొందరపాటు నిర్ణయాలతో తీసుకువచ్చిన ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. అప్పట్లో బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు తెలంగాణకు చెందిన 1.56 కోట్ల ఎకరాల భూమిని టెర్రాసిస్ అనే విదేశీ కంపెనీకి తాకట్టు పెట్టారని . ఒరిస్సా రాష్ట్రంలో ఈ సంస్థ పనిచేసి విఫలమైందన్నారు. ఇటువంటి సంస్థకు కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పెద్దలు కట్టబెట్టినట్లు మంత్రి పొంగులేటి దుయ్యబట్టారు. లక్షలాది రైతుల లకు చెందిన కోట్లాది ఎకరాల వ్యవసాయ భూములను లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములను గత బారాస ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, రెవిన్యూ శాఖ మంత్రి అయినా కేసీఆర్ ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్ ఏకపక్షంగా యథేచ్ఛగా విదేశీ కంపెనీలకు అప్పగించగా ఐదేళ్లపాటు ధరణి పోర్టల్ రైతులను నానా ఇబ్బందులు పెట్టింది ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం ధరణి పోర్టల్ విదేశీ కంపెనీల చేతుల్లో నుంచి ప్రభుత్వం చేతిలోకి తీసుకుంటుందని కాంగ్రెస్ చెప్పిన ప్రకారం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసికి ఇవ్వడం అయినది తద్వారా 71, 00,000 ఖాతాల రైతుల భూములకు పూర్తి రక్షణ లభించినట్లయింది. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తాము ఎన్నికల ప్రణాళికలో ధరణి పోర్టల్ ప్రక్షాళన చేపడతామని ప్రకటించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నామని తెలిపారు. ఇచ్చిన మాట మేరకు విదేశీ కంపెనీ చేతుల్లో ఉన్న తెలంగాణ భూములను కాపాడుకోవడానికి , ఆ కంపెనీ రద్దుకు నిర్ణయించామని మంత్రి తెలిపారు. ధరణి నిర్వహణా మిగతా2లో...

## ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు గ్రూప్-3, గ్రూప్-2 వాయిదా వేయండి

### సీఎం రేవంత్‌కు ఎస్సీ విద్యార్థుల లేఖ



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు జరిగే వరకు గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను వాయిదా వేసి న్యాయం చేయాలని ఎస్సీ సామాజిక విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రాలు వర్గీకరణను అమలు మిగతా2లో...

## అణు శక్తికి భారత్ పదును

### న్యూక్లియర్ సబ్ మెరైన్ ఆవిష్కరణ

### నౌకాదళానికి అందజేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్

### షిప్ బిల్డింగ్ సెంటర్‌లో కార్యక్రమం



**విశ్వంభర, విశాఖపట్నం:** అణు శక్తికి పదునుపెట్టుకోవడంలో భారత్ మరో అడుగు ముందుకు వేసింది. విశాఖ తీరంలో నౌకాదళం అణు మిగతా2లో...

## రాష్ట్రంలో శాంతి భద్రతలున్నాయా?

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్న
- అనుచరుడు గంగారెడ్డి హత్యకు గురికావడంతో తీవ్ర ఆవేదన
- పార్టీకో దండం అంటూ వ్యాఖ్య
- జాతీయ రహదారిపై నిరసన



**విశ్వంభర, జగిత్యాల:** మీకు.. మీ పార్టీకి ఓ దండం.. ఇకనైనా మమ్మల్ని బతనివ్వండి' అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ప్రధాన అనుచరుడు, జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి (58) దారుణ హత్యకు గురికావడంతో రాష్ట్రంలోని శాంతిభద్రతలపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. గంగారెడ్డి హత్యను నిరసిస్తూ తన అనుచరులతో కలిసి జగిత్యాల-ధర్మపురి రహదారిపై జీవన్ రెడ్డి ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌తో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'మాకు మిగతా2లో...



## అసెంబ్లీ ప్రాంగణంలోకి కౌన్సిల్ భవనం

### మూడు నెలల్లో అందుబాట్లోకి ..

### మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు వెల్లడి

### పాత అసెంబ్లీ భవన పునరుద్ధరణపై సమీక్ష

**విశ్వంభర, హైదరాబాద్:**

అసఫ్ జాహీల నిర్మాణశైలితో ఉన్న అసెంబ్లీ పాత భవనాన్ని అదే నిర్మాణ కౌశలంతో అద్భుతంగా పునరుద్ధరిస్తున్నామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలోని హెరిటేజ్ భవనమైన పాత అసెంబ్లీ భవన పునర్నిర్మాణంపై స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ బండా ప్రకాష్ తో కలిసి భవనాన్ని పునర్నిర్మిస్తున్న ఆగాఖాన్ ప్రతినిధులు, ఆర్ అండ్ బీ అధికారులు, అసెంబ్లీ సెక్రెటరీ నర్సింహాచార్యులుతో మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి




## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 120 | ₹ 142 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 206 | ₹ 234 |

## కాళేశ్వరంపై నేటి నుంచి మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్

### గతంలో విచారణ చేసిన వారిని తిరిగి ప్రశ్నించనున్న కమిషన్



**విశ్వంభర, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో బుధవారం నుంచి మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్ జరగనుంది. ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లు, ఉన్నతాధికారులను న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ విచారించనున్నారు. గతంలో విచారణ చేసిన వారిని కూడా మళ్లీ పిలవనున్నారు. ఈనెల 29 వరకు క్రాస్ ఎగ్జామినేషన్ కొనసాగనుంది. మంగళవారం నీటిపారుదలశాఖ అధికారులతో ఆయన మిగతా2లో...



## పోలీసులపై మేం దాడి చేయలేదు

### దుండగులు మా ర్యాలీలో చొరబడి కుట్ర చేశారు

### ఎంపీ ఈటల రాజేందర్

**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులను మార్చే క్రమంలో అనేకసార్లు మతకల్లోలాలు సృష్టించిందని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. శవాల మీద కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడే దిల్‌సుఖ్ నగర్, గోకుల్ చాట్, మిగతా2లో...

## అలజడులు సృష్టించే వారిని వదలబోం

- తెలంగాణ గంగా జమున సంస్కృతికి విఘాతం కలిగించే చర్యలను సహించం
- 'ముత్యాలమ్మ' ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది
- కాంగ్రెస్‌ది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం
- సంయమనంతో ఉండాలని ప్రజలకు మంత్రి కొండా సురేఖ పిలుపు





**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ గంగా జమునా సంస్కృతికి విఘాతం కలిగించే చర్యలను ఏమాత్రం సహించబోమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మిగతా2లో...

## పంచాంగం

**23-10-2024, బుధవారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
**తిథి:** సప్తమి రా.01.23 వరకు తర్వాత అష్టమి
**నక్షత్రం:** పునర్వసు ఉ.06.12 వరకు
**సూర్యోదయం:** ఉ.6.15
**సూర్యాస్తమయం:** సా.5.45
**వర్జ్యం:** సా.05.57 నుంచి రా.07.35వరకు
**దుర్ముహూర్తం:** ఉ.11.37 నుంచి మ.12.23 వరకు
**రాహుకాలం:** మ.12.00 నుంచి మ.01.26 వరకు
**అమృత ఘడియలు:** తె.03.48 నుంచి తె.05.26 వరకు

# రాష్ట్రంలో శాంతి భద్రతలున్నాయా?

(మొదటి పేజీ తరువాయి)
నలుగురికి సేవ చేయడమే తెలుసు.. ఏదైనా స్వచ్ఛంద సంస్థ పెట్టుకుని అయినా ప్రజలకు సేవ చేస్తా. ఇక మీకు.. మీ పార్టీకి ఓ దండం. ఇకనైనా మమ్మల్ని బతకనివ్వండి. ఇంతకాలం అవమానాలకు గురైనా తట్టుకున్నాం.. మానసికంగా అవమానాలకు గురవుతున్నా భరించాం.. కానీ ఇవాళ భౌతికంగా లేకుండా చేస్తే ఎందుకు.'అని అడ్లూరి లక్ష్మణ్‌ను జీవన్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల్నే ఇంత దారుణంగా హత్య చేసిన తర్వాత అసలు రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా? లేవా? అని ప్రశ్నించారు. తన అనుచరుడిని హత్య చేయడం అంటే తనను కూడా హత్య చేసినట్లే అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. క్రియాశీలకంగా పార్టీలో పనిచేస్తే చంపేస్తారా అని ప్రశ్నించారు. గంగారెడ్డిని చంపిన వారిని పట్టుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు.

**కారుతో ఢీకొట్టి...కత్తితో పొడిచి..**
కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడు, జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి (58) దారుణహత్యకు గురయ్యారు. జగిత్యాల జిల్లా జాబితాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం సంతోష్ అనే వ్యక్తి గంగారెడ్డిని కారుతో ఢీకొట్టాడు. ఆ తర్వాత కత్తితో పొడిచాడు. తీవ్రగాయాలపాలైన గంగారెడ్డిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. కాగా హత్య చేసిన కొద్దిసేపటికే నిందితుడు సంతోష్ జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. నిందితుణ్ని ప్రస్తుతం మల్యాల పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. హత్యకు గల కారణాలను పరి-



శీలిస్తే గ్రామంలో గత కొన్నేళ్లుగా రెండు వర్గాలు కొనసాగుతున్నాయి. భూవివాదాలు వీటికి తోడైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడి విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

**అందరూ అనుకుంటున్నదే జీవన్‌రెడ్డి చెప్పారు:కేటీఆర్**
తెలంగాణలో శాంతిభద్రతలు లేవని గత కొన్ని నెలలుగా అందరూ చెబుతున్న మాటనే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అంటున్నారని బీర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. జగిత్యాలలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి పూర్తి స్థాయి హోంమంత్రి లేకపోగా.. పోలీసులు రాజకీయ వ్యవహారాల్లో పూర్తిగా బిజీగా ఉండటంతో శాంతి భద్రతల అమలు కుంటుపడిందని కేటీఆర్ ఆరోపించారు. రాజకీయ పెద్దలు ఇకనైనా విజ్ఞతతో ఆలోచిస్తారని అనుకుంటున్నట్లు తెలిపారు. శాంతి, సామరస్యాన్ని కాపాడే ప్రాథమిక పనిపై దృష్టి సారించేలా సమర్థులైన పోలీసులు అధికారులకు స్వేచ్ఛ ఇస్తారని ఆశిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

**ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదనతో అలా మాట్లాడారు: మహేశ్ కుమార్‌గౌడ్**
కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుచరుడి హత్యపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ స్పందించారు. అనుచరుడు హత్యకు గురి కావడంతో జీవన్ రెడ్డి తీవ్ర మనస్తాపానికి లోనయ్యారని, ఆయన బాధలో ఉండి అలా తన ఆవేదన వ్యక్తం చేశారన్నారు. తాను జీవన్ రెడ్డితో ఫోన్లో మాట్లాడంతో పాటు పోలీసులతో కూడా మాట్లాడి హత్యకు సంబంధించిన సమాచారం తీసుకున్నట్లు వివరించారు. హత్య చేసిన నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడని, విచారణ జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులకు సూచించినట్లు ఆయన వివరించారు. సీనియర్ మంత్రి శ్రీధర్‌బాబుకు ఈ వ్యవహారం అప్పగించినట్లు మహేశ్‌గౌడ్ తెలిపారు.

**నేను పార్టీలో ఉండలేను**
పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్ చేయడంతో జీవన్‌రెడ్డి ఆవేదనతో మాట్లాడారు. తాను పార్టీలో ఉండలేనని ఆవేదనగా ఫోన్‌పెట్టేశారు. పార్టీ ఫిరాయించిన వారి ప్రోత్సహంతోనే ఈ హత్య జరిగిందని.. ఫిరాయింపులు అవసరమా? అంటూ కాంగ్రెస్ పార్టీపై జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**హత్యను ఖండించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్**
మరో వైపు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రోద్బలంతోనే హత్య జరిగినట్లు కార్యకర్తలు మాట్లాడటంతో తాను హత్యను ఖండిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఘటనపై పూర్తి విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని సంజయ్ పోలీసులను కోరారు. కొన్నాళ్లుగా జగిత్యాలలో ఎమ్మెల్యే వర్గం, జీవన్‌రెడ్డి వర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ హత్యతో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉంది.

## సియోల్‌లో రెండో రోజు తెలంగాణ మంత్రుల పర్యటన

**సియోల్:** దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో తెలంగాణ మంత్రుల పర్యటన కొనసాగుతోంది. దక్షిణ కొరియాలోని ముఖ్యమైన హన్ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌ను మంత్రులు, అధికారుల బృందం పరిశీలించింది. సియోల్ నగరంలో నీటి సరఫరా, పర్యావరణం, ఆర్థిక వ్యవస్థకు ఈ నది కీలకంగా మారింది. కాలుష్యానికి గురైన హన్ నదిని శుభ్రపరిచి దక్షిణ కొరియా ప్రభుత్వం పునరుద్ధరించింది. మొత్తం 494 కి.మీ. విస్తీర్ణంలో ఉన్న ఈ నది.. సియోల్ నగరంలో 40 కి.మీ. మేర ప్రవహిస్తోంది. ప్రక్షాళన తర్వాత శుభ్రంగా మారి, ఇప్పుడు సియోల్ నగరానికి ఒక ముఖ్యమైన పర్యాటక ప్రదేశం, జలవనరుగా మారింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పురపాలకశాఖ, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఈ నదిని పరిశీలించారు.

## కాళేశ్వరంపై నేటి నుంచి మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్

(మొదటి పేజీ తరువాయి)
సమావేశమయ్యారు. వీలైనంత త్వరగా తుది నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ డీజీని జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశించారు. ఆనకట్టలు నిర్మించిన సంస్థల ప్రతినిధులనూ జస్టిస్ పీసీ ఘోష్ విచారించనున్నారు. నిర్మాణానికి సంబంధించిన అన్ని రికార్డులు, సంస్థల లావాదేవీల వివరాలను కమిషన్ పరిశీలించనుంది. అఫిడవిట్ దాఖలు చేసిన వి. ప్రకాశ్‌ను కూడా విచారించనుంది. ఎన్డీఎస్‌ఏ, కాగ్ నివేదికల ఆధారణంగా విచారణ జరగనుంది.

## అలజడులు సృష్టించే వారిని వదలబోం


(మొదటి పేజీ తరువాయి)
అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు, వ్యక్తులు ఎవరూ దేవాలయాలపై రాజకీయాలు చేయవద్దని మంత్రి సురేఖ విజ్ఞప్తి చేశారు. దైవాన్ని మతాల ప్రాతిపదన విభజించవద్దని హితవు పలికారు. చారిత్మ్రకమైన ఈ హైదరాబాద్ నగరం మత సామరస్యతకు, సర్వమతాల సంరక్షణకు ఆలవాలంగా ఉండి, గంగా జమునా తెహజీబ్ ను కాపాడుకుంటూ వస్తుందని మంత్రి సురేఖ అన్నారు. సికింద్రాబాద్ లోని దేవాలయంలో 'ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసం' ఘటనను రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకున్నదని అన్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే నిందితున్ని అరెస్టు చేశామని గుర్తు చేశారు. నిందితునికి చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సర్కారు చేతల ప్రభుత్వమని, మాటల ప్రభుత్వం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఈ ఘటనలో కొంతమంది అల్లరి మూకలు చేరి, మతసామరస్యతకు భంగం కలిగేలా చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజకీయం చేయడం సరికాదన్నారు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా చర్యలు చేపట్టిందని అన్నారు. సంఘటన జరిగిన వెంటనే అక్కడికి దేవాదాయ శాఖ అధికారులను పంపించి సమగ్ర వివరాలు సేకరించినట్టు మంత్రి తెలిపారు. ఈ రోజు నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. మిగతా పార్టీల మాదిరి తాము గుడుల పై, ప్రజల నమ్మకాల పై రాజకీయాలు చేయదలుచుకోలేదని మంత్రి స్పష్టం చేశారు. రేపు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సికంద్రాబాద్ లోని ముత్యాలమ్మ దేవాలయాన్ని సందర్శించాలని ఆదేశించినట్టు మంత్రి సురేఖ వెల్లడించారు. ఇటువంటి ఘటనల పట్ల దేవాదాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంయమనం పాటించాలనీ, హైదరాబాద్ నగర మత సామరస్యాన్ని కాపాడాలనీ మంత్రి సురేఖ ప్రజలకు పిలుపునిచ్చారు.

## చేతులు మారిన ధరణి

(మొదటి పేజీ తరువాయి)
బాధ్యతను మార్చడం వలన రాష్ట్రంలోని లక్షలాది కుటంబాలు సమస్యలు ,ఇబ్బందుల నుంచి బయటపడతాయని , అందరి భూ సమస్యలకు చక్కని పరిష్కారాలు త్వరలో లభిస్తాయని మంత్రి పొంగులేటి వివరించారు. 2020 అక్టోబర్ లో తీసుకువచ్చిన ధరణి పోర్టల్ దారితప్పి లోపభూయిష్టంగా మారి ప్రజానీకానికి శాపంగా మారిందన్నారు. ధరణి పేరుతో జరిగినా దగా వల్ల తెలంగాణా సమాజం తీవ్రంగా నష్టపోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలను సమాధి చేసిందని మంత్రి ఆరోపించారు. ఆ నాటి ప్రభుత్వ పెద్దల దాష్టీకానికి ప్రజలు అనుభవించిన బాధలు అన్నీ ఇన్నీకావని, కాంగ్రెస్ ప్రభుత్వం వీటికి చరమగీతం పాడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## హోటల్‌లో వెంటపడిన కుక్క..

### మూడో అంతస్తు నుంచి పడి యువకుడి మృతి



**విశ్వంభర, శేరిలింగంపల్లి:** హైదరాబాద్‌లోని చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. హోటల్‌లో కుక్క వెంటపడటంతో మూడో అంతస్తు నుంచి పడి యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. రామచంద్రాపురంలోని అశోక్‌నగర్‌లో తెనాలి యువకుడు ఉదయ్ (23) ఉంటున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి అతడు చందానగర్‌లోని వీవీప్రైడ్ హోటల్‌కు వెళ్లాడు. హోటల్ మూడో అంతస్తు బాల్కనీలోకి వెళ్లగానే ఓ కుక్క కనిపించడంతో ఉదయ్ దాన్ని తరిమేందుకు యత్నించాడు. అది వెంటపడటంతో తప్పించుకునేందుకు పరిగెత్తాడు. ఈ క్రమంలో హోటల్ కిటికీ నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగినా బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. విషయం బయటకు పొక్కడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

# పరస్పరం సహకరించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)
బలోపేతం చేయడం' ఈ ఏడాది సదస్సు ప్రధాన నినాదం. ఇందులో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇతర నేతలు పాల్గొంటున్నారు. బాత్రూమ్‌లో జారిపడి తలకు గాయమైన కారణంగా బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా సదస్సుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతారు. కాగా బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో బ్రిక్స్ కూటమి ఏర్పాటైంది. ఇప్పుడు దాన్ని విస్తరించి ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలకూ సభ్యత్వం ఇచ్చారు. కూటమి విస్తరణ తర్వాత ఇదే తొలి శిఖరాగ్ర సదస్సు. ప్రధాని మోదీ రష్యా పర్యటన చేపట్టడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ ఇంకా పలువురు దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

**రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి మేం సాయపడతాం**
రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో శాంతి, స్థిరత్వం తిరిగి నెలకొనడానికి తాము పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. తామంతా చేసే ప్రయత్నాలు మానవత్వానికి ప్రాధాన్యమిస్తాయని చెప్పారు. రానున్న కాలంలో ఈ సమస్య పరిష్కారానికి సాధ్యమైన సహకారం



అందించడానికి భారత్ సిద్ధంగా ఉందని చెప్పారు. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తాము నమ్ముతున్నట్లు మోదీ పునరుద్ఘాటించారు. రష్యా, ఉక్రెయిన్ సమస్యపై తాము నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. జులైలో జరిగిన భారత్-రష్యా శిఖరాగ్ర సమావేశం ప్రతి రంగంలో సహకారాన్ని బలోపేతం చేసిందని వెల్లడించారు. మూడు నెలల్లో రష్యాలో తాను చేస్తున్న ఈ రెండో పర్యటన, భారత్-రష్యా మధ్య లోతైన సమన్వయాన్ని, స్నేహాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు రష్యా వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బ్రిక్స్ సదస్సుకు విజయవంతంగా నిర్వహించినందుకు రష్యాను అభినందించారు. చాలా దేశాలు ఈ గ్రూప్‌లో చేరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.


**మోదీ-జిన్‌పింగ్ భేటీకి సిద్ధం..**
బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రష్యా వెళ్లిన ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ కానున్నారు. బుధవారం వీరిద్దరూ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు విదేశాంగ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఐదేళ్ల తర్వాత తొలిసారిగా ఇరువురు నేతలు భేటీ కానుండటం గమనార్హం. ఈ విషయాన్ని విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ధ్రువీకరించారు. సరిహద్దు గస్తీకి సంబంధించి భారత్-చైనాల మధ్య కీలక ఒప్పందం జరిగిన నేపథ్యంలో ఇరుదేశాధినేతల మధ్య తాజా భేటీ జరగనుండటం విశేషం. కజాన్‌లో జరుగుతోన్న 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు రష్యా వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చర్చలు, సంప్రదింపులతో ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కనుగొనాలన్నదే భారత్ వైఖరి అని స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన సహాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలోనే చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇతర దేశాధినేతలతో ప్రధాని మోదీ సమావేశం కానున్నారు. ఐదేళ్లలో తొలిసారి!

# పోలీసులపై మేం దాడి చేయలేదు

(మొదటి పేజీ తరువాయి)
లుంబిని పార్క్, మక్కా మసీదులో బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఆలయాల మీద దాడి జరుగుతుంటే అడ్డుకునే దమ్ము ముఖ్యమంత్రికి లేదన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఇటీవల సికింద్రాబాద్‌లో ప్రశాంత వాతావరణంలో ర్యాలీ నిర్వహించాం. బీజేపీ కార్యకర్తల ముసుగులో కొందరు చేరి రాళ్లు, చెప్పులు విసిరారు. పోలీసులు మా కార్యకర్తలను చితకబాదారు. కాషాయ పార్టీ ఎప్పుడూ ప్రజల రక్షణ, శాంతిని మాత్రమే ఆకాంక్షిస్తుంది. ప్రతీకారం అనేది మా పార్టీలోనే లేదు. కాంగ్రెస్ పార్టీ పేరుకే లౌకికవాదం కానీ, మతోన్మాదులను ప్రోత్సహిస్తోంది. కాంగ్రెస్ సర్కార్ హయాంలో హైదరాబాద్‌లో అనేక సం దర్భాల్లో బాంబులు పేలాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతోంది" అని ఈటల రాజేందర్ తెలిపారు.
స్లీపర్ సెల్స్ ఉన్నాయని కేంద్ర నిఘా సంస్థలు ఉన్నాయని చెబుతున్నాయి తప్పితే ఇక్కడి ప్రభుత్వం గుర్తించడం లేదని ఆయన అవేదన వ్యక్తం చేశారు. హిందువుల మీద విషం చిమ్మేలా సమావేశాలు జరుగుతుంటే ఎందుకు నిరోధించడం లేదని ప్రశ్నించారు. ఉగ్రవాదులు ఎవరూ, స్లీపర్ సెల్స్, సంఘ విద్రోహ శక్తులు ఎవ్వరో నిగ్గు తేల్చేల్సిన అవసరం ఉందన్నారు. గత రెండు, మూడు నెలలుగా రాష్ట్రంలో దేవాలయాలు, విగ్రహాల ధ్వంసం జరుగుతోందని అవేదన వ్యక్తం చేశారు.
కాంగ్రెస్ వైఖరి వల్ల ఎన్నోసార్లు మతకలహాలు : ఎవరు చేస్తున్నారు.. ఎందుకు చేస్తున్నారో ప్రభుత్వం ఒక్కటి కూడా బయట పెట్టలేదని ఈటల దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నిస్తే సంఘ విద్రోహ శక్తులుగా ముద్ర వేస్తుందని మండిపడ్డారు. బాంబు దాడులు, హత్యలను ఏ మత పెద్దలు హర్షించరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా అక్రమ అరెస్టులను ఆపాలని, అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# అసెంబ్లీ ప్రాంగణంలోకి కౌన్సిల్ భవనం

(మొదటి పేజీ తరువాయి)
మంత్రులు సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని.. ఎక్కడా చారిత్రక వైభవానికి ఇబ్బందులు లేకుండా భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆగాఖాన్ ప్రతినిధులకు దిశానిర్ధేశం చేశారు. భవనానికి కావల్సిన ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులపై టెండర్లు పిలవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశంలో పాల్గొన్న ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందనకు ఆదేశాలు జారీ చేశారు. ఆగాఖాన్ ట్రస్ట్ కు సంబంధించిన పెండింగ్ లో ఉన్న రూ. 2 కోట్ల రూపాయలను సమావేశం నుంచే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి అప్పటికప్పుడే విడుదల చేయించారు. బిల్లుల కోసం ప్రజోపయోగమైన పనులు ఆపొద్దని అధికారులకు సూచించిన మంత్రి, ఏదైనా బిల్లులు పెండింగ్ లో ఉంటే తనకు గానీ, మంత్రి శ్రీధర్ బాబుకు చెప్పినా వెంటనే నిధులు విడుదల అయ్యేలా చూస్తామని చెప్పారు. ఈ హెరిటేజ్ భవనం అందుబాటులోకి వస్తే.. కౌన్సిల్ హాల్ ను అసెంబ్లీ



భవనంలోకి మార్చవచ్చని పార్లమెంట్ తరహాలో వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే ప్రజలకు అసెంబ్లీ మరింత చేరువ అవుతుందని ఆయన తెలిపారు. అంతేకాదు, పార్కింగ్, సెక్యూరిటీ సిబ్బందికి ప్రత్యేక గదులను నిర్మించాల్సిన అవసరం ఉందని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు పనులు వేగంగా సాగేందుకు ప్రత్యేకంగా ఒక ఎస్.ఈ స్థాయి అధికారిని నియమించి పనులను పర్యవేక్షించాలని ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందనకు ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో అలసత్వానికి తావులేకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. లోక్ సభ, రాజ్యసభ లో ఉన్నట్టుగానే అసెంబ్లీ భవన ప్రాంగణంలోనే సెంట్రల్ హాల్ ను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. అంతేకాదు, తన ఐటీ శాఖ ద్వారా అసెంబ్లీకీ అవసరమైన నెట్ వర్కింగ్ సేవలను అందించేందుకు కావాల్సిన ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే ఆమోదం తెలుపుతానని ఆయన తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు గ్రూప్-3, గ్రూప్-2 వాయిదా వేయండి

(మొదటి పేజీ తరువాయి)
చేయాలని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యులు ధర్మాసనం చారిత్రాత్మక తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ వర్గీకరణ తక్షణమే అమలు చేస్తామని.. త్వరలో జరుగబోయే పరీక్షల్లోనూ వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలులో న్యాయపరమైన చిక్కులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 12న జస్టిస్ షమీం అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జీవో జారీ చేసిందన్నారు. ఈ క్రమంలో దాదాపు ఎన్నో ఏళ్ల నుంచి వర్గీకరణ ఫలాలకు దూరంగా వివక్షకు గురవుతున్న ఎస్సీ సామాజిక ఉపకులాలకు గొప్ప అవకాశం వర్గీకరణ అని తెలిపారు. వర్గీకరణ అమలులోకి వచ్చిన తర్వాతే రాబోయే గ్రూప్-3, గ్రూప్-2 పరీక్షలు నిర్వహించాలని.. ఎస్సీ సామాజిక వర్గ ఉపకులాలకు రిజర్వేషన్లు దక్కేలా చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం రాబోయే నోటిఫికేషన్‌లో ఇంత పెద్ద మొత్తంలో ఖాళీల సంఖ్య ఉండకపోవచ్చని.. వర్గీకరణ అమలు జరిగే వరకు పరీక్షలు వాయిదా వేయాలని.. అదనంగా పోస్టులు కలిసి మిగతా సామాజిక వర్గాలకు న్యాయం చేయాలని కోరారు.

## అణు శక్తికి భారత్ పదును

(మొదటి పేజీ తరువాయి)
సామర్థ్యంతో కూడిన దేశ తొలి బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థ కలిగిన 4వ జలాంతర్గామి (ఎస్ఎస్‌బీఎన్)ని ఆవిష్కరించినట్లు సమాచారం. విశాఖపట్టణంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగినట్లు తెలుస్తోంది. దామగుండంలో వీఎల్ఫ్ రాడార్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన మర్నాడే ఈ కార్యక్రమం జరిగినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ ఏడాది ఆగస్టులో ఎస్ఎస్‌బీఎన్ అరిఘాత్‌ను రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నౌకాదళానికి అందజేశారు. వచ్చే ఏడాదికి ఈ శ్రేణిలో నాలుగో సబ్‌మెరైన్ ఐఎన్ఎస్ అరిధమాన్‌ను సిద్ధం చేయనున్నట్లు నేవీ అధికారులు పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో శత్రువులను ఎదుర్కోవడంలో జలాంతర్గాములు మెరుగైన పాత్ర పోషిస్తాయని నాడు వెల్లడించారు. సాధారణంగా భద్రతా కారణాల రీత్యా వీటిని తొలుత కోడ్ నేమ్‌లతో పిలుస్తారు. ఈ క్రమంలోనే ఐఎన్ఎస్ చక్రకు 'ఎస్1' అని పేరు ఇవ్వగా.. ఎస్2గా అరిహంత్, ఎస్3గా అరిఘాత్, ఎస్4గా అరిధమాన్ ఉన్నాయి. తాజాగా ఆవిష్కరించిన సబ్‌మెరైన్‌కు ఎస్4 అని కోడ్ నేమ్ ఇచ్చారు. దీనికి త్వరలోనే అధికారిక పేరు ఇవ్వనున్నారు.ఈ న్యూక్లియర్ సబ్ మెరైన్‌ను దాదాపు 75 శాతం స్వదేశీ టెక్నాలజీతో తయారుచేశారు. 3,500 కిలోమీటర్ల రేంజ్ ప్రయాణించగల కే-4 న్యూక్లియర్ బాలిస్టిక్ క్షిపణులను అమర్చే సామర్థ్యం వీటికి ఉంది. ఈ క్షిపణులను నిట్టనిలువుగానూ ప్రయోగించే వీలు ఉంటుంది. ఎస్ఎస్‌బీఎన్ శ్రేణిలో తొలి తరం అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్‌లో 750 కిలోమీటర్ల రేంజ్ గల కే-15 న్యూక్లియర్ క్షిపణులను అమర్చే వీలుండగా.. ఆ తర్వాత అప్‌గ్రేడ్ చేసిన సబ్‌మెరైన్లలో కే-4 క్షిపణులను అమర్చే సామర్థ్యం ఉంది.

## ఒకే దేశం ఒకే ఎన్నిక తర్వాత అధ్యక్ష తరహా పాలన

- జమిలి ఎన్నికలతో ఖర్చు తగ్గుతుందనడం బూటకం
- బీవీ రాఘవులు




**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం ఒకే ఎన్నిక తీసుకురావాలని చూస్తోందని.. దీని వల్ల చాలా ప్రమాదం ఉందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. ఒకే దేశం ఒకే ఎన్నికను దేశంలోని అనేక పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఒకే దేశం ఒకే ఎన్నిక తర్వాత అధ్యక్ష తరహా పాలన వస్తుందన్నారు. జమిలి ఎన్నికల వల్ల ఖర్చు తగ్గిపోతుందనేది బూటకమని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన 'ఒకే దేశం- ఒకే ఎన్నికను వ్యతిరేకించండి' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మోదీ సర్కార్‌పై మండిపడ్డారు. అభివృద్ధికి ఎన్నికల కోడ్‌కు ముడిపెట్టడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను రద్దు చేసే హక్కు ప్రజలకే ఉంటుంది తప్ప.. ప్రధాని మోదీకి లేదంటూ ధ్వజమెత్తారు.

# కేటీఆర్ దండుపాళ్యం బ్యాచ్ గ్యాంగ్ లీడర్

- ఆయనకు రాజకీయ జ్ఞానం ఉందో లేదో అర్థం కావడం లేదు
- దామగుండంపై విమర్శలు పిల్లచేష్టలు
- రేవంత్ రెడ్డిని ఎలా తిట్టాలో ఆయన వద్దే శిక్షణ తీసుకో
- కేటీఆర్ కు జగ్గారెడ్డి సలహా




**విశ్వంభర, హైదరాబాద్ :** రేవంత్ రెడ్డిని ఎలా తిట్టాలో, ఎలా ఎదురుదాడి చేయాలో ఆయన వద్దకే వెళ్లి శిక్షణ తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చురకలు అంటించారు. కావాలంటే తాను సీఎంకు చెప్పి శిక్షణ ఇప్పిస్తానన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి బీఆర్ఎస్ దండుపాళ్యం బ్యాచ్‌లా మారిపోయిందని, దానికి కేటీఆర్ గ్యాంగ్ లీడర్‌గా మారాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కష్టపడి ఒక్కో మెట్టు ఎక్కి సీఎం స్థాయికి వచ్చాడన్నారు. పేదప్రజల బాధలు ఆయనకు తెలుసునన్నారు. ఒకవేళ సీఎం రేవంత్ రెడ్డి తిట్లదండకం అందుకుంటే కేటీఆర్ తట్టుకోలేడన్నారు. కేటీఆర్ ఓ నాజూకు లీడరని ఎద్దేవా చేశారు. ఆయన తండ్రి కేసీఆర్‌కు మాత్రం బాధలు తెలుసునని, ఆయన ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని రాజకీయంగా పైకి ఎదిగారన్నారు. కానీ కేటీఆర్ అలా కాదన్నారు. తాము బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగానే ఎదుర్కొంటామన్నారు. కేసులు, పోలీసులు అంటూ బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయడం తమకు అవసరం లేదన్నారు. వికారాబాద్ జిల్లాలోని దామగుండం నేవీ రాడార్ ప్రాజెక్టుపై కేటీఆర్ చేసిన విమర్శలు పిల్లచేష్టలన్నారు. కనీస రాజకీయ అవగాహన లేని నాయకుడని జగ్గారెడ్డి మండిపడ్డారు. దామగుండం కి భూమి కేటాయించినప్పుడు 9 లక్షల చెట్లు ఉన్నాయని కేటీఆర్ కి ఎందుకు గుర్తు లేదు అని అన్నారు. 9 లక్షల చెట్లు పోతాయి అని తెలిసి ఎందుకు జీవో ఇచ్చారో చెప్పు కేటీఆర్ అని ప్రశ్నించారు. రాడార్ వ్యవస్థ వెయ్యి కిలోమీటర్లో ఉన్నా సిగ్నల్ అందిస్తుందని సముద్ర మట్టానికి ఎత్తులో దామగుండం ఉంది కాబట్టి రాడార్ అక్కడ పెట్టారన్నారు. ఇవన్నీ కేటీఆర్ కి తెలియదన్నారు. అంతా బుక్ నాలెడ్జి తప్ప ప్రాక్టికల్ నాలెడ్జి లేదన్నారు. మూసీ అక్కడే పుట్టింది అంటున్నావు, మరి జీఓ ఇచ్చినప్పుడు గుర్తు లేదా మూసీ గురించి కేటీఆర్‌కు వీటికి సమాధానం చెప్పాలన్నారు. కేటీఆర్ పదేళ్లు రాజభోగాలు అనుభవించాడు, ఇప్పుడు అవన్నీ దూరం అవ్వడంతో పిచ్చి లేసి మాట్లాడుతున్నారని తెలిపారు . ఐదారు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్ ఫండింగ్ చేసిందని జగ్గారెడ్డి ఆరోపించారు. కర్ణాటకలో కుమారస్వామి పార్టీకి ఫండింగ్ చేయలేదా? అని ప్రశ్నించారు. కేజ్రీవాల్‌కు కూడా పంపినందుకే బీజేపీ ఆయన చెల్లి కవితను జైల్లో పెట్టిందన్నారు. నవీన్ పట్నాయక్‌కు కూడా ఫండింగ్ చేశారని ఆరోపించారు. నాలుగైదు రాష్ట్రాలకు డబ్బులు ఫండింగ్ చేసిన నువ్వు మాపై నిందలు వేయడం ఏంటని ప్రశ్నించారు.మేము ఎదురు దాడి చేయడం లేదని తమాషా చేస్తున్నావా? అని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

- మరో రెండురోజుల పాటు వానలు
- కొన్ని జిల్లాలకు ఎల్లో ఎలర్ట్ జారీ



**విశ్వంభర, హైదరాబాద్:** బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. నగరంలోని కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, నిజాంపేట, కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీ నగర్, మూసాపేట, బాచుపల్లి, బహదూర్‌పల్లి, గుండ్ల పోచంపల్లి, సుచిత్ర, కొంపల్లి ప్రాంతాలతో పాటు సూరారం, జీడిమెట్ల, జగద్గిరి గుట్ట, బాలానగర్, కుత్బుల్లాపూర్, పేట్‌బషీరాబాద్ ప్రాంతాల్లో వర్షం పడింది. ఈ నేపథ్యంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసుల నుంచి వచ్చే వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు రాష్ట్రంలో రెండు రోజులపాటు ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్, వరంగల్, రంగారెడ్డి, హైదారా బాద్‌తో పాటు కామారెడ్డి జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. సోమవారం తూర్పు- మధ్య బంగాళాఖాతం పరిసర ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో కొనసాగిన అల్పపీడనం తూర్పు- మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో ప్రస్ఫుటమైన అల్పపీడనంగా ఏర్పడిందని వెల్లడించింది. ఇది పశ్చిమ- వాయువ్య దిశగా కదులుతూ ఇవాళ ఉదయం ఐదున్నర గంటలకు అదే ప్రాంతంలో వాయుగుండంగా ఏర్పడినట్లు పేర్కొంది. నేడు బంగాళాఖాతంలో తుఫాన్ : ఇది పశ్చిమ- వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి అటు తరువాత ఇది బుధవారం తూర్పు- మధ్య బంగాళాఖాతంలో తుఫాన్‌గా ఏర్పడే అవకాశం ఉన్నట్లు చెప్పింది. ఇది వాయువ్య దిశగా కదులుతూ ఈ నెల 24న ఉదయానికి తీవ్ర తుఫాన్‌గా ఉద్ధృతి చెంది ఒడిశా పశ్చిమ బెంగాల్ తీరాన్ని 24వ తేది రాత్రి లేదా 25న ఉదయం పూరి, సాగర్ ఐలండ్స్ మధ్య దాటే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావం తెలంగాణపై ఉండే అవకాశం లేదని తెలిపింది. సోమవారం తమిళనాడు పరిసర ప్రాంతాలలో సముద్ర మట్టం నుంచి 5.8 కి.మీ ఎత్తు వరకు వరకు విస్తరించి కొనసాగిన చక్రవాతపు ఆవర్తనం ఇవాళ బలహీనట్లు వెల్లడించింది.

# ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి గురుకులాలను బాగు చేయాలి

**మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్**

**విశ్వంభర, మెదక్:** మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ గురుకులానికి చెందిన నలుగురు విద్యార్థినులు విద్యుదాఘాతానికి గురవ్వడంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. విద్యార్థినులు కరెంట్ షాక్ తగిలి గాయపడటం దురదృష్టకరమని అన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం గురుకుల విద్యార్థులకు శాపమవుతున్నదని.. ప్రభుత్వ పట్టింపు లేనితనం పిల్లల ప్రాణాల మీదకు తీసుకొస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఇలాంటివి మళ్లీ జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో పాము కాట్లు, కుక్క కాట్లు, ఎలుక కాట్లు, ఫుడ్ పాయిజన్ కేసులు సర్వసాధారణమయ్యాయని హరీశ్‌రావు అన్నారు. ఇప్పుడు ఆ జాబితాలో కరెంట్ షాకులు చేరాయని మండిపడ్డారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని అన్నారు. గాడి తప్పిన గురుకులాలను బాగు చేయాలని డిమాండ్ చేశారు.

# సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్‌గా వైద్య విధాన పరిషత్

**ఆస్కి ప్రతిపాదనలపై ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహా సమీక్ష**



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) హాస్పిటళ్ల పనితీరుపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ సీ రాజనర్సింహ సమీక్షించారు. దీంతోపాటు సెకండరీ హెల్త్ కేర్ డైరక్టరేట్‌గా తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ)ని బలోపేతం చేయడానికి తీసుకోవల్సిన చర్యలపై అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) రూపొందించిన ప్రతిపాదనలపైనా ఆయన సమీక్షించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, అధికారులు శ్రీనివాస్, పద్మజ, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) కన్సల్టెంట్లు సుబోధ్, వీరభద్రయ్య, శ్రీదేవి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. టీవీవీపీని సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్‌గా మార్చడం కోసం రూపొందించిన ప్రతిపాదనలను ఆస్కి కన్సల్టెంట్లు మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

**ఆసుపత్రుల్లో అన్ని వసతులు**

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ సీ రాజనర్సింహ మాట్లాడుతూ టీవీవీపీ పరిధిలోని జిల్లా, ఏరియా హాస్పిటళ్లలోనే ఎక్కువ మంది రోగులు చికిత్స పొందుతున్నారని చెప్పారు. కనుక ఆయా హాస్పిటళ్లలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రస్తుత అవసరాలను మాత్రమేగాకుండా, భవిష్యత్ అవసరాలు, ఓపీ, ఐపీ, పడకల స్ట్రెంత్‌ను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని సూచించారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ (ఐపీహెచ్ఎస్) ప్రకారం హాస్పిటళ్లలో క్లినికల్, నాన్ క్లినికల్ స్టాఫ్ ప్యాటర్న్ ఉండాలన్నారు. అవసరమైన అదనపు పోస్టులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని దామోదర్ సీ రాజనర్సింహ అన్నారు. డాక్టర్లు, ఇతర ఉద్యోగుల ప్రమోషన్లు, ఇతర సర్వీసు అంశాల్లో ఇబ్బందులు, లీగల్ చిక్కులు తలెత్తకుండా ప్రతిపాదనలు ఉండాలన్నారు. ఏపీలో ఏవీవీపీని సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చినట్టు అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, అక్కడ తలెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుని, అవి పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. చాలాచోట్ల డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ టీచింగ్ హాస్పిటల్స్ కిందకు వెళ్లిపోయాయని మంత్రి రాజ నర్సింహకు అధికారులు తెలిపారు. కొన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు టీవీవీపీ పరిధిలోకి వచ్చాయని అధికారులు తెలిపారు. టీవీవీపీ పరిధిలోకి వచ్చిన పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు అవసరమైన స్టాఫ్‌తోపాటు, ఏమేం ఎక్విప్‌మెంట్ అవసరమో ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి సూచించారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, గైనిక్, పీడియాట్రిక్ వంటి బేసిక్ వైద్య సేవలు అన్నీ టీవీవీపీ హాస్పిటళ్లలో అందుబాటులో ఉండాలన్నారు. 85 శాతం మంది రోగులకు జిల్లాల్లోనే వైద్యం అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యం అని, ఈ లక్ష్యం నెరవేరాలంటే జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు.

**త్వరలో వరంగల్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటన**

హన్మకొండలోని కాకతీయ మెడికల్ కాలేజీ, దానికి అనుబంధంగా ఉన్న ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్, టీబీ, కంటి దవాఖానాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్షించారు. త్వరలో తానే వరంగల్‌లోని ఏజీఎం దవాకానకు వస్తానని అన్ని వార్డులు పరిశీలిస్తానని చెప్పారు. కేఎంసీ పరిధిలోని 5 హాస్పిటల్స్‌లో 1525 బెడ్లు అందుబాటులో ఉన్నాయని మంత్రికి అధికారులు వివరించారు. ఇందుకు అనుగుణంగా ఏమేం కావాలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు మంత్రి సూచించారు. ఎంజీఎం హాస్పిటల్‌లో రోగుల ఇక్కట్లపై ఆరా తీసిన మంత్రి, అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వాలు ఎన్నికోట్లు ఖర్చు చేసినా, అంతిమంగా ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులు, డాక్టర్లదేనని దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించే బాధ్యత తమదన్నారు. ఏయే సమస్యలు ఉన్నాయో, ఏమేం అవసరాలు ఉన్నాయో రెండ్రోజుల్లో పూర్తి వివరాలతో ప్రతిపాదనలు అందించాలని మంత్రి ఆదేశించారు. కొత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అందుబాటులోకి వచ్చే వరకూ ఇప్పుడున్న హాస్పిటల్స్‌లో రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు అందించాలన్నారు. ఇందుకోసం అవసరమైన రిపేర్లు చేయించాలని అధికారులకు సూచించారు. పేషెంట్ల పట్ల సానుభూతితో, చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయ లోపం ఉండకూడదన్నారు.










# ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లతో బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం

వేలాది సంవత్సరాలుగా ఈ దేశంలో కింది కులాలకు అనాదిగా అన్ని అవకాశాలకు దూరం చేయడమే గాక దోపిడీకి, వివక్షకు గురి చేస్తున్నారు. కులాధారిత వ్యవస్థలో చారిత్రకంగా, సామాజికంగా, ఆర్థికంగా,సాంస్కృతికంగా అన్ని రకాల నష్టాలను ఎదుర్కొన్న ఈ కింది కులాలకు , తెగలకు ఆర్థిక అసమానతలను దూరం చేసి, ప్రజాస్వామ్యాన్ని అర్థవంతం చేయడానికి కోసం రిజర్వేషన్లు ఇచ్చారు. రాజ్యాంగంలోని 15, 16 ఆర్టికల్స్ ప్రాతిపాదికగా వచ్చిన రిజర్వేషన్లు న్యాయస్థానాల తీర్పులు, పార్లమెంట్ చట్టాలు, పరిపాలన విధానాల మీదుగా విస్తరించి ఇప్పుడు ఈ స్థితిలో ఉన్నాయి. అయితే ఇక్కడ కీలక విషయం ఏమిటంటే ,అందరూ అనుకునేటట్లు రిజర్వేషన్లు అనేవి ఆర్థిక సదుపాయాలు కాదు. వాటి కోసమే అయితే రిజర్వేషన్లు అవసరం లేదు. పేదరిక నిర్మూలనకు పథకాలు సరిపోతాయి. ఎవరైతే 90% ఉన్న కింది కులాలకు ఆయా రంగాలలో 10 శాతం కూడా ప్రాతినిధ్యం లేదో ఆ రంగాలలో ప్రాతినిధ్యం కల్పించడం కోసం రిజర్వేషన్లు ఏర్పాటు చేశారు.

**మండల్ కమిషన్**

**ఉద్యమం- అమలులో అవరోధాలు**

దేశంలో పశువులకు ఉన్న విలువ కూడా బీసీలకు లేదు. ఎందుకంటే? పశువుల గణన ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉంటుంది. 1931 లో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన బీసీల కులగణనే నేటికీ దిక్కు. దాదాపు 100 సంవత్సరాలు కావస్తున్నా బీసీ కులగణన అనగానే ప్రభుత్వాలు అలసత్వంగా మాట్లాడుతాయి. స్వాతంత్ర్యం అనంతరం నెహ్రూ ప్రభుత్వం బీసీల కోసం 1953లో కాకకాలేల్కర్ కమిటీ నియమించినా దాని రిపోర్టుని బుట్ట దాఖలు చేశారు. బీసీల రిజర్వేషన్స్ కోసం 1978లో అప్పటి మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం బీపీ మండల్ అధ్యక్షతన




ఐదుగురు సభ్యులతో రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటు చేసింది. మండల్ కమిషన్ దేశ మొత్తం తిరిగింది. ఈ క్రమంలో ఢిల్లీలో , వివిధ నగరాల్లో మండల్ వ్యతిరేకత పతాక స్థాయిలో ఉన్నప్పుడు, వీధుల్లో అగ్రకుల వ్యక్తులు క్షవరం చేస్తున్నట్లు, బూట్లకు పాలిష్ చేస్తున్నట్లు, కుండలు చేస్తున్నట్లు, పశువులను కాస్తున్నట్లు, బట్టలు ఉతుకుతున్నట్లు నిరసన తెలియజేశారు. బీసీలు చేసే పనులను అవహేళన చేస్తూ, బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే తాము ఈ పనులు చేయాల్సి వస్తుందని నిరసన వ్యక్తం చేశారు. ఇంతటి ఓర్వలేనితనాన్ని నడివీధుల్లో, ఎగువ కులాల వాళ్ళు ప్రదర్శించారు. ఇదే బీసీ రిజర్వేషన్ల అమలును అడ్డుకుంది. 1980 డిసెంబర్ 31న మండల్ కమిషన్ నివేదికను సమర్పించింది. మండల్ కమిషన్ చేసిన 40 సిఫారసుల్లో ఒకటైన విద్యా, ఉద్యోగాలలో ఓబీసీలకు రిజర్వేషన్లను 1990 ఆగస్టు 7న అమలు చేస్తూ అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ అగ్రకులాల వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 1992 కోర్టు ఉత్తర్వుల్లో భాగంగా రిజర్వేషన్లు 50 శాతానికి పైగా మించకూడదని సీలింగ్ విధిస్తూ, ఓబీసీలకు విద్యా, ఉద్యోగాలలో 27% రిజర్వేషన్లు ఇవ్వవచ్చునని తీర్పు వచ్చింది. అంటే 70 శాతం ఉన్న బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే కేటాయించారు. ఈ విధంగా న్యాయస్థానం, అగ్రకులాలు బీసీల రిజర్వేషన్లను అడ్డుకున్నారు.

**సమాజంపై ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్స్ ప్రభావం**

ఈడబ్ల్యుఎస్ అనేది ఆయా రాష్ట్రాలు తమ రాష్ట్రాల్లోని అగ్రకుల పేదల శాతానికి అనుగుణంగా 10 శాతం వరకు ఇవ్వవచ్చు అని చట్టంలో చెబితే, ఆ రాష్ట్రంలో రెండు శాతం ఉన్నా కూడా 10 శాతం అమలు జరుగుతుంది. మరొక దోపిడీ ఏమిటంటే ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్స్ కేటగిరిలో పోస్టుల కేటాయింపు అనేది ఓపెన్ కేటగిరిలో కేటాయించిన పోస్టుల్లో మాత్రమే 10 శాతం ఈడబ్ల్యుఎస్ వర్గానికి కేటాయించాలి. అలా కాకుండా మొత్తం పోస్టుల నుండి ఈడబ్ల్యుఎస్ పోస్టులను కేటాయించి, బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగుల భవిష్యత్తు నే కాలరాస్తున్నారు. ఈ వర్గాల నిరుద్యోగ యువత ఈ ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్స్ వల్ల ఎలాంటి అన్యాయానికి గురైతుందో ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకోవచ్చు. డీఎస్సీ -2024 ద్వారా మొత్తం 11000 ఉపాధ్యాయ ఉద్యోగాలను ప్రకటిస్తే ,ఓపెన్ కేటగిరిలో 3648 , ఈడబ్ల్యుఎస్ కోటాలో 1100 ఉద్యోగాలు కేటాయించారు. తెలంగాణ రాష్ట్రంలో నాలుగు శాతం లేని అగ్రకులాలు తమ వాటా కంటే ఎక్కువ రిజర్వేషన్లు అనుభవిస్తూనే అనధికారికంగా, అధికారికంగా కలిపి 4748 అంటే దాదాపుగా సగం ఉద్యోగాల కోసం పోటీపడ్డారు. మొదటి నుండి అన్ని సౌకర్యాలను అనుభవిస్తున్న ఈ ఎగువ కులాల వాళ్ళే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు పొందుతున్నారు. అలాగే నియామకాల్లో కూడా ర్యాంకింగ్స్ వారీగా విస్తుపోయే విషయాలు మనం చూడవచ్చు. గత 80 సంవత్సరాల నుండి రిజర్వేషన్లు ప్రతిభను దెబ్బతీస్తున్నాయి అని, ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ కల్పన చేయాలని నాడు మొత్తుకున్న ఆధిపత్య వర్గాలే, నేడు ఈడబ్ల్యుఎస్ విషయంలో నోరు మెదపడం లేదు. డిఎస్సీ 2024 లో వివిధ సామాజిక వర్గాల కటాఫ్ మార్కులు ఇలా ఉన్నాయి. ఓపెన్ క్యాటగిరిలో 200వ ర్యాంకు లోపు, బీసీలలో ఒక బీసీ- సీ తప్పించి మొత్తం బీసీ లలో 400 ర్యాంకు లోపు అలాగే ఎస్సీ కేటగిరిలో- 700, ఎస్టీ కేటగిరిలో- 1200 ర్యాంకు లోపు మరియు ఈడబ్ల్యుఎస్ కేటగిరిలో 2000 ర్యాంకు వరకు కటాఫ్ నిర్ణయించారు. దాదాపుగా తెలంగాణలోని అన్ని జిల్లాలలో ఈ విధంగానే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల కంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులకు ఉద్యోగాలు వచ్చాయి. చివరగా రిజర్వేషన్ పేదరిక నిర్మూలన పథకం కాదు. అయితే మరి ప్రత్యేక గ్రూపు పథకాలు ఎవరికి అవసరం అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఒక సమూహంగా ఒక కులం వివక్షకు గురైతే అప్పుడు ఆ గ్రూప్ కు ప్రత్యేక పథకం కావాలి. పేదరిక అనుకూల పథకంలో దళితులు వంటి వివక్షకు గురయ్యే, గ్రూపులకు సమాన అవకాశం లేదు, ప్రజా పంపిణీ పథకం వంటి పథకాల్లో ఇప్పటికీ పలు రకాల వివక్షను ఎదుర్కొంటున్నారు. ఈ రిజర్వేషన్లలో ఎదురయ్యే మరో విషయం ఏమిటంటే 5 ఎకరాల పొలం కలిగి లేదా సంవత్సర ఆదాయం 8 లక్షలు ఉన్న ఎగువ కులాల పేదలు, ప్రభుత్వ ప్రమేయం లేకుండా పేదరికం నుండి బయటపడలేరా? కాబట్టి ఎగువ కులాలకు రిజర్వేషన్ కల్పించడం పేదరిక నిర్మూలన కాదు గదా, పైపెచ్చు పలు రంగాలలో వారి ప్రాతినిథ్యాన్ని ప్రణాళికా బద్ధంగా మరింత పెంచడమే అవుతుంది. ఎగువ కులాలలో నిరుద్యోగం ఉందంటే అది స్వచ్ఛందంగా వారంతట వారు నిరుద్యోగులుగా ఉండదలచారు. చివరగా చెప్పొచ్చేదేమిటంటే రిజర్వేషన్లు పేదరికాన్ని నిర్మూలించవు, అవి సామూహిక గుర్తింపు పట్ల ఉన్న వివక్షను ఎదుర్కోవడానికి రక్షణ కల్పిస్తాయి .

**ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్స్ కుట్రపూరితం**

**అయితే 2019లో ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు గుర్తిస్తూ 124వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. పార్లమెంటు దాన్ని ఆమోదించింది. 103వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టంగా రూపొంది వెంటనే అమలులోకి వచ్చింది. ఇది దేశ చరిత్రలో ఒక రికార్డు . అత్యంత వేగంగా అంటే 48 గంటల్లోగా బిల్లు పాసైన కారణంగా చట్టంగా రూపొందిన ఈ బిల్లు పలు రకాల అభ్యంతరాలకు, వివాదాలకు తెరలేపింది. ఈ చట్టాన్ని రిజర్వేషన్ల మీదనే గాక, రాజ్యాంగ పునాదుల మీద దాడిగా పరిగణించాలి. కొద్ది మినహాయింపులతో అన్ని బహుజన పార్టీలు ఈ విషయంలో స్పష్టంగా సంబంధం కోల్పోయి ఆధిపత్య పార్టీలతో కలిసి పని చేశాయి. మరీ దారుణంగా ప్రభుత్వం 5 ఎకరాల భూమి ,1000 గజాల ఇంటి స్థలం , 8 లక్షల ఆదాయ పరిమితి పెట్టింది. అంటే నెలకు 66000 అంటే ఎక్కువ అన్నమాట, అదే ఈ దేశంలో పేదవాడికి నిర్వచనం అయితే అప్పుడు ప్రపంచంలో ఇండియా ధనిక దేశం అవుతుంది. ఎకరం భూమి కలిగిన వ్యక్తి గ్రామీణ ప్రాంతాలలో లక్షలలో, పట్టణ ప్రాంతాలలో కోట్లలో ఉంటాడు. ఇండియాలోని ఆదాయ పన్ను సీలింగ్ ప్రకారం ఒక వ్యక్తి ఆదాయం 2.5 లక్షలు ఉంటే అతడు ఆదాయ పన్ను కట్టాలి. అలాంటప్పుడు సంవత్సరానికి రూ. 8,00,000 ఆదాయం కలిగిన వ్యక్తి ఆర్థికంగా పేదవాడని ఎట్లా సమర్థిస్తారు? ఇదే ఆదాయం ఓబీసీ విషయానికొస్తే క్రిమిలేయర్ అవుతుంది. 8 లక్షలు ఆదాయం 5 ఎకరాల భూమి ఉన్న అగ్రకుల వ్యక్తి పేదవాడు అయితే ,గుంట భూమిలేని దినసరి కూలి అయిన కింది కులాల ప్రజలను ఏమని నిర్వచించాలో సదరు బిల్లు చెప్పలేదు**



- పాక లింగమల్లు యాదవ్
రాష్ట్ర అధ్యక్షుడు,
ధర్మ టీచర్స్ యూనియన్
9966 946 883

# మానని గాయం చిత్తనూర్ ఇథనాల్ పోరాటం

- రైతులు, పోరాట కమిటీ నాయకులపై దమనకాండకు నేటితో ఏడాది

ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని పోరాడినందుకు రైతులపై, పోరాట కమిటీ నాయకులపై కంపెనీ యాజమాన్యం బీజేపీ, బిఆర్ఎస్ పోలీసుల చేత జరిపిన దమనకాండ(లాఠీచార్జ్) కు నేటితో సంవత్సరం అవుతున్న సందర్భంగా ఆ చారిత్రక పోరాటాన్ని ఒకసారి గుర్తు చేసుకుందాం.

అది పాలమూరు జిల్లాలో కొత్తగా ఏర్పడిన నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు గ్రామానికి సమీపంలో ఇథనాల్ పరిశ్రమను స్థానిక ప్రభుత్వ భూమిని, అసైన్డ్ భూములను, నక్ష బాటలను కబ్జా చేసి స్థాపించారు. ఆ కంపెనీ ప్రారంభంలో ఇక్కడ పండ్ల తోటలు, రైతులకు విత్తనాలు (సీడ్స్) ఇస్తామని మభ్యపెట్టి ఈ కంపెనీ మక్తల్, దేవరకద్ర, నారాయణపేట నియోజకవర్గాల మధ్యలో ఏర్పాటు చేశారు. అట్లా అబద్దాల పునాదులపై ఏర్పడిన ఈ కంపెనీ ఆనాటి నుండి నేటి వరకు అబద్ధాలతో , అక్రమాలతో నడుస్తూనే ఉంది. ఈ ప్రజా వ్యతిరేకమైన ఇథనాల్ కంపెనీని యజమానులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి కె.ఎల్. ఆర్ (కాంగ్రెస్) బండి పార్థసారథిరెడ్డి (బీఆర్ఎస్) స్థాపించారు. స్థానిక వనరులు నీళ్లు,గాలి,భూమి,ఆహార ధాన్యాలు ఉపయోగించి ఉత్పత్తి చేసే ఇథనాల్ వలన నీటి కాలుష్యం, గాలి,భూమి,భూగర్భ జలాల కాలుష్యం, వాగు వంపుల కాలుష్యం ఏర్పడుతుంది. జంతు జీవ జాలాలకు ప్రమాదకరం. మొత్తంగా పర్యావరణానికి జీవ వైవిద్యానికి ప్రమాదకరంగా తలపెట్టిన ఈ ఇథనాల్ కంపెనీ వద్దని ప్రజాస్వామిక పద్ధతిలో నిరసనను రెండు సంవత్సరాల పాటు మూడు నియోజకవర్గాలు కేంద్రంగా 6 మండలాల్లో ధర్నాలు, 150 గ్రామాల్లో ప్రచారం, 180 కిలోమీటర్ల పాదయాత్ర, సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ సభలు నిర్వహించారు. ఇథనాల్ కంపెనీ వల్ల జరిగే నష్టాలను ప్రజల, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాం. అంతేకాకుండా గ్రామ సర్పంచును, ఎంపీటీసీలను,జడ్పిటిసిలను, వార్డు మెంబర్లను, ప్రజాప్రతినిధులను కలిసి ఈ కంపెనీ వలన నష్టాలను వివరించి వారి మద్దతును కోరాం.ఈ మహత్తర ప్రజా పోరాటంలో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రస్తుత ఎమ్మెల్యేలు జి మధుసూదన్ రెడ్డి, వాకిటి శ్రీహరి పిలవకపోయినా కూడా పరిగెత్తుకుంటూ వచ్చి ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇది సహించని బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు, కంపెనీ యజమాన్యం కలిసి పోరాటాన్ని అణిచివేయాలని ప్రజలపై నిర్బంధాన్ని ఉపయోగించి అక్రమ కేసులు బనాయించి, చిత్రహింసలకు గురిచేసి జైలు పాలు చేశారు. పోరాటానికి నాయకత్వం వహించిన బండారి లక్ష్మయ్యను చిత్రహింసలకు గురిచేసి నెల రోజులు జైల్లో ఉంచి ఉద్యోగం నుండి సస్పెండ్ చేసి ఆర్థిక, ఆరోగ్య, మానసిక వేదనకు గురి చేశారు.



పెట్రోల్ తో నడిచే వాహనాలు విడుదల చేసే కర్బన ఉద్గారాలు వాతావరణానికి హానికరమని , పెట్రోల్ లో ఇథనాల్ కలిపి వాడితే పర్యావరణాన్ని రక్షించవచ్చనే సాకుతో మొత్తం పర్యావరణాన్ని చిన్నాభిన్నం చేయడానికి పూనుకున్నారు. ఇథనాల్ ఉత్పత్తి వలన గాలి, నీరు, భూగర్భ జలాలు, భూమి పాడవుతాయి. ఈ మొత్తం పై విషయాలను ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పడిందే చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ. ఈ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రాజ్యాంగబద్ధ పోరాటాన్ని సహించక తమ వ్యాపార లావాదేవీల కోసం రైతులపై పోరాట కమిటీ నాయకులపై నిర్బంధాన్ని ఉపయోగించారు. అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేశారు. పర్యావరణాన్ని పరిరక్షించండి అన్నందుకు రైతులను జైలు పాలు చేశారు. ఆరోజు కంపెనీ వ్యర్థాలను ట్యాంకర్లలో నింపుకొని రాత్రి సమయాన రోడ్లపై, పంట పొలాల్లో వెదజల్లుతున్నారని విషయం తెలియడంతో అటుగా వెళుతున్న ట్యాంకర్ ని ఆపి ఇందులో ఇథనాల్ ఉందా? కంపెనీ వ్యర్థాలు ఉన్నాయా ? చూపించమని అడిగారు. చూపించకపోవడంతో అక్కడే రోడ్డుపై బైఠాయించారు. వారికి మద్దతుగా వందలాదిమంది చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై రాత్రంతా అక్కడే పడుకున్నారు. ఉదయం పోలీసులు ఎమ్మార్వో తో సహా అక్కడికి వచ్చారు. ఎమ్మార్వో కూడా ఆ ట్యాంకర్ లో ఏముందో చూపించమని ఆదేశించారు. ఆ ఆదేశాలను పాటించని డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు ఒక్కసారిగా ప్రజలపై లాఠీ చార్జ్ చేశారు. ఆ లాఠీచార్జీలో అనేకమంది ప్రజలకు తీవ్ర గాయాలయ్యి ఆసుపత్రి పాలయ్యారు. చిత్తనూరు, ఎక్లాస్ పూర్,-జిన్నారం గ్రామాల్లో పోలీసులను దింపి క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి నెల రోజుల పాటు పోలీస్ క్యాంపులు పెట్టారు. ఈ మూడు గ్రామాలు కూడా దసరా పండుగను కూడా జరుపుకోకుండా అక్రమ కేసులు పెట్టారు. ఇదే అదనుగా గ్రామాల్లో కొంతమంది అవకాశవాదులు , పార్టీల నాయకులు తమకు అనుకూలంగా లేని వారిపై అక్రమ కేసులు పెట్టించారు. రెండు నెలల పాటు గ్రామాలు విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. నిజానికి ఇథనాల్ పోరాటంపై పోలీసుల లాఠీ ఛార్జ్ వల్ల రాష్ట్ర వ్యాప్తంగా న్యూస్ అయింది. ప్రజా శాస్త్రవేత్తలు,సంఘాలు, పార్టీలు కొన్ని ఈ ఘటనను ఖండించారు. అందుకే కాబోలు అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఘోరంగా ఓడించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులపై రౌడీషీట్లు పెట్టింది. గత ప్రభుత్వానికి తమకు ఏం తేడా లేదని చాటి చెప్పింది. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న స్థానిక కాంగ్రెస్ నాయకులు నేడు సైలెంట్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని జిల్లాల ఎస్పీలను మార్చినప్పటికీ నారాయణపేట జిల్లా ఎస్పీని మార్చకుండా కంపెనీకి అండగా ఉన్నారు. నాడు ఏ పోరాటాన్ని అయితే అణిచివేయాలనుకున్నారో చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో నేడు రాష్ట్రవ్యాప్తంగా ఇథనాల్ కంపెనీలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తున్నారు.నాడు సైంటిస్టులు, మేధావులు , పోరాట కమిటీ చెప్పిన విషయాలన్నీ కూడా ఒక్కొక్కటి నేడు నిజమౌతూ వస్తున్నాయి. ప్రస్తుతం కంపెనీ పరిసర గ్రామాల ప్రజలు ఆ కాలుష్యం బారిన పడి మూగ వేదన భరిస్తున్నారు. కంపెనీ వెదజల్లే గాలి కాలుష్యాన్ని భరించలేకపోతున్నారు. ఆ కంపెనీ విడుదల చేసిన కాలుష్యపు నీటిలో అభం శుభం తెలియని పసిపిల్లలు ఆడుకోవడంతో చర్మవ్యాధులకు గురయ్యారు. ఆ నీటిని తాగిన పశువులు, చేపలు చనిపోయాయి. ప్రస్తుతం కంపెనీ వెదజల్లే కాలుష్యపు గాలి వలన కంపెనీ పరిసరాల పంట పొలాల్లో పని చేయలేకపోతున్నారు. మొన్న మన్నేవాగు ఉధృతంగా ప్రవహించినప్పుడు కంపెనీ వ్యర్థాలను ఆ వాగులో వదిలేశారట. ఇలాంటి స్థితిలో నేటికీ అనేక సమస్యలు పరిష్కారం కాకుండా కంపెనీ వైపు అన్ని వ్యవస్థలు అండదండగా నిలిచిన ప్రస్తుత సందర్భంలో రైతులపై పోరాట కమిటీ ప్రతినిధులపై పెట్టినటువంటి అక్రమ కేసుల రద్దుకు, కంపెనీ వెదజల్లే గాలి, నీటి కాలుష్యాన్ని కట్టడి చేయడానికి కంపెనీ రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకరావలసిన అవసరం ఉందని ఆ పోరాటం మనకు గుర్తు చేస్తున్నది.

-జె.చక్రవర్తి
చిత్తనూరు ఇథనాల్ కంపెనీ
రద్దు పోరాట కమిటీ

# మట్టి మనుషుల జీవన జాడలు అల్లం రాజయ్య రచనలు

ప్రతీ కథ వెనుక ఒక నిర్దిష్ట సంఘటన కారణభూతంగా తప్పక ఉంటుంది. ఈ కారణమే వ్యక్తుల జీవితాలను మలుపు తిప్పుతుంది. అలా తనకు ఎదురైనా సంఘటనల ఆధారంగా రచనలు చేసి ప్రజా కథకుడిగా పేరు తెచ్చుకున్నారు అల్లం రాజయ్య. ఈయన కరీంనగర్ జిల్లా మంథని మండలం గాజులపల్లి లో 1952 జూన్ 5 న జన్మించారు. తల్లీదండ్రులు బుచ్చమ్మ నర్సయ్యలు. అల్లం రాజయ్య చదువుకునే రోజులలో గౌండ్ల ఎల్లయ్య అనే మిత్రుని సహచర్యంలో అంబేద్కర్ గారి కుల నిర్మూలన అనే పుస్తకం చదివిన తర్వాత ఆలోచనలలో భిన్నమైన మార్పులు వచ్చాయి. అనంతరం అమ్మ అనే నవల చదవడం తనను సాహిత్యంపై దృష్టి పెట్టేలా చేసిందంటారు.


వరంగల్ లోని మిత్రమండలి పరిచయం మేలి మలుపు. ఈ మండలి ద్వారా ఎంతోమంది ప్రముఖ రచయితల కవుల సందర్శనం సానిహిత్యం ఈయనకు లభించింది. ఈ మధ్య కాలంలో వరవరరావు గారిని కలవడంతో వారిలో విప్లవభావాలు మొలకెత్తాయి. 1974 ఎమర్జెన్సీ సమయంలో ఇద్దరు తమ్ముళ్లు జైలుకెళ్ళడంతో కుటుంబ భారం పూర్తిగా రాజ్యయ్యపై పడింది. అల్లం రాజయ్య దాదాపుగా 110 కథలు రాశారు. ఈయన కథలలో ప్రధానంగా రైతాంగ పోరాటం కార్మిక పోరాటాలు స్త్రీ సంబంధ మానవ సంబంధ కథలే అధికంగా ఉన్నాయి. వివాహం అనంతరం హనుమకొండ నుంచి మకాం మార్చారు. అలా తన గ్రామంలో జరిగిన సంఘటనల ఆధారంతో తిరగబడ్డ బానిసలు అనే కథను రాశారు.

**రచనలు నవలలు**

* ముగింపులు - ముందడుగులు
* మిట్ట మధ్యాహ్నం (నవల - అముద్రితం)
* టైగర్ జోన్
* అగ్ని కణం
* కొలిమంటుకున్నది
* ఊరు
* వసంత గీతం
* సరిహద్దు

**కథలు**


* హీరో (1975)
* కుర్చీ (1976)
* టాస్ (1978)
* సంఘం (1978)
* పాలేరు (1978)
* గీటురాయి
* గోడ
* మట్టి మనిషి
* శత్రువు నేర్పిన పాఠం
* మధ్యవర్తులు
* మనిషి లోపలి విధ్వంసం
* సృష్టికర్తలు
* తల్లి చేప
* అతడు




ఈయన కథల విషయానికొస్తే మొదటి కథ ఎదురు తిరిగితే . ఇదీ ఎమర్జెన్సీ సమయంలో రాసినది. దీనిలో గ్రామీణ దోపిడీ, అణచివేత, అసంబద్ధ సంబంధాలు వంటి విషయాలు ఉన్నాయి. రెండవ కథ మనిషి లోపలి విధ్వంసం. దీనిలో వ్యవసాయాధారిత భారతీయ సమాజంలో ఉత్పత్తి విధానం మనిషిని ఎలా కుంగదీస్తుందో ఈ కథ ద్వారా తెలిపారు. భారతీయ ఉత్పత్తి విధానం మనిషిని అభివృద్ధి చేయకపోగా ఎలా అత్మహత్యలకు ప్రేరేపిస్తుందో చేప్పే కథ మనిషి లోపలి విధ్వంసం. ఈ కథ అన్నీ భారతీయ భాషలలోకి అనువాదం అయ్యింది. ఈ కథ మీద ఒక పరిశోధక విద్యార్థి ఎమ్.ఫిల్ పరిశోధన కూడా చేయాలని సంకల్పించారట కానీ కార్యాచరణ జరగలేదు.

ఇంకా అడవి మనిషి కథలో అమాయకమైన పల్లెల కష్టాలను వర్ణించారు. వీరయ్య భూముల్ని దొర కాజేయడం ,అతని కొడుకు ఉద్యమాలలో వుంటున్నాడని పోలీసులు పట్టుకెళ్లడం , అతడు పట్నం వెళ్లి అవమానాలు పడటం కోర్టు చుట్టు తిరగడం ఇందులోని ఇతివృత్తం. ఏ రోగానికైనా ఒకే మందుబిళ్ల ఇచ్చే సర్కారు దవాఖాన తీరును ప్రశ్నిస్తూ బూడిద అనే కథను రాసారు. సింగరేణి కార్మికుల గురించి రక్తస్వభావం అనే కథను రాశారు. దీనిలో తరచూ జరిగే బొగ్గు గని ప్రమాదాలు ,యాజమాన్యం నిర్లక్ష్యం వంటి అంశాలు ఉన్నాయి. ఈ కథలో చంద్రయ్య అనే బొగ్గు గని కూలి చనిపోవడం, యజమాన్యం పట్టించుకోక పోవడం, ఆ తర్వాత కార్మికులే చందాలు వేసుకొని దహన కార్యక్రమాలు చేయించండం కథ ఇతివృత్తం. భూమి (1979) అనే కథలో గంగన్న , ఆశన్న ప్రధాన పాత్రధారులు. ఆశన్న బావమరిది భూపోరాటం చేసి అరెస్ట్ అవుతాడు. ఆశన్న అతనిని కలవడానికి వెళ్తూ దారిలో సంత నుంచి దున్నపోతు ను కొట్టుకొస్తున్న ముసలయ్యతో జరిగిన చర్చ ఆశన్నలో ఆలోచనలను కలిగిస్తుంది. ఈ కథలో పాట రూపంలో చర్చను నడిపిన విధానం అందరినీ ఆకర్షిస్తుంది. అల్లం రాజయ్య తొలి రోజులలో మాండలిక కథలు రాశారు. కానీ మాండలికం లో రాస్తే అర్థం కాదన్న విమర్శలున్నాయి ( ఫాయిదా - గుడిపాటి) ఆ తర్వాత అల్లం రాజయ్య కథన శైలి లో మార్పు వచ్చింది.

అల్లం రాజయ్య ఏ కథ రాసినా దాని నేపథ్యం పై ముగింపు పై ప్రత్యేక శ్రద్ధ పెడతారు. ఇదే విషయం ఈయన కథలను ప్రత్యేకంగా నిలబెడతాయి. భూమి కోసం కూలీ రేట్ల పెంపు కోసం కూలీ ఐక్యత కోసం సంఘాలు ఏర్పడడం గురువులు (1991) అనే కథలో విషయం. దీనిలో పెంటయ్య , రాజిరెడ్డి, నీలయ్య ప్రధాన పాత్రలు. ఈ కథంతా సంవాద రూపం లో నడిచింది. మరో కథ సింగరేణి లో కార్మికులను బానిసలు గా (1975 కాలంలో ) చూడటం. గని పని లో దెబ్బ తగలిన కార్మికుడికి గాయం తగ్గక ముందే డాక్టర్ సర్టిఫికేట్ ఇచ్చి పనిలోకి తీసుకుంటారు. గాయం తగ్గలేదని సంఘాలకు మోర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోక పోవడంతో ఆ కార్మికుడికి సాయం కోసం సమ్మె మొదలు పెట్టడం కథ. 1969లో వచ్చిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఈయన సామాజిక ఆలోచనలలో, రచనా దృక్పథంలో మార్పు తెచ్చిందని చెప్పుకోవచ్చు. అల్లం రాజయ్య రష్యన్ సాహిత్యం, ఠాగూర్ బంకించంద్ సాహిత్యకారుల సాహిత్యం చదివేవారు. 1975 చీరాల మహా సభలో విరసంలో సభ్యులయ్యారు. అల్లం రాజయ్య కొద్దిరోజులు క్రాంతి అనే పత్రికను, కరీంనగర్ లోని మిత్రులతో కలసి విద్యుల్లత అనే పత్రికను నడిపారు. 2000 సంవత్సరం దాకా రచనలు చేసిన వీరు తర్వాత ఎందుకో రచన వ్యాసాంగాన్ని కొనసాగించలేదు. ఈయన 4- నాటకాలు కూడా రాశారు. తెలంగాణ పోరాటాలు ప్రజల భాషలో చిత్రీకరణ చేసారు. ఈ రచనలన్నీ నేటి తెలంగాణ రాజకీయ సాంఘిక సాహిత్య పరిస్థితులకు అద్దం పడుతునే ఉన్నాయి. ఒక కథా రచయితకు రచనా సామర్థ్యం లేకపోయినా పర్వాలేదు సరి చేయవచ్చు గానీ జీవితం తెలియకపోతేనే కష్టం అంటారు కొడవగంటి . ఇక్కడ అల్లం రాజయ్యకు జీవితం విలువ , రచనా సామర్థ్యం రెండూ ఉన్నాయి . కాబట్టే ఇంత మంచి కథలు రాయగలిగారు.




-ఐ.చిదానందం
సెల్- 8801444335

# ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



**విశ్వంభర, చేవెళ్ల:** సమాజ ఐక్యత, సామాజిక సేవ కోసమే 99 ఏళ్లుగా ఆర్ఎస్ఎస్ హిందువులందరినీ సంఘటితం చేస్తున్నదని తెలంగాణ ప్రాంత ఉద్యోగి శాఖల ప్రముఖ్ (తెలంగాణ ప్రాంత ప్రచారక్) రాంప్రసాద్ అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏర్పాటై 100వ ఏడాదిలోకి అడుగుపెట్టిన తరుణంలో సంఘ కార్యకర్తలు ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల గ్రామ రచ్చబండ నుండి పురవీధుల గుండా స్వయంసేవకులు పథ సంచలన్ (రూట్ మార్చ్ ) కార్యక్రమం నిర్వహించారు. గణవేష్ తో ఘోష్ ప్రణవ నాదంతో..ఘోష్, దండ ప్రయోగం పటణంలో పలువురిని ఆకర్షించింది. పథ సంచలన్ సభా ప్రాంగణం వివేకానంద కళాశాల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలమూరు విభాగ్ సహకార్యవాహ కేరెల్లి అనంతరెడ్డి, ఖండా కార్యవాహ బిల్లపాటి కృష్ణారెడ్డి, ముఖ్య వక్తగా తెలంగాణ ప్రాంత ఉద్యోగి శాఖల ప్రముఖ్ (సంఘ ప్రచారక్) రాంప్రసాద్‌లు హాజరయ్యారు. ముందుగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు కేశవ్ బలరాం పంత్ హెడ్గేవార్, భరత మాత,గురూజీ చిత్రపటాలకు పూజనిర్వహిం చారు. రాంప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ను డాక్టర్ కేశవ్ బలిరామ్ పంత్ హెడ్గేవార్ 1925 వ సంవత్సరం అధర్మం పై ధర్మం విజయం సాధించిన రోజు విజయదశమి పర్వదినాన స్థాపించడంజరి గిందని తెలిపారు. కేవలం5మందితో స్థాపించినేడు లక్షల మంది స్వయం సేవకులను తయారు చేసిన ఘనత ఆర్ఎస్ఎస్ సొంతమని అన్నారు. దేశంలో ఎక్కడ విపత్కరపరిస్థితులు ఎదురైనా మేము ఉన్నామంటూ అందరికీ స్వయంసేవకులు స్వచ్ఛందంగా సహాయం చేస్తున్నారనిఅన్నారు. హిందూధర్మాన్ని, మన సంస్కృతిని కాపాడు తున్నారని, హిందూ కేంద్రబిందువులైన గోమాత, భూమాత, దేవాలయాలను కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. అలాగే స్వయంసేవ కులే కాకుండా మన హిందు ధర్మాన్ని, సంస్కృతిని,కాపా డేందుకు ప్రతిఒక్కరు పాటుపడాల న్నారు. పార్టీలకు అతీతంగా మన ధర్మం, సాం స్కృతి ని కాపాడడం కొరకు పాటుపడాలని, కొం తమంది ఆర్ఎస్ఎస్ అంటే కేవలం మతతత్వం రంగును పూసి విమర్శిల్లచడం సరియైనది కాదని వారన్నారు.

## సీఎం చంద్రబాబు ను కలిసిన కాపర్తి ప్రకాష్



**విశ్వంభర, విజయవాడ:** శిల్పా కల్చరల్ వెల్ఫేర్ ట్రస్ట్, శిల్పా ఆర్ట్ క్రిమేషన్స్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని సీఎం కార్యలయంలో ట్రస్ట్ ఛైర్మన్ కాపర్తి ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలో బాలాజీ చారిటబుల్ ట్రస్టీకీ 3000 గజాల బౌల్ట్రీ నిర్మాణ స్థలం కొరకు అభ్యర్థించడమైనది. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ట్రస్ట్ ఛైర్మన్ కాపర్తి ప్రకాష్, శ్రీకాంత్, బాగ్యలక్ష్మి, బచ్చ గంగాధర్, కామిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

## పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం గాంధీ నగర్ గ్రామపంచాయతీ పరిధి లోని వెంకటరామ్ తండా ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఉదయం ఎనిమిది గంటల 45 నిమిషాలకు ఎంఈఓ తనిఖీ చేశారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాను ఒక్కరే హాజరయ్యారు. ఇంకో ఉపాధ్యాయురాలు సెలవులో ఉన్నారని ఎంఈఓకు సహ ఉపాధ్యాయురాలు తెలిపారు. ఉపాధ్యాయురాలు, విద్యార్థులతో కలిసి ఎంఈఓ ప్రార్థనా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని రికార్డ్స్, పరీక్షా పేపర్లను తనిఖీ చేశారు. నల్లబల్లపై దస్తూరి ఎలా ఉందో విద్యార్థులతో రాయించి ఇంగ్లీష్, తెలుగు చదివించారు. పాఠశాలపై ఎంఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడీ స్కూలు పరిశీలనకు వెళ్లారు. ఉదయం 10 గంటల వరకు అంగన్వాడి స్కూలు తెరవకపోవడాన్ని గమనించి ఎంఈఓ వెంటనే టీచర్ కు ఫోన్ చేయగా నేను ఈరోజు రాలేదని తెలిపింది. ఆయా కూడా రాకపోవడంతో ఎంఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులను ఆరాతీయగా టీచర్, ఆయా ప్రతి రోజు విధులకు సక్రమంగా హాజరు కారని, అంగన్వాడీ టీచర్ ప్రతినిత్యం వరంగల్ నుండి పాఠశాలకు 11 గంటలకు వచ్చి తిరిగి 3.30 గంటల వెళుతున్నారని వివరించారు. ఆగ్రహించిన గ్రామస్తులు అంగన్వాడీ టీచర్, ఆయాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంఈఓ కు ఫిర్యాదు చేశారు.

## ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే కసిరెడ్డి



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కాయితి ఆశాదీప్ రెడ్డి కలిసి సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానిక మహిళలు కోలాటాలు, నృత్యల తో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పేదప్రజల కోసం పనిచేస్తుందని, గ్రామ అభివృద్ధి కోసం ఆశాదీ పురెడ్డి చేస్తున్న ప్రయత్నం గొప్పదని అన్నారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, సురేందర్ రెడ్డి, అనిల్, అశోక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాంతి సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించిన ఏసీపీ



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ పాతబస్తీ ఛత్రినాక పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్ పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, మీ బస్తీలు, కాలనీలలో అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 100 నెంబర్ కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఛత్రినాక సీఐ వీ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐలు త్రిమూర్తులు, పాండు నాయక్, శోభ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# అంబుజా సిమెంట్ కంపెనీ అనుమతి రద్దు చేయాలి

## - మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లారామన్నపేట మండలంలో రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో నిర్మించ తలపెట్టిన ఆదానీ అంబుజా సిమెంట్ కంపెనీ రద్దు చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్‌కి వినతి పత్రం అందచేవారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ రామన్న పేటలో ఎట్టి పరిస్థితుల్లోనూ సిమెంట్ కంపెనీ ఎర్పాటు చేయనివ్వమని,ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అంబుజా సిమెంట్ కంపెనీని మా ప్రాణం పోయినా ఇటుక కూడా నిర్మాణం కానివ్వమని తెలిపారు. రేపు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ జరగనివ్వమని, రామన్నపేట ప్రజలకు బీ ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందని,ఈ ప్రాంతం లోని ప్రజలు మొదటి నుండి వ్యవసాయం, కులవృత్తి చేసుకునే వారే ఎక్కువగా ఉన్నారని అన్నారు. సిమెంట్ కంపెనీ ఏర్పాటు వలన కులవృత్తుల పై తీవ్రమైన ప్రభావం ఉంటుందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అందులో భాగంగానే ఈ రామన్న పేట ప్రాంతానికి సాగు నీటిని ఇచ్చే మూసీ కాలువను మెరుగుపరిచి రైతులకు సాగు నీటిని ఇచ్చారని చిరుమర్తి పేర్కొన్నారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పెద ప్రజల సంక్షేమాన్ని మరిచి కంపెనీ యాజమాన్యం తో కుమ్మక్కై వేల కోట్ల రూపాయల చేతులు మారి ప్రజలను ఇబ్బందుల పాలు చేసేవిధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. అధికారులు రేపు జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యమాన్ని వెంటనే రద్దు చేసి, ఈ ప్రాంతంలో సిమెంట్ కంపెనీ వల్ల జరిగే నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కంపెనీ అనుమతిని రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధికారులను కోరారు.

## రైతులు దీర్ఘకాలిక రుణాలను వినియోగించుకోవాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** నవంబర్ మొదటి వారంలో ఆమనగల్ సింగల్ విండో ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు, కడ్తాల మండలాల సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. ఆమనగల్ సింగల్ విండో కార్యాలయంలో పాలకవర్గంతో కలిసి మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ మొదటి వారంలో ఆమనగల్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, వరి క్వింటాలుకు రూ. 2330 లు మద్దతు ధర పొందాలని ఆయన రైతులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లకు ప్రోత్సాహకంగా రూ. 500 లు అందివ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆమనగల్ సింగల్ విండో, సహకార బ్యాంకుల ద్వారా గోట్ ఫార్మ్స్, (మేకలు గొర్రెలకు సంబంధించి) ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలు, పౌల్ట్రీ, డైరీ, జేసీబీ, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక రుణాలను అందివ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన రైతన్నలు, రైతు కార్మికులు సద్వినియోగం చేసుకోవాలనీ కోరారు. ఇంకా రైతులకు సంబంధించి దీర్ఘకాలిక రుణాలకు సంబంధించి అపోహాలు ఉన్న వారు నేరుగా సింగల్ విండో కార్యాలయంలో సంప్రదించాలని ఛైర్మన్ వెంకటేష్ గుప్తా కోరారు. ఈ కార్యక్రమంలో మాడుగుల సింగల్ విండో ఛైర్మన్ తిరుమల్ రెడ్డి, ఆమనగల్ సింగల్ విండో వైస్ ఛైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, బెల్లి వెంకటయ్య, డీసీసీబీ మేనేజర్ గోపాల్, సీఈఓ దేవేందర్, సింగల్ విండో సిబ్బంది పద్మాకర్ రెడ్డి, అల్లాజీ పాల్గొన్నారు.

## ఇండ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలి



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ పట్టణంలోని 2,3 వార్డులలో ఇండ్ల మధ్యలో ఉన్న కాలి స్థలాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పాములు, తేళ్లకు ఆవాసాలుగా మారాయని ప్రజలు తిరగకుండా తయారయ్యాయని భయభ్రాంతులకు గురవుతున్నామని తెలిపారు. అందులో నుండి విష కీటకాలు, పాములు ఇండ్లలోకి వచ్చి కరుస్తున్నాయని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులకు, సిబ్బందికి చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు పోయిన తర్వాత ఎవరు తీసుకురాలేరని ఈ విషయంపై స్పందించి విష కీటకాల భారి నుండి కాలనీ వాసులను కాపాడాలని బీఆర్ఎస్ నాయకులు కంబాలపల్లి అంజి గ్రామపంచాయతీ అధికారులను వేడుకుంటున్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థికి సన్మానం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వీరమల్ల ఊర్మిళ, రాధాకృష్ణ మూర్తి దంపతుల చిన్న కుమారుడు సాయినాథ ఈ సంవత్సరం జరిగిన నీట్ పరీక్షలో 579 మార్కులతో వరంగల్ లోని కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం తరపున సాయినాథ, అతని తల్లిదండ్రులను శాలువా, పూలమాలలతో సన్మానించినారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, గ్రామస్తులు విద్యార్థి కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కానగుల దశరథం, గౌరవ అధ్యక్షులు పెరికేటి యాదయ్య, మండల అధ్యక్షులు కానుగుల గనేష్, పట్టణ అధ్యక్షలు దేవరకొండ రమేష్, జంప్రాల యాదగిరి, గుప్పేటి బాలు, జాజాల రాంచంద్రయ్య, కానుగుల రాజు, జంద్రల సురేష్, అడివయ్య పాల్గొన్నారు.

## ఆంజనేయునికి ప్రత్యేక పూజలు చేసిన అందెల



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం గట్టుపల్లిలో ప్రసిద్ధిగాంచిన వీరాంజనేయ స్వామి ఆలయంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కలిసి వీరాంజనేయ స్వామికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఎంతో మహిమ గలిగిన ఆలయ ప్రాంగణంలో సోమవారం ఒక అన్య మతస్తుడు ఆలయం పక్కన దర్గా ఉందని మేకను బలి ఇయ్యడం జరిగిందన్నారు. మేము చూస్తున్నప్పటి నుండి ఇక్కడ దర్గా లేదని గ్రామస్తులు తెలిపారని, ఆలయ ప్రాంగణాన్ని అపవిత్రం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అందెల శ్రీరాములు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో హిందువులకు ఇంత అన్యాయం జరుగుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ఇప్పటివరకు స్పందించకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. హిందువులంతా వారిని గమనిస్తున్నారని సమయం వచ్చినప్పుడు వారికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఆలయ ప్రక్షాళనలో భాగంగా మంగళవారం అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. అదేవిధంగా హిందువులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పాపయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ అనంతయ్య గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కదారి జంగయ్య యాదవ్, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు యదీష్, మాజీ ఎంపీపీ కుందే వెంకటేష్, మండల అధ్యక్షులు మాధవచారి, బీజేపీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, యువ మోర్చా అధ్యక్షులు వనంపల్లి శ్రవణ్, రాళ్ళ గూడెం రామకృష్ణారెడ్డి, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, వివిధ క్షేత్ర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.15

## ఏబీవీపీ నగర కార్యదర్శిగా అక్కి వంశీగౌడ్



**విశ్వంభర, కల్వకుర్తి:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కల్వకుర్తి నగర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన నూతన నగర కమిటీ ఎన్నికలో నగర కార్యదర్శిగా అక్కి వంశీ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వంశీ గౌడ్ మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 1949 జూలై 9 ప్రారంభించడం జరిగిందని, అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ దేశంలోనే దాదాపుగా 50 లక్షల మంది విద్యార్థుల మెంబర్షిప్‌తో అతిపెద్ద విద్యార్థి ఆర్గనైజేషన్‌గా ఎదిగిందని అన్నారు. నిరంతరం విద్యార్థి సమస్యల కోసం పనిచేస్తున్నటువంటి ఏబీవీపీలో నగర కార్యదర్శిగా నాకు బాధ్యత నిర్వహించే అవకాశం కల్పించిన పెద్దలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కల్వకుర్తి నియోజకవర్గంలో ఏ విద్యార్థికి కష్టం వచ్చినా అండగా ఉంటూ విద్యార్థి సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు వెంట ఉండి పరిష్కరిస్తానని తెలిపారు.

## డీఏ, పీఆర్సీ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

### ఎస్. వేణుగోపాల్



**విశ్వంభర, చింతపల్లి:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు చింతపల్లి మండలంలోని జడ్పీహెచ్ఎస్ వెంకటేశ్వర్ నగర్, జడ్పీహెచ్ఎస్ చింతపల్లి, జడ్పీహెచ్ఎస్ గడియ గౌరారం, యుపీఎస్ నెల్వలపల్లి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ (తపస్) చింతపల్లి మండల అధ్యక్షుడు సొనగంటి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శివకోటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు చెల్లించవలసిన ఐదు డీఏలు, ఏరియర్స్ పెండింగ్ బిల్లులు, మెడికల్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని తక్షణమే అమలుచేయాలనీ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ నాయకులు వినోద్, నెలంటి వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

## కోవెల నాయక్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే సబిత



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం రాంచెంద్రాగుడాలో మహేశ్వరం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అంగోత్ రాజు నాయక్ మామ రాత్లవత్ కోవెల నాయక్ పరమపదించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి రాంచెంద్రాగుడా చేరుకుని కోవెల నాయక్ పార్థీవదేహానికి పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



**విశ్వంభర, నల్లగొండః** నల్లగొండ "జిల్లా కేంద్ర గ్రంథాలయానికి "కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ తరపున మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి విలువైన పుస్తకాలను ఫౌండేషన్ ఛైర్మన్ ఎంవి గోనారెడ్డి అందజేశారు. పోటి పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకి జనరల్ నాలెడ్జికి సంబంధించిన పుస్తకాలు, గద్దర్ సమగ్ర సాహిత్యం గ్రంథాలయానికి అందజేసారు.కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సి.ఇ.ఓ. యం. వి. గోనారెడ్డి, మనిసిపల్ వైస్ ఛైర్మన్ అబ్బగొని రమేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జుకూరి రమేష్, కాంగ్రెస్ నాయకులు గుమ్మల మోహనరెడ్డి, వంగూరి లక్షమయ్య, అసిస్టెంట్ లైబ్రేరియన్ కట్టా నాగయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలు అందించినందుకు "కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్" ఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ, విద్యార్థులు కృతజ్ఞులు తెలిపారు. ఇటీవల విద్యార్థుల కోరిక మేరకు ఏసీలు, జీకే పుస్తకాలు, మధ్యాహ్నం బోజనం అందచేస్తున్నకోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందనీయులయని గోనా రెడ్డి అన్నారు.

## 15వ వార్డును ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తా

### కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటీలోని 15వార్డులో అన్ని విధాల వసతులు కల్పించి మున్సిపాలిటీ లోనే ఆదర్శమైన వార్డుగా అభివృద్ధి చేస్తానని కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, వార్డులో అవసర మైన సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, వీధిలైట్లు, త్రాగునీరు వసతులు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఉదయ్ నగర్ కాలనీలో రూ.60 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న అంతర్గత మురుగు కాల్వ పనులను లక్ష్మణ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. దశలవారీగా అన్ని వీధులలో సీసీరోడ్లు నిర్మాణం కూడా చేపడుతామని లక్ష్మణ్ పేర్కొన్నారు. కాలనీవాసులు శేఖర్, రాజు, రమేష్ మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలిగంటి మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన షాబాద్ మండల నాయకులు రవి నాయక్, బొంతపల్లి వీరయ్య, బొంతపల్లి విద్యాసాగర్, రామ్ రెడ్డి, మహేందర్ ముదిరాజ్, రాజు, మల్ రెడ్డి, మాధవ రెడ్డి. **(విశ్వంభర, చేవెళ్ల)**

# దళిత బంధు నిధులు మంజూరు చేయాలి



**విశ్వంభర, ఖమ్మం:** దళిత బంధు నిధులు మంజూరు చేసి వెంటనే లబ్ధిదారుల ఖాతాలో జమ చెయ్యాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మధిర నియోజకవర్గ మాజీ ఇంచార్జి బొమ్మెర రామ్మూర్తి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో మొదటి సారి కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం వల్ల ఎంతో మంది దళితులు ఆర్థికంగా బలోపేతం అయ్యారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను అబద్దలతో మోసం చేసినట్లు దళితులను కూడా గోరంగా మోసం చెయ్యాలని చూస్తుందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం 10లక్షలు మాత్రమే ఇస్తుందని, మేము అధికారం లోకి రాగానే 12 లక్షలు దళిత బంధు ఇస్తామని ఆశపెట్టి, నమ్మించి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చి 10నెలలు కావొస్తున్న ఒక్క రూపాయి కూడా దళిత బంధుకు నిధులు విడుదల చేయకపోవడం దుర్మార్గం. దళిత జాతిని కాంగ్రెస్ ప్రభుత్వం గోరంగా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేసారు. దళిత బందుకు డబ్బులు లేవు, రైతు బంధుకు డబ్బులు లేవు హృద్దుల పెన్షన్ కు డబ్బులు లేవు, మహిళల ఇస్తానన్న 2500 ఇవ్వడానికి డబ్బులు లేవు కానీ మూసీ సుందరికరణ కోసం మాత్రం 1లక్షా 50 వేల కోట్ల రూపాయలు ఉంటాయనడం కాంగ్రెస్ పార్టీ దివాలా కోరుతనానికి నిదర్శనమని అన్నారు. వీళ్ళు విదేశాలకు వెళ్లి మరీ మూసీ సుదరకారుణకు ఎంత ఎక్కువ డబ్బులు పెట్టాలో ఈ పేరుతో ఎలా దోచుకోవాలో ఆరాటపడుతూ మంత్రులు తహతాహ లాడుతున్నారని అన్నారు. దళిత బందు పేరుతో మంజూరై కలెక్టర్ గారి అకౌంట్లో ఉన్న నిధులను లబ్ధిదారుల ఖాతాలో వెంటనే జమ చెయ్యాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. లేకపోతే రాష్ట్ర స్థాయిలో ఈ పోరాటాన్ని ఉదృతం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి దళిత బంధు అమలయ్యేదాకా పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో నెమలి కిషోర్, అరేంపుల వీరభద్రం, నేరెళ్ల, ఆరోన్, వెంకటేష్, మాధవి, శివాజి వెంకటేష్, చేకూరి సతీష్, చేకూరి నరేష్ పాల్గొన్నారు.

## రంగు వేశారు.. రాయడం మరిచారు..



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా పోచారం పురపాలక సంఘం ప్రతాపసింగారం వార్డు కార్యాలయం బోర్డుకు రంగు వేసి పేరు రాయకుండా వదిలేశారు. గ్రామపంచాయతీగా ఉన్న ప్రతాపసింగారం సెప్టెంబర్ నెలలో పోచారం మున్సిపాలిటీలో విలీనం అయ్యింది. బోర్డుకు రంగు వేసి నెల రోజులు గడుస్తున్నా దానిపై 'వార్డు కార్యాలయం' అని రాయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డుపై పేరు రాయాలని ప్రజలు కోరుతున్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్

■ వ్యాపారులను హెచ్చరించిన జిల్లా వ్యవసాయ అధికారి

■ తనిఖీల్లో పాల్గొన్న ఏవోలు, ఏఈవోలు



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపుల్లో స్టాక్ నిర్వహణ రికార్డులను, ఎరువుల బస్తాల లాట్ నెంబర్లు, సోర్స్ సర్టిఫికేట్లను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ వ్యాపారులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వం ఆమోదం పొందిన షాపుల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు సమయలో రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేసి, షాపులను సీజ్ చేస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై గట్టి నిఘా ఉంచామన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే రైతులు, ప్రజలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో, వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమాచారం అందించాలన్నారు. సమాచారం తెలియజేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. వారి వెంట చింతపల్లి మండల వ్యవసాయ అధికారిని పోలిశెట్టి శ్రావణ కుమారి ఉన్నారు.

## పరిశ్రమ ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో నిర్మించ తలపెట్టిన ఆదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల ఇక్కడి ప్రజల ప్రాణాలకు నష్టం కలిగించే విషవాయువులు, ఆ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఎక్కువగా ఉన్నాయని చిన్నపిల్లలకు, వృద్ధులకు, మహిళలకు ఊపిరి తిత్తులతో పాటు కాలేయం, గర్భాశయ సమస్యలు వచ్చే అవకాశం ఉంది అని ఎంతో మంది శాస్త్రవేత్తలు రీసెర్చ్ ద్వారా తెలిపారని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ చాంద్ అన్నారు. జనావాసాలకు దగ్గరగా ఉండటంవల్ల ప్రజలకు ప్రాణనష్టం కలిగే అవకాశం ఉందని. ఇలాంటి ఫ్యాక్టరీ మాకు వద్దని, ప్రజలకు నష్టం కలిగించే ఎలాంటి ఫ్యాక్టరీ నైన వ్యతిరేకిస్తామని చాంద్ తెలిపారు. మేము ఉద్యమకారులం, కావున ఉద్యమాలు మాకు కొత్త కాదని ప్రజలకు లాభంకలిగించే కంపెనీలు ఏర్పాటు చేయాలని, దానిని మేము స్వాగతిస్తామని ఇంటర్నేషనల్ కళాశాల ఏర్పాటు చేస్తే ఇంకా బాగుంటుందని, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ చాంద్ తెలిపారు. ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు నోముల శంకర్, ఉద్యమ నాయకులు బొడ్డుపల్లి లింగయ్య, ఎండి. ఇమామ్, హరికృష్ణ, రేపాక లింగస్వామి, గడ్డం ప్రదీప్, నోముల శేఖర్ పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ, డోర్నకల్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మరిపెడ నుండి మహబూబాబాద్ రోడ్డు, రాజీవ్ విగ్రహం, కార్గిల్ చౌరస్తా, మాకుల పెద్ద చెరువు, డోర్నకల్ గొల్ల బజార్, టీచర్స్ కాలనీ, ముత్యాలమ్మ గుడి రోడ్డు, భగత్ సింగ్ విగ్రహం సెంటర్, బతుకమ్మ పార్క్‌లలో మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, మౌలిక వసతుల కల్పన ద్వారా అభివృద్ధి పనులు నిర్వహించుటకు అవసరం ఉన్నచోట ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, సానిటేషన్, నిర్వహించాలని సూచించారు. పన్నుల వసూల లక్ష్యం పూర్తి చేయాలని, తద్వారా పట్టణాల అభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు. పచ్చదనం, పరిశుభ్రత, ఆరోగ్యం తడి చెత్త, పొడి చెత్త లపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు వెంకటస్వామి, నరేష్ రెడ్డి, డిఈలు సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నార్త్ హస్తినాపురంలో నివాసం ఉంటున్న 6 సంవత్సరాల నిర్విక గుండెకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్నది. ఈ నేపథ్యంలో నిర్విక కుటుంబ ఆర్థికస్థితులు బాగోలేక వారు ఎల్.బి నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది. మంజూరైన రూ.2,00,000ల రూపాయల విలువైన ఎల్.ఓ.సీ.చెక్కు ను నిర్విక కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం సహాయనిది అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయక్, భీమ్ నాయక్ పాల్గొన్నారు.

## దృశ్యశ్రవణం ద్వారా రైతులకు అవగాహన



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు వీడియో కాన్ఫరెన్స్ (దృశ్యశ్రవణ) విధానం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు వరి, ప్రత్తి పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల పైన శాస్త్రవేత్తలు అవగాహన కల్పించడం జరిగింది. రైతుల సందేహాలను కూడా అడిగి తెలుసుకుని వారికి సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఆత్మకూరు(ఎం) మండల వ్యవసాయ అధికారి బత్తుల అరుణకుమారి, ఆత్మకూరు(ఎం) మండల వ్యవసాయ విస్తరణ అధికారులు చేగూరి మనీషా, వి సరిత, టి సౌమ్య, కె శ్రీకర్, కె క్రాంతి కుమార్, రైతులు పాల్గొన్నారు.

## ఆ దేశ భక్తుల పోరాటం మరువలేనిది



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో స్వతంత్ర్య భారత ముద్దుబిడ్డలు పండిట్ అష్ఫాకుల్లా ఖాన్ 124వ జయంతి, ఆదివాసి ముద్దుబిడ్డ కొమరం భీమ్ 123వ జయంతిని మంగళవారం మానుకోట నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కృష్ణ కాలనీ కంకర బోర్డ్ వద్ద అష్ఫాకుల్లా ఖాన్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షేక్ యూసుఫ్ మేస్త్రీ బేతోలు విచ్చేసి అష్ఫాకుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అదేవిధంగా నేతాజీ సేవాసమితి ఉపాధ్యక్షులు లక్ష్మణ్ విచ్చేసి మానుకోట బస్టాండ్ ఎదురుగా కొమరం భీమ్ విగ్రహం వద్ద చిత్రపటాన్ని ఏర్పాటు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. నేతాజీ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ స్వతంత్ర్య పోరాటంలో అష్ఫాకుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ పాత్ర మరువలేనిదని, స్వతంత్ర్య భారత చరిత్రలో వారిద్దరి స్నేహ సంబంధం ఎంతో మరువలేనిది అని గుర్తు చేశారు. చంద్రశేఖర్ ఆజాద్, రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాకుల్లా ఖాన్ మన దేశ సంపదను బ్రిటిష్ వాడు దోచుకోకుండా కాపాడారని తెలియజేశారు. తెలంగాణ ముద్దుబిడ్డ కొమరం భీమ్ దేశ స్వతంత్ర్యం కోసం చేసిన పోరాటం మరువలేనిదని చెప్పారు. యువత స్వతంత్ర్య సమరయోధులను, గొప్ప వ్యక్తులను ఎన్నటికీ మరువకూడదని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి ప్రధాన కార్యదర్శి కుదురుపాక వివేక్, ఉప కార్యదర్శి గంగాధర్, కోశాఅధికారి మైస రోహిత్, కన్వీనర్ బోనగిరి లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ ఒబ్బిలి శెట్టి రామకృష్ణ, సామ శ్రీనివాస్, శోభన్ బాబు, నితిన్ పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా పోరాడదాం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో నిర్మించబోయే ఆదాని అంబుజా సిమెంటు పరిశ్రమ ఏర్పాటు కొరకు బుధవారం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను రాజకీయాలకు అతీతంగా ఒక్కటై వ్యతిరేకించి, కాలుష్య పరిశ్రమను పారద్రోలాలని అఖిలపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పర్యావరణ పరిరక్షణ వేదిక అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ పరిశ్రమ మూలంగా రామన్నపేట పర్యావరణ, ప్రజారోగ్యం దెబ్బతిని భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, పరిశ్రమను వ్యతిరేకించి మన అభిప్రాయాన్ని స్వచ్ఛంధ్సంగా చెప్పేందుకు అవకాశం ఉందని, అందరూ ముక్తకంఠంతో, ఏకాభిప్రాయంతో వ్యతిరేకిస్తే కంపెనీ వెనుతిరుగుతుందని, రాజకీయాలను పక్కనపెట్టి అందరం ఐక్యంగా, కంపెనీకి వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. గతంలో రామన్నపేటలో ఐక్య కార్యాచరణతో అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించడం జరిగిందని, అదే స్ఫూర్తితో ముందుకు పోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి, పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో-కన్వీనర్ ఎండీ రెహన్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, టీడీపీ, బీఎస్పీ, డీఎస్పీ నాయకులు పల్లపు దుర్గయ్య, ఊట్కూరి నరసింహ, బొడ్డుపల్లి వెంకటేశం, గోదాసు పృద్వీరాజ్, ఎండీ ఫజల్ బేగ్, జమీరుద్దీన్, నకిరేకంటి నరేందర్, గూనిరాజు, కందుల హనుమంతు, గొరిగె సోములు పాల్గొన్నారు.

## ఆలయ అధ్యక్షుడు వ్యవహరిస్తున్న తీరుపై నిరసన



**విశ్వంభర, మేడ్చల్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ సాయి మారుతి నగర్ కాలనీలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిత్యం జరిపే పూజలను జరగనీయకుండా దోపిడి జరుగుతుందని ఆలయ స్థల దాత పొన్నం తరుణ్ గౌడ్ పేర్కొన్నారు. ఆలయ అధ్యక్షులు తన ఇష్టానుసారంగా వ్యవహరి స్తున్నారని తరుణ్ గౌడ్ మీడియా సమావేశంలో తెలిపారు. ఆలయ అధ్యక్షు లుగా వ్యవహరిస్తున్న రాపోలు సత్యనారా యణ ఒంటిపోకడతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తను చెప్పింది వేదంఅంటూ దేవాలయంలో పూజలు చేసే పాత పూజారి వద్దు అని సోమవారం ఉదయం నుండి పూజలు జరగనివ్వకుండా గర్భగుడికి తాళం వేసి పెత్తనం చలాయిస్తున్నారని ఆరోపించారు. గుడిలో ఎలాంటి పూజలు జరిగినా దాతలకు గానీ కాలనీవాసులతో గాని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తన సంబంధికులతో మాత్రమే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ పబ్బం గడుపుతున్నారని కాలనీ వాసులు వివరించారు. ఆలయ అభివృద్ధి కై దాతల వద్ద డబ్బులు వసూలు చేస్తూ తమ సొంత అకౌంట్ లోకి డబ్బులు ట్రాన్స్ఫర్ చేయించుకుంటున్నారని, ప్రజాధనాన్ని వృథా చేస్తూ గుడి డబ్బులను కాజేస్తున్నారని ఇది ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మారుతీ నగర్ కాలనీ అధ్యక్షులు రాంబాబు గౌడ్, జనరల్ సెక్రెటరీ చంద్ర శేకర్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉస్మానియా యూనివర్సిటీ వీసీకి శభాకాంక్షలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ యం. కుమార్ ను ఉస్మానియా యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసినారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో అసోసియేషన్ మెంబర్లు వేధిరే సుదర్శన్ రెడ్డి, ఎన్ సీతారాం రెడ్డి, డాక్టర్ పి రామ్ రెడ్డి, గోవర్ధన్‌లు ఉన్నారు.

## గీత కార్మికులకు సేఫ్టీ కిట్‌ల పంపిణీ

### పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచ్ పథకం ద్వారా మంజూరైన సేఫ్టీ కిట్‌లను లబ్ధిదారులకు మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గౌడ సంఘం సోదరులు పాల్గొన్నారు. 19

## గుమ్మడి నరసయ్య అందరికీ ఆదర్శం



**విశ్వంభర, ఆమనగల్లు:** రంగారెడ్డి జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు, అమనగల్లు పట్టణానికి చెందిన ఎంగలి ప్రసాద్ మంగళవారం హైదరాబాదులో ఇల్లందు మాజీ ఎంమ్మెల్యే గుమ్మడి నర్సయ్య నువ్వు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన గతంలో 5సార్లు శాసనసభ్యులుగా పని చేశారని అయినగాని అతను సాధారణ జీవన విధానాన్ని గడుపు తున్నారని, సాధారణ వ్యక్తులకు, ప్రజలకు ఇప్పటికీ తనవంతు సేవ చేస్తున్నారని తెలిపారు. అతని ద్వారా రాజకీయ నాయ కులు ఎలా ఉండాలో అందరూ తెలుసుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రసాద్ సూచించారు.

# సీజనల్ వ్యాధులను నియంత్రించగలిగాం




విశ్వంభర, మహబూబాబాద్: తొర్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పల్లె దవఖానా సమీక్షా సమావేశం డాక్టర్. జి మురళీధర్ డీఎంహెచ్ఓ అధ్యక్షతన జరిగినది. ముందుగా ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవ అవగాహన కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా సీజనల్ వ్యాధుల నియంత్రణలో గత మూడు నెలల పాటు ఇంటింటి సర్వే, ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించడం ద్వారా సీజనల్ వ్యాధులను నియంత్రించగలిగామని అలాగే అన్ని ఆరోగ్య కార్యక్రమాలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అందుకోసం అందరూ కలసి కట్టుగా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భముగా డీఎంహెచ్ఓ డాక్టర్. మురళీధర్ కార్యక్రమాలను సమీక్షించారు. లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్క వైద్యుడు, సిబ్బంది బాధ్యతతో పని చేయాలని, నిబద్ధత, సమయపాలన పాటించాలని ప్రణాళిక బద్దంగా పని చేయాలని సూచించారు. మాతా, శిశు సంక్షేమ కార్యక్రమంలో భాగంగా 100 శాతం గర్భిణీ లను 12 వారాలలోపే గుర్తించి నమోదు చేయాలని, అనిమియా ను త్వరితగతిన గుర్తించి పూర్తి స్థాయి చికిత్స ను అందచేయాలని, 102 వాహనములను ఉపయోగించుకొవాలని, వైద్య అధికారులు బర్త్ ప్లానింగ్ చేసి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కు మాత్రమే పంపించాలని, 100 శాతం ఆసుపత్రి లోనే ప్రసవాలు చేయాలని, సాధారణ ప్రసవాలను పెంచుతూ సీ-సెక్షన్ ప్రసవాలను తగ్గించాలని సూచించారు. పుట్టుకతో వచ్చే రుగ్మతలు గుర్తించి చికిత్స అంద చేయాలని వయస్సు, ఎత్తు కు తగిన బరువు లేని వారిని గుర్తించి చికిత్స ను అంద చేయాలని, ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన వారిని పీహెచ్‌సీ వైద్యాధికారులు పరీక్షించాలని అంగన్వాడీ కార్యకర్తలతో సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్‌సీడీ వ్యాధుల స్క్రీనింగ్ లో భాగంగా దయబెటీస్, హైపర్ టెన్షన్ రోగులకి ప్రతి నెల ఉచితంగా మందులు అందచేయాలని ఎక్కడ కూడా మందుల కొరత లేకుండా చూడాలని, పల్లె దవఖానా వైద్యాధికారులు పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమన్వయంతో పని చేయాలని, ఓపీ తరువాత వైద్యాధికారులు ఉప కేంద్రాలలో పనితీరును పర్యవేక్షించాలన్నారు. ప్రతి రిపోర్టులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్లో అప్‌లోడ్ చేయాలని, ఈ ఔషధి పోర్టల్లో మందుల వివరాలను ప్రతి రోజు నమోదు చేయాలన్నారు. టెలీ కన్సల్టేషన్, ఈ-సంజవనీ సేవలను మరింత మెరుగ్గా అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సారంగం, ఎన్ సీ డీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ సుధీర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కే ప్రసాద్, డీపీఎంవోలు రవీందర్ రావు వనకర్ సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, శ్రీరామ్ ఎన్ హెచ్ ఎండీపీఓ రుక్ముద్దీన్, ప్రాథమికఆరోగ్య కేంద్ర, వైద్య అధికారులు డాక్టరు జ్వలిత, డాక్టర్ రవి, చైతన్య, ప్రియాంక, నందనదేవి, శారద, మీరాజ్, పల్లె దవఖాన వైద్యాధికారులు పాల్గొన్నారు.

# గుజరాత్‌లో నకిలీ కోర్టు గుట్టురట్టు

- నకిలీ ట్రైబ్యునల్ ఏర్పాటు
- ఐదేళ్లుగా జడ్జిలా తీర్పులు
- నిందితుడిపై పలు సెక్షన్ల కేసు





**గాంధీనగర్:** గుజరాత్‌లో నకిలీ కోర్టు గుట్టురట్టు అయ్యింది. నకిలీ ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి, జడ్జిగా తీర్పులు ఇచ్చిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్‌?పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

**అసలేం జరిగిందంటే?:** అహ్మదాబాద్ సిటీ సివిల్ కోర్ట్ రిజిస్ట్రార్- కరంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్ ప్రభుత్వ భూమికి సంబంధించి 2019లో నమోదైన కేసులో తన క్లయింట్‌కు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేశాడు. ఆ తర్వాత ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో తన క్లయింట్ పేరును చేర్చాలని కలెక్టర్?ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ ఉత్తర్వును అమలు చేయాలని కోరుతూ శామ్యూల్, మరొక న్యాయవాది ద్వారా సిటీ సివిల్ కోర్టులో అప్పీల్ చేశాడు. తాను జారీ చేసిన నకిలీ ఆర్డర్‌ను కూడా పిటిషన్‌కు జత చేశాడు. దీంతో అసలు విషయం బయటపడగా, సిటీ సివిల్ కోర్ట్ రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**మధ్యవర్తిగా నటిస్తూ!:** నిందితుడు శామ్యూల్ మధ్యవర్తిగా నటిస్తూ వివాదాస్పద భూములపై ఆదేశాలు జారీ చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్టు రిజిస్ట్రార్ హార్దిక్ దేశాయ్. దీంతో పోలీసులు శామ్యూల్?పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో నిజమైన కోర్టు వాతావరణాన్ని శామ్యూల్ సృష్టించాడని పోలీసులు తెలిపారు. "కనీసం ఐదేళ్లుగా అహ్మదాబాద్‌లో శామ్యూల్ నకిలీ కోర్టు నడుస్తోంది. సిటీ సివిల్ కోర్టులో భూ వివాదాల కేసులు పెండింగ్‌లో ఉన్న వ్యక్తులను నిందితుడు ట్రాప్ చేశాడు. వారి నుంచి కేసుకు కొంత మేర నగదును తీసుకున్నాడు. శామ్యూల్ మొదట తనను తాను కోర్టు నియమించిన అధికారిక మధ్యవర్తిగా పరిచయం చేసుకుంటాడు. పిటిషనర్లకు గాంధీనగర్‌లో ఉన్న తన కార్యాలయానికి పిలిపించుకుంటాడు. తన ఆఫీసును కోర్టులాగా తీర్చిదిద్దాడు. అక్కడ ట్రైబ్యునల్ ప్రిసైడింగ్ అధికారిగా నటిస్తూ తన క్లైయింట్‌లను అనుకూలమైన తీర్పును ఇచ్చి, ఉత్తర్వును జారీ చేస్తాడు. శామ్యూల్ అనుచరులే న్యాయస్థాన సిబ్బంది, న్యాయవాదులుగా నటిస్తారు." అని పోలీసులు తెలిపారు.

## హోంగార్డ్ సుబ్బరాజు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మెట్‌పల్లి పోలీసులు



**విశ్వంభర,మెట్ పల్లి:** ఈ నెల10న మెట్ పల్లి పట్టణ శివారు వెంకట్రావు పేట వద్ద టిఫిన్ సెంటర్ లో టిఫిన్ తీసుకుని ఇంటికి వెళుతున్న క్రమంలో నిజామాబాద్ నుండి వరంగల్ వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక నుండి ఢీకొట్టడంతో హోంగార్డు సుబ్బరాజు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. మృతి చెందిన సుబ్బరాజుకు తల్లి, భార్య, ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీళ్ళ ఆర్థిక స్థితిని గుర్తించిన డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నిరంజన్ రెడ్డి మెట్‌పల్లి పోలీసుల తరపున 50వేల రూపాయలు సుబ్బరాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. సుబ్బరాజు కుటబాన్ని ఆదుకుంటామని డీఎస్పీ, సీఐలు తెలిపారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన రాచకొండ రమేష్



**విశ్వంభర, బషీర్ బాగ్:** తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను తెలంగాణ రాష్ట్ర గౌడ యువజన సంఘం అధ్యక్షుడు రాచకొండ రమేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీకి అధ్యక్షుడిగా నియమించడం తెలంగాణ గౌడ కులస్తులు అందరికీ ఇచ్చినా అరుదైన గౌరవం అని కొనియాడారు. తెలంగాణలో బీసీ కులగణన చేపట్టడంలో ముందుండి చుకురైన పాత్ర పోషిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కి, మంత్రి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌పార్టీ అధినాయకత్వనికి రాచకొండ రమేష్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.

## అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

### ఎస్సై బి. నరేష్



**విశ్వంభర, తెలకపల్లి:** అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్య లు తప్పవని స్థానిక ఎస్ఐ బి నరేష్ అన్నారు. సోమ వారం తెలకపల్లి మండల పరిధిలోని నడిగడ్డ గ్రామం లోని దుందుభి వాగు నుండి తెలకపల్లి మండలం కేంద్రం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న కమ్మరెడ్డి పల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ ను మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాల వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ తప్పేట రోహిత్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ బి నరేష్ తెలిపారు.

## రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం



**విశ్వంభర, హన్మకొండ:** తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చదరంగం సమైక్య ఆధ్వర్యం లోహన్మకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం నందు నిర్వహిస్తున్న తెలంగాణ అండర్ 15 బాలబాలికల రాష్ట్రస్థాయి చదరంగం పోటీల ప్రారంభ వేడుకలకు ఈవీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రారంభ అనంతరం క్రీడాకారుల ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చదరంగం క్రీడాకారుడు ఇరిగేసి అర్జునుని ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. ప్రపంచంలోనే చదరంగంలో ఇరిగేసి అర్జున్ మూడవ స్థానంలో ఉండడం చాలా సంతోషకరంగా ఉంది అని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చదరంగంలో ప్రోత్సహించాలని సూచించారు. ఇలాంటి టోర్నమెంట్లనుకండక్ట్ చేయడం ద్వారా క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఓటమి కూడా విజయాలకు దారితీస్తుందని వరంగల్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజ్ కుమార్ తెలాపారు. అనంతరం నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న జిల్లాల నుండి సుమారు 100 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఆర్బిటర్స్ సాయి ప్రదీప్ శ్రీనివాస్ ప్రేమ్ సాగర్ వైశాలి, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శిశుగృహను సందర్శించిన కలెక్టర్



**విశ్వంభర, హన్మకొండ:** మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ అనుబంధ సంస్థ ప్రత్యేక దత్తత విభాగం శిశు గృహను మంగళవారం రోజున జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య సందర్శించారు. ఈ సందర్భంగా వసతులను పరిశీలించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి, బాలల సంక్షేమ సమితి, బాలల పరిరక్షణ విభాగం, శిశుగృహ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాగా శిశు గృహలో ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన వదిలివేయబడిన పిల్లలకు, సరెండర్ చేసిన పిల్లలకు, రక్షణ సంరక్షణ అవసరం ఉన్న పిల్లలకు ఆయా జిల్లాల బాలల సంక్షేమ సమితి వారి ఆదేశాలమేరకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి తెలియజేశారు. ప్రస్తుతం 11 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారని ఒకరికి దత్తత ప్రక్రియకు ఎంపిక కాబడగా మరో ఇద్దరు టైం లైన్ లో ఉన్నారని, మిగతా వారు రక్షణ సంరక్షణ అవసరం ఉన్న పిల్లలని తెలియజేశారు. ప్రస్తుతం ఒకే శిశు గృహలో రెండు యూనిట్లు కొనసాగుచున్నవని దీనివల్ల నిబంధనల ప్రకారం కెపాసిటీ సరిపోదని తెలియజేయగా హన్మకొండ, వరంగల్, జనగాం జిల్లాలను కలిపి హన్మకొండ సెంటర్ పాయింట్‌గా ఒక యూనిట్, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను ఒక యూనిట్‌గా కలిపి మహబూబాబాద్ జిల్లాను సెంటర్ పాయింట్‌గా చేయాలని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. అలాగే వెకెన్సీలో ఉన్న ఆయా పోస్టుల గురించి రాష్ట్ర సంచాలకులకు తెలియచేసి నియామక ఏర్పాట్ల కోసం చర్యలు తీసుకోవాలని, జిల్లాల్లోని జీఎంహెచ్ మదర్ మిల్క్ బ్యాంక్ నుండి శిశు గృహ పిల్లలకు పాలు అందించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె లలితా దేవి, జిల్లా బాలల సంక్షేమ సమితి ఛైర్పర్సన్ అన్నమనేని అనిల్ చందర్ రావు, సభ్యులు డాక్టర్ పరికీ సుధాకర్, జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, ఇన్స్టిట్యూషనల్ ప్రొటెక్షన్ అధికారి ఎం మౌనిక, శిశుగృహ మేనేజర్ దూడం నగేష్, సోషల్ వర్కర్ సంగి చైతన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టాలి



**విశ్వంభర, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా రాకొండ కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఖాళీగా ఉన్నఅటెండర్, స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తులు కొనసాగుతుండగా, పైరవీలు నడుస్తున్నాయని సమాచారంతో నాగర్ కర్నూలు జిల్లా స్వేరోస్ నాయకులు రాజకీయ పైరవీలను ఆపాలని ఎంఈఓ ఆఫీసులో వినతి పత్రం సమర్పించారు. నాగర్ కర్నూల్ జిల్లా స్వేరోస్ ప్రధాన కార్యదర్శి రెడ్డపాకల శివశంకర్ మాట్లాడుతూ రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా తెలకపల్లి మండల మహిళా అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులలో మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టాలని తెలియజేశారు. అలా కాకుండా రాజకీయ నాయకుల సిఫార్లను తీసుకుంటే సహించబోమని అన్నారు. నియామకం అనేది పారదర్శకంగా మెరిట్ ఉన్న వారికే కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ మబ్బు రాము, సంపత్ కుమార్, రాకేష్, తాళ్లపల్లి భాస్కర్, కృపవరం, చింటూ పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో దారుణం..


### 9వ అంతస్థు నుంచి దూకి యువతి ఆత్మహత్య

**విశ్వంభర, హైదరాబాద్:** రామంతాపూర్‌లో దారుణం చోటు చేసుకుంది. స్థానిక డీఎస్ఎన్ మాల్ 9వ అంతస్థు నుంచి దూకి యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలంరేపింది. డీఎస్ఎన్ మాల్‌లో కస్టమర్ రిలేషన్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తోన్న హరిత (24) మంగళవారం సాయంత్రం భవనం 9వ అంతస్థుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఉప్పల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

## మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని పౌరసత్వ వివాదం.. తీర్పు నేటికి వాయిదా



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆరెస్ నేత, వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వ వివాదంపై తీర్పు బుధవారానికి వాయిదా పడింది. చెన్నమనేని రమేశ్‌కు జర్మనీ పౌరసత్వం ఉన్నప్పటికీ తప్పుడు పత్రాలతో భారత పౌరసత్వం పొందారని కాంగ్రెస్ నేత, వేములవాడ ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గతంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన కేంద్ర ప్రభుత్వం 2017లో రమేశ్ భారత పౌరసత్వాన్ని రద్దు చేసింది. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించగా.. మరోసారి పరిశీలించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు పునఃపరిశీలించిన కేంద్రం.. తమ నిర్ణయం సరైందేనంటూ రమేశ్ పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నట్టు పునరుద్ఘాటించింది. దీంతో రమేశ్ మళ్లీ హైకోర్టును ఆశ్రయించగా.. కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. సుదీర్ఘంగా పూర్తిస్థాయి వాదనలు విని తీర్పు రిజర్వు చేసింది. జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం తీర్పును బుధవారానికి వాయిదా వేసింది.



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి. (విశ్వంభర, అబ్దుల్లాపూర్ మెట్)

## డా. కోడి శ్రీనివాసులుకు మహాత్మా గాంధీ శాంతి పురస్కారం ప్రదానం




**విశ్వంభర,చండూరు :** గాంధీజీ ఫౌండేషన్, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులకు తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియం కింగ్ కోటి లోని తిలక్ నగర్ లో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు 2024 ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, బొగ్గారపు దయానంద్‌లు, బీసీ కమిషన్ చైర్మన్ గోపిషెట్టి నిరంజన్, విశ్రాంత న్యాయమూర్తి చంద్ర శేఖర్ చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు రాజనారాయణ్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ తాను గాంధీజీ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సిటిజెన్ కౌన్సిల్ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

## ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లకు శిక్షణ




**విశ్వంభర, హన్మకొండ:** ఆరోగ్యవంత మైన జీవనశైలిలో భాగంగా గర్భిణీలు, బాలింతలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడంతో పాటు యోగ, ధ్యానాన్ని అలవర్చుకునే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం వరంగల్ కాకతీయ వైద్య కళాశాల ఎన్నారై సమావేశ మందిరంలో ఆర్య జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో, హనుమకొండ శ్రీ రామకృష్ణ సేవా సమితి నిర్వహణలో గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించాల్సిన కార్యక్రమాలపై ఐసీడీఎస్ సూపర్వైజర్లకు, అంగన్వాడీ టీచర్లకు క్షేత్రస్థాయిలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హన్మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యవంతంగా ఉండేందుకు గర్భిణులు, బాలింతలకు ఉపయోగపడే యోగ, ధ్యానం ఆసనాలతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి ఐసీడీఎస్ సూపర్వైజర్లకు సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పౌష్టికాహారం, యోగాసనాలు, ధ్యానం, ఇతర ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన వివిధ అంశాల గురించి ఐసీడీఎస్ సూపర్వైజర్లు మండల స్థాయిలో అంగన్వాడి టీచర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించే విధంగా ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మూడు పద్ధతులను గర్భిణీ స్త్రీలు పాటించడం వలన శ్రేష్టమైన సంతానం కలుగుతుందని అన్నారు. ఈ శిక్షణా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ఆర్యజనని అధ్యక్షులు డా. అనుపమ రెడ్డి, శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు, కటంగూరు సత్యనారాయణ రెడ్డి, గైనకాలజిస్ట్ డా. కే.స్వరూపరాణి, జనరల్ ఫిజిషియన్ డా. శివ సుబ్రహ్మణ్యం, పిల్లల డా. విజయ్ కుమార్, జిల్లా శిశుసంక్షేమాధికారి, జయంతి, ఆర్యజనని నిర్వాహకులు ఆనేటి దశరథం, శ్రీమతి భద్ర, సేవాసమితి సభ్యులు, విష్ణు వర్ధన్ రెడ్డి,కేవిరావు,రాధిక,అంజనీదేవి, లక్ష్మీ దేవి,అనిత,శ్రీలక్ష్మీ,పార్వతి, శిల్ప, అంగన్‌వాడీ టీచర్లు ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయిల్ ఫెడ్ రిటైర్డ్ ఉద్యోగులకు చెక్కుల పంపిణీ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఆయిల్ ఫెడ్ రిటైర్డు ఉద్యోగులకు పెండింగ్ చెక్కులను పంచిన తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి. ఆయిల్ ఫెడ్ సంస్థలో పని చేసి పదవి విరమణ పొందిన 25 మంది ఉద్యోగుల కు రూ.7.50 లక్షల రూపాయల చెక్కులను మంగళవారం పరిశ్రమల భవన్ లోని తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ ఛాంబర్‌లో రాఘవ రెడ్డి ఉద్యోగులకు అందజేసారు. ఈ సందర్భంగా చెక్కులను అందుకున్న ఉద్యోగులు చైర్మన్ రాఘవ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసారు.

## పట్టపగలు దొంగల భీభత్సం



**విశ్వంభర, తెల్కపల్లి:** తెల్కపల్లి మండలం రాకొండ గ్రామానికి చెందిన కొట్టే మల్లయ్య ఇంట్లో పట్టపగలు దొంగలు పడ్డారు. కొట్టే మల్లయ్య తన భార్య రజితతో కలిసి ఇంటికి తాళం వేసి మంగళవారం మధ్యాహ్నం తెల్కపల్లిలో కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంటీ తాళం పగులగొట్టి లోనికి వెళ్లి బీరువా తెరిచి అందులో ఉన్న 30 వేల రూపాయల విలువ చేసే 2 మాసాల బంగారు కమ్మలు, సెల్ఫ్ లో ఉన్న 15000 రూపాయల నగదును దోసుకెళ్లారు. తెల్కపల్లి కూరగాయల మార్కెట్ నుండి ఇంటికి వచ్చిన భార్య భర్తలకు ఇంటి తాళం విరగొట్టి, ఇంటి లోని బీరువా తెరిచి, బట్టలు చిందరవందరగా పడి ఉండడం కనిపించింది. అనుమానంతో లోనికి వెళ్లి చూశారు. దొంగలు పడ్డారని గమనించిన మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భాదితుడి ఫిర్యదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్న తెలకపల్లి ఎస్ఐ బి. నరేష్ దర్యాప్తు ప్రారంభించారు.

## సీఆర్పీఎఫ్ పాఠశాల వద్ద బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

విశ్వంభర, హైదరాబాద్: సికింద్రాబాద్ జవహర్ నగర్ పరిధిలోని సీఆర్పీఎఫ్ పాఠశాల వద్ద బాంబ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు చేపట్టారు. దేశవ్యాప్తంగా ఉన్న సీఆర్పీఎఫ్ పాఠశాలలకు మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు కాల్ రావడంతో నగరంలోని పోలీసులు అప్రమత్తమయ్యారు. పాఠశాలకు చేరుకున్న జవహర్ నగర్ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పాఠశాలలోని పిల్లలను క్షేమంగా వారి వారి ఇళ్లకు స్కూల్ యాజమాన్యం పంపించింది. ఘటనా స్థలికి రాచకొండ సీపీ సుధీర్ బాబు, కుషాయిగూడ ఏసీబీ మహేశ్ చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

# విద్యార్థి దశ నుండే శాంతిమార్గంలో నడవాలి



**విశ్వంభర, బషీర్ బాగ్:** శాంతి, మతసామరస్యానికి ప్రతీకైనా హైదరాబాద్ నగరం మనందరికీ ఆదర్శమని తెలంగాణ శాసలమండలి డిప్యూటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ బండ ప్రకాష్ అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం హాబిట్స్ లోని బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో మహాత్మా గాంధీ జయంతి, అంతర్జాతీయ అహింసా దినోత్సవ ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని ముఖ్యఅతిథిగా విచ్చేసి బండ ప్రకాష్ ప్రసంగించారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులు, యువకులు శాంతి మార్గంలో నడిచి దేశ సమైక్యత, అభివృద్ధికి పాటుపడాలన్నారు. తెలంగాణ శాసనమండలి సభ్యులు ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద గుప్తా మాట్లాడుతూ హింస మార్గం ద్వారా జీవితంలో ఏమీ సాధించలేమని కుల మతాలకు అతీతంగా ఐక్యంగా శాంతియుత జీవనం సాగిస్తూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి చంద్రకుమార్ మాట్లాడుతూ గాంధీ పయనించిన శాంతి, అహింస సద్భావన వంటి అంశాలను అనుసరిస్తే సమాజం అన్ని రంగాల్లో పురోగమనం దిశగా వెళుతుందన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమర ఉద్యమంలో మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు, త్యాగాలపై నేటి యువత, విద్యార్థులు అధ్యయనం చేసి దేశాభివృద్ధికి పాటుపడాలని, ఇంటింటికి బీసీ సర్వేల గురించి వచ్చే అధికారులకు సరైన కుటుంబ సభ్యుల వివరాలుఅందించాలని అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ను ఇటీవల అమెరికాలో అక్కడి యూనివర్సిటీ ప్రొఫెసర్లు సన్మానించి, అవార్డు పొందిన ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా న్యాయవాది డిఎల్ పాండు, పి. ఉజ్వల్ చందర్, డాక్టర్ రవితేజ, విద్యావేత్త ఎస్ మధుసూదన్ ముదిరాజ్, బత్తుల హేమంత్, ఢిల్లీ శివకుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు అందుకున్న వారిలో ఎన్ ఆర్ లక్ష్మణరావు, వి ప్రభాకర్ రావు ఎన్ ఆర్ లక్ష్మణ్ గుప్తా, వి.ప్రభాకర్ రావు, డాక్టర్ కోడి శ్రీనివాసులు, బండి రాజుల శంకర్, జి విజయలక్ష్మి, డాక్టర్ పి భిన్నబాబు, శ్రీ జి ఎట్టయ్య, కటకం భాస్కర్ గుప్తా, డాక్టర్ లంక గంగాధరం కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, వై చంచల, మహేష్ అగర్వాల్, డాక్టర్ ఎన్ ప్రసాద్, డాక్టర్ జి స్వరూప రాణి, మహమ్మద్ పర్వేజ్, ఈ.ముత్యం యాదవ్, డి లక్ష్మణ్ ముదిరాజ్, డి నరేందర్, పి భరత్ రెడ్డి, తాళ్ల నరేందర్, డాక్టర్ జమాన్, వి. రమణమ్మ లకు శాలువా, జ్ఞాపిక పూలమాలతో ఘనంగా సన్మానించి అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కూచిపూడి భరతనాట్యం చేసిన నృత్య కళాకారులు కుమారి పొటెల్ వంశిక యాదవ్, కుమారి నయన, చిన్నారి నందలు చేసిన నృత్యం ఆహూతులను అలరించాయి.

# విద్యార్థులు వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** విద్యార్థులు ఏకాగ్రతతో వృత్తి విద్యలో నైపుణ్యాన్ని సాధించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులతో ముకాముఖీ అయ్యారు. ఈ సందర్భంగా ఆధునిక శిక్షణా కేంద్రం వర్కు షాపు నిర్మాణ పనులను పరిశీలించి డిసెంబర్ మాసం చివరి నాటికి పూర్తి అయ్యే విధంగా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్కు షాపులో ఏర్పాటు చేయనున్న పరికరాలను పరిశీలించారు. పనులకు ప్రత్యామ్నయంగా పరికరాలు ఏర్పాటును పరిశీలించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. ఎం ఎస్ ఆఫీస్, ఫిట్టర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్నవిద్యార్థులతో మాట్లాడారు. శిక్షణా కేంద్రంలోని సౌకర్యాలు, శిక్షణా విధానాలు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఎలా దోహదపడుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు శిక్షణలో పూర్తిస్థాయిలో మెలకువలు సాదించాలని సూచించారు. విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, తమ భవిష్యత్తును మెరుగుపరచుకోవాల పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. విద్యార్థులకు శిక్షణా కేంద్రంలో అందుతున్న సదుపాయాలను, నైపుణ్యాలను అడిగి తెలుసుకుని, విద్యార్థుల స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులను ప్రవేశ పెట్టిందని, ఆధునిక శిక్షణా కేంద్రంలో 6 ట్రేడులల్లోఅడ్మిషన్లు జరుగుతున్నాయని, ఇట్టి కోర్సుల్లో ప్రవేశాలపై మీ బంధు, మిత్రులకు తెలియచేయాలని సూచించారు. శిక్షణా కార్యక్రమాలు, సాంకేతికతను మెరుగుపరచడంలో విద్యార్థుల కు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఐటీఐ వెనుకభాగంలో నిర్మిస్తున్న వసతి భవనాన్ని పరిశీలించి అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ జాంలా నాయక్, ఆర్డిఓ మంగిలాల్, తహసీల్దార్ శ్రీనివాస రావు, శిక్షణా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## వలీమా ఫంక్షన్‌కు హాజరైన టీఎన్జీవోస్ నేత



**విశ్వంభర, బషీర్‌బాగ్:** ఆర్జేడీఏస్ఈ సీనియర్ అసిస్టెంట్ అల్తాఫ్ హుస్సేన్ వలీమా ఫంక్షన్ కు టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కే.ఆర్ రాజ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫిరోజ్ అహ్మద్‌లు హాజరై పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వలీమా ఫంక్షన్‌లో ముజ్జాయిద్, యూసుఫ్ హుస్సేని, మల్లికార్జునరెడ్డి, శ్రీకాంత్, చంద్ర శేఖర్ రెడ్డి, గిరి గౌడ్, శ్రీధర్, అల్తాఫ్, శ్రీనివాసులు, హనీఫ్ బాబు, మధు, బాలాజీ గోస్వామి, అశోక్, భాషా, రోషన్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, కోరుట్ల:** కోరుట్ల మండలంలోని నాగులపేట్, సంఘం, వెంకటాపూర్, గుమ్లాపూర్, మోహన్రావు, పేట్ చిన్న మెట్పల్లి, మాదాపూర్, పైడిమడుగు, జోగిన్పల్లి, కల్లూరు, ధర్మారం, ఐలాపూర్ గ్రామాల్లో వాన కాలం ఐకేపీ పీఏసీఎస్ వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కి రైతులు, ప్రజలు సాధరంగా స్వాగతం పలికారు. ఐకేపీ పీఏసీఎస్ సభ్యులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే



**విశ్వంభర, పరిగి:** పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొని లక్ష్మీ నరసింహా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని ప్రతి ఒక్కరూ దైవ చింతన పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు, కౌన్సిలర్ కృష్ణ, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి లింగం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబయ్య, రాజ పుల్లారెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్, మహిపాల్, మల్లేష్, నాగవర్ధన్, జగన్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సురేఖ రెడ్డి పాల్గొన్నారు.

# నవంబర్ 1న సదర్ మేళా



**విశ్వంభర, మలక్‌పేట్:** దీపావళి మరుసటి రోజున నవంబర్ 1న సైదాబాద్ సదర్‌మేళా నిర్వహించ నున్నట్లు యాదవ్ సంఘం చావుణి, ఉప్పర్ గూడ కమిటీ సభ్యులు తెలిపారు. చావుణి ఉప్పర్ గూడా యాదవ్ సంఘం ఏర్పాటు చేసిన పాత్రికే య సమావేశంలో సదర్ మేళా పోస్టర్‌ను సంఘం సభ్యులు ఆవిష్కరణ చేశారు. కమిటీ సభ్యులు నిరంజన్ యాదవ్, రాంపాల్ యాదవ్‌లు మాట్లాడుతూ నిజాం కాలం నుండి ఏర్పాటు చేస్తున్న ఈ సదర్ మేళాకి ప్రజలు పాల్గొంటారని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖలు సమన్వయంతో అన్ని ఏర్పట్లు చేస్తారని తెలిపారు. రాహుల్ కిషోర్ యాదవ్ మాట్లాడుతూ సదర్ మేళా ఉత్సవాలకు అన్ని మతాలకు చెందిన వ్యాపారులు సదర్‌లో పాల్గొంటారని, సదర్ కార్యక్రమానికి నగరకమిషనర్ సీవీఆనంద్ బందోబస్తు ఏర్పాటు చేస్తారని తెలిపారు. సంపత్‌యాదవ్, నిరంజన్ యాదవ్, కె.వి. రాంపాల్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్,రాజు యాదవ్,గోపాల్ యాదవ్, ధన్ రాజ్ యాదవ్, అజయ్,రాహుల్ కిషోర్ యాదవ్, ప్రమోద్, పెద్ది పాల్గొన్నారు.

## జేఎల్ పోస్టులను విడుదల చేసిన టీజీపీఎస్సీ

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో జూనియర్ లెక్చరర్ పోస్టుల ఫలితాలను టీజీపీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,392 జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, పలు జేఎల్ పోస్టులకు సంబంధించి మంగళవారం ప్రొవిజినల్ లిస్టు విడుదలైంది. ఎంపికైన వారి వివరాలను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## అధికారులను సస్పెండ్ చేయడం అన్యాయం

### - మాజీ ఉద్యోగ సంఘాల చైర్మన్ దేవి ప్రసాద్



**విశ్వంభర, హైదరాబాద్:** వ్యవసాయ శాఖలో 156 మంది అగ్రికల్చర్ ఎక్సటెన్షన్ అధికారులను సస్పెండ్ చేయడం అన్యాయమని మాజీ ఉద్యోగ సంఘాల చైర్మన్ దేవి ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2600 మంది అధికారులను డిజిటల్ సర్వే చేయాలని ప్రభుత్వం కొంత కాలంగా వేధిస్తున్నదని, పనిభారం అధికంగా ఉందని దశలవారీగా సర్వే ఏర్పాట్లకు అనుమతి ఇవ్వాలని ఎన్నిసార్లు చెప్పినప్పటికీ సమస్యను పరిష్కరించకుండా వేధింపులకు పూనుకోవడం సరికాదు అన్నారు. వేరే కారణాలతో 31 జిల్లాలలో 5గురు చొప్పున, మేడ్చల్ జిల్లా నుండి ఒక్కరిని మొత్తం 156 మంది అధికారులను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. రాష్ట్ర చరిత్ర లోఇలాంటి ఘటన చోటుచేసుకోవడం తొలిసారి అని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకుండా ఒకవైపు రైతులను ఇబ్బందికి గురిచేస్తున్నదని, ఉద్యోగుల తో చర్చించి పనిభారాన్ని తగ్గించి వేధింపుల ఆపాలని, సస్పెన్షన్ ఉత్తర్వులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## అన్యమత ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### కార్పొరేటర్ రంగా నరసింహ గుప్త



**విశ్వంభర, ఎల్బీనగర్:** చైతన్యపురిలో అన్యమత ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ రంగా నరసింహగుప్త అన్నారు. చైతన్యపురి డివిజన్‌లోని గణేష్ పురి కాలనీలోగల ప్రిన్స్ హై స్కూల్‌లో పిల్లలకు, వారి పేరెంట్స్‌తో అన్యమత ప్రచారం చేస్తున్నారని స్థానికుల ద్వారా తెలుసుకున్న చైతన్యపురి కార్పొరేటర్ నరసింహ గుప్త ప్రిన్స్ హై స్కూల్ కు వెళ్లి వారిని మందలిచారు. పోలీస్, జీహెచ్ఎంసీ, తహసిల్దార్, ఎంఈఓ, అన్ని డిపార్ట్మెంట్ లను పిలిచి స్థానిక స్కూల్ మీద చర్యలు తీసుకొని స్థానికుల, పిల్లల మనోబావాలు దెబ్బతినకుండాచూడాలని,చర్యలుతీసుకోవాలనికోరారు. డీసీకి వినతిపత్రం అందజేశారు.

## సీఎం రేవంత్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయండి

### బంజారాహిల్స్‌లో బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

**విశ్వంభర, హైదరాబాద్:** కేటీఆర్, హరీశ్‌రావులను బుల్డోజర్లతో తొక్కిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బెదిరింపులతో నాయకుల భద్రతపై ఆందోళన కలుగుతోందని పేర్కొన్నారు. హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ముఖ్యమంత్రా...ముఠానాయకుడా?**: సీఎం రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేసిన అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిలా కాకుండా ముఠా నాయకుడిగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పాలన చేతకాక అసహనంతో అశాంతి లేపే కుట్రకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. రేవంత్ వాడుతున్న ఆటవిక భాష శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తోందని అన్నారు. వీపు చింతపండు చేస్తా.. బుల్డోజర్లు ఎక్కించి తొక్కుతా అని మా నేతలు కేటీఆర్, హరీశ్ రావులను ఉద్దేశించి రేవంత్ మాట్లాడుతున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నా.. రేవంత్ మాటల్లో బూతులు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ పై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చిన్న పోస్టు పెడితేనే మా సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదుచేస్తున్నారని ఎర్రోళ్ల శ్రీనివాస్ తెలిపారు. తొక్కుతా చంపుతా అంటూ సీఎం స్థాయిలో బజారు భాష మాట్లాడం వల్ల కింది స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలను హింస చేయడానికి ప్రేరేపిస్తున్నారని అన్నారు. సీఎం భాష వల్లే మా నేతలపై దాడులు జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఖమ్మంలో హరీశ్ రావుపై, ముషీరాబాద్ లో కేటీఆర్ పై, కొండాపూర్ లో కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడులు రేవంత్ చేయించినవే నని తెలిపారు. రేవంత్ తన తీరు మార్చుకోకపోతే జరిగే పరిణామాలకు ఆయనే భాధ్యత వహించాలని హెచ్చరించారు.

## 29న వనపర్తిలో రైతులతో భారీ నిరసన సదస్సు

### నిరంజన్ రెడ్డి

**విశ్వంభర, వనపర్తి :** అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయకుండా రైతులను అరిగోస పెడుతుందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వనపర్తిలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని, బాధ్యతగల ప్రతిపక్షంగా రైతుల పక్షాన పోరాడాలని బీఆర్ఎస్‌కు శ్రేణులకు పిలుపు నిచ్చారు. వనపర్తిలో ఈ నెల 29న వేలాది మంది రైతులతో భారీ నిరసన సదస్సు చేపడుతున్నామని, దీనికి హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ రైతు సదస్సులో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ప్రతి మహిళకు రూ.2500, యువతులకు స్కూటీలు,కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, 4వేల ఆసరా ఫించన్లు, నిరుద్యోగ భృతి, కె.సి.ఆర్ కిట్టు, తదితర హామీలు ఇవ్వకుండా మోసం చేసిన ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించి అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేటట్లు చేయాలని పిలుపునిచ్చారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రభుత్వ మోసపూరిత చర్యలపై సమరభేరి మోగిస్తామని సదస్సులో బీఆర్ఎస్ నాయకులు తీర్మానం చేశారు.

# నాలుగు ఇసుక లారీలు పట్టివేత



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ఎస్ఐ కే పవన్ కుమార్ తన సిబ్బందితో కలిసి ఎల్ అండ్ టీ రోడ్డు మేడిగడ్డ వద్ద వాహన తనిఖీలను చేపట్టారు. అదే సమయంలో పంకెన క్వారీ నుండి వస్తున్న ఇసుక లారీలను ఆపి వాటి యొక్క వే బిల్లులను తనిఖీ చేశారు. నిర్దేశించిన బరువు కంటే అధిక ఇసుకను కలిగి ఉన్నాయని అనుమానం వచ్చి, ఎస్ఐ కుదురుపల్లి వద్ద ఇసుకతో కూడిన లారీలను బరువు తూగించగా 4 లారీలు నిర్దేశించిన బరువు కంటే అధిక లోడు ఇసుకను కలిగి ఉన్నాయని నిర్ధారించుకున్నారు. వెంటనే ఎస్ఐ అట్టి లారీలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ మున్సిపల్ కమిషనర్



**విశ్వంభర, వనపర్తి :** కాంట్రాక్టు బిల్లుల విషయంలో లంచం తీసుకుంటూ పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అదనపు ఎస్పీ శ్రీకృష్ణ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరుకు చెందిన మున్సిపల్ కాంట్రాక్టర్ ఒకరు తనకు రావాల్సిన బిల్లులు ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. అందుకు కమిషనర్ ఆదిశేషు రూ.20,000 లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు చేసేది లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు రూ.20,000 లంచం తీసుకుంటుండగా కమిషర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## హాస్టల్ నుంచి నలుగురు విద్యార్థులు అదృశ్యం

### నిర్మల్ జిల్లాలో ఘటన

**విశ్వంభర, నిర్మల్:** నిర్మల్ జిల్లా భైంసా ఎస్సీ హాస్టల్ బాలుర వసతి గృహం నుంచి మంగళవారం ఉదయం నలుగురు విద్యార్థులు అదృశ్యమవడం స్థానికంగా కలకలం రేపింది. చరణ్, రాకేష్, కేశవ్, ఈశ్వర్ అనే విద్యార్థులు మంగళవారం అదృశ్యమ య్యారు. విషయం తెలుసుకున్న వార్డెన్ నగేష్ విద్యార్థుల తల్లితండ్రులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ అక్కడికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, రాష్ట్రంలో ఇటీవలి కాలంలో హాస్టల్స్ నుంచి విద్యార్థులు పారి పోవడమో లేదా ఆత్మహత్యలు చేసుకోవడం వంటి సంఘటనలు పెరుగుతు న్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనక గురవుతున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల నియామకం చేపట్టాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** చిట్యాల, మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి వైద్యులు నియామకానికి చర్యలు చేపట్టాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు, టీజీ ఎంఎస్ఐడీసీ, వైద్యులతో సిబ్బంది ఖాళీలు, ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మాణానికి అనువైన స్థలం కేటాయింపు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, సౌకర్యాలు కల్పన, ఖాళీ పోస్టులు నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం వైద్య సిబ్బంది, అందుబాటులో ఉన్న సిబ్బంది, పోస్టులు ఖాళీలపై జిల్లా వైద్యాధికారి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు సంయుక్త నివేదికలు అందచేయాలని పేర్కొన్నారు.సమీక్షలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నకలెక్టర్ త్వరితగతిన ప్రక్రియ పూర్తిచేసేలా కృషి చేయాలని ఆదేశించారు. ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి అనుకూలమైన భూమి కేటాయించాలని సూచించారు. పలు మండలాల్లో ఉన్న ఉప ఆరోగ్య కేంద్రాలు తగిన సదుపాయాల లేమితో ఉండటాన్ని పరిగణలోకి తీసుకొని, ఆయా కేంద్రాలకు తక్షణమే అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాలు కల్పన నివేదికలు అందజేయాలని స్పష్టం చేశారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా డ్యూటీ రోస్టర్ నిర్వహణను కట్టుదిట్టంగా పాటించాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో రెగ్యులర్‌గా సమీక్షించే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. సౌకర్యాలు కల్పనకు అవసరమైన నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నిధుల ద్వారా ఉప కేంద్రాలలో అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తద్వారా జిల్లాలో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్ కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఏఈ రవికిరణ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## లైబ్రరీని తనిఖీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ లో గలగ్రంథాలయం, పంచాయతీ కార్యాలయం, మహాదేవపూర్ మండలం అంబటిపల్లి లోని లైబ్రరీని, అంగన్వాడీ సెంటర్ ను జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు తనిఖీ చేశారు. ఆయనతోపాటు జిల్లా గ్రంథాలయ సెక్రెటరీ శ్రీలత, మాదాపూర్ మండల పంచాయతీ అధికారి ప్రసాద్ ఉన్నారు.




మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ సభ్యుడిగా సంగివేని రవీంద్రని నియమించారు. ఈమేరకు నియామకప్రతం అందజేశారు. కార్యక్రమంలో మంత్రి సుధీర్ మునిగంటివార్, అకాడెమీ డైరెక్టర్ సచిన్ నింబాల్కర్ పాల్గొన్నారు.

# ప్రియాంకా గాంధీ కంటే..
# నేనే సీనియర్: నవ్యా హరిదాస్



**వయనాడ్:** తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెట్టిన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీ వయనాడ్‌లో ముక్కోణపు పోటీ ఎదుర్కొంటున్నారు. దశాబ్దకాలంగా ప్రజాప్రతినిధిగా ఉన్న బీజేపీ అభ్యర్థి నవ్యా హరిదాస్ ప్రియాంకకు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పీటీఐ వార్త సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చిన నవ్య.. ప్రజాప్రతినిధిగా ప్రియాంక కంటే తనకే ఎక్కువ రాజకీయ జీవితం ఉందని, ఈ ఎన్నికల్లో తనదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. "నెహ్రూ కుటుంబ నేపథ్యం ఉన్నందున ప్రియాంకకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. కానీ, ఇది ఆమెకు తొలి ఎన్నిక. మరోవైపు కొయ్‌కోడ్ కౌన్సిలర్‌గా వరుసగా రెండుసార్లు పనిచేశా. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశా. ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధిగా ఉన్నందున.. ప్రియాంకపై పోటీ చేయడం భిన్నంగా ఏమీ అనిపించడం లేదు. ఆమె కంటే నాకే ఎక్కువ రాజకీయ అనుభవం ఉందని భావిస్తున్నా" అని నవ్యా హరిదాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ బాధ్యతారాహిత్యం వల్ల ఈ ఎన్నిక అనివార్యమైందని, సోదరి కోసం వయనాడ్‌ను రాహుల్ వదిలేశారని విమర్శించారు. కుటుంబ ఆధిపత్యానికి ఇదో ఉదాహరణ అని.. ఇదే అంశాన్ని ఓటర్ల ముందుకు తీసుకెళ్తానని అన్నారు.

**సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి..** బీటెక్ పూర్తిచేసిన నవ్యా హరిదాస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశారు. 2009లో మెరైన్ ఇంజినీర్ శోబిన్ శ్యామ్‌ను వివాహం చేసుకున్న తర్వాత సింగపూర్ వెళ్లారు. అక్కడ నాలుగేళ్లపాటు ఐటీ కంపెనీలో పనిచేశారు. అనంతరం నెదర్లాండ్స్, అజైర్‌బైజాన్‌లలో పనిచేశారు. ఈ క్రమంలో 2015లో భారత్‌కు వచ్చిన ఆమె ఊహించని పరిస్థితుల్లో రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఆర్ఎస్ఎస్ కుటుంబ నేపథ్యం ఉండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రావడం, అందులో విజయం సాధించి కొయ్‌కోడ్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. గత రెండు పర్యాయాలుగా కౌన్సిలర్‌గా కొనసాగుతున్న ఆమె, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రస్తుతం ఆమె బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా జనరల్ సెక్రటరీగా ఉన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ, వయనాడ్‌ల నుంచి పోటీ చేసి గెలిచిన రాహుల్ గాంధీ..వయనాడ్ స్థానాన్ని వదులుకున్నారు. దీంతో ఉపఎన్నిక అనివార్యమైంది. బీజేపీ నుంచి నవ్యా హరిదాస్, కాంగ్రెస్ నుంచి ప్రియాంకా గాంధీ రంగంలో దిగగా.. ఎల్‌డీఎఫ్ తరఫున సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే సత్యన్ మొకెరీ పోటీ చేస్తున్నారు. నవంబర్ 13న ఉప ఎన్నిక జరగనుంది.

## లారెన్స్ బిష్ణోయ్‌ని ఎన్‌కౌంటర్ చేస్తే భారీ నజరానా
### పోలీసులకు క్షత్రియ కర్ణి సేన ఆఫర్



**ముంబయి:** మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్యతో గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరు మరోసారి దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. ప్రస్తుతం జైల్లో ఉన్న అతడిని ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులకు రూ.కోటికి పైగా నజరానా ఇస్తామని క్షత్రియ కర్ణి సేన రివార్డ్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు రాజ్ షెకావత్ వీడియో విడుదల చేసినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. "లారెన్స్ బిష్ణోయ్‌ను ఎన్‌కౌంటర్ చేసిన ఏ పోలీసు అధికారికైనా వారి భద్రత, కుటుంబ భవిష్యత్తు కోసం రూ.కోటికి పైగా ఇస్తాము. ఈ గ్యాంగ్ ఎన్ని హత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వం, గుజరాత్ అధికారులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదు. మా అధినేత సుఖ్‌దేవ్ సింగ్ గోగమేడిని చంపిన వారిని వదిలేది లేదు" అని రాజ్ షెకావత్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. కాగా 2023, డిసెంబర్‌లో రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన అధ్యక్షుడు సుఖ్‌దేవ్ సింగ్ గోగామేడీని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. అనంతరం ఆయనను తామే హత్య చేసినట్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కొన్నేళ్లుగా జైల్లోనే ఉంటున్నాడు. బ్యారక్‌ల్లోకి అక్రమంగా వచ్చే సెల్‌ఫోన్ల ద్వారా అనుచరులతో నిరంతరం టచ్‌లో ఉంటూ హత్యలకు ప్రణాళికలు రచిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. సిద్ధూ మూసేవాలా, బాబా సిద్ధిఖీపై దాడులు ఈ విధంగానే చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.


## 2020 కంటే ముందున్న పరిస్థితి వస్తే
# బలగాల ఉపసంహరణ
### ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ప్రకటన



**దిల్లీ:** 2020 కంటే ముందున్న పరిస్థితి ఏర్పడితేనే బలగాలను వెనక్కి రప్పిస్తామని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. "ఏప్రిల్ 2020 ముందునాటి యథాతథ స్థితికి తిరిగి వెళ్లాలని అనుకుంటున్నాం. ఆ తర్వాతే బలగాల ఉపసంహరణ, ఎల్ఏసీ వద్ద సాధారణ నిర్వహణను పరిశీలిస్తాం. 2020 నుంచి మా వైఖరి అదే. చైనాతో సరిహద్దుల్లో విశ్వసనీయతను పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. బఫర్‌జోన్‌లోకి ప్రవేశించబోమని ఒకరికొకరం భరోసా ఇచ్చుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ ఇరుదేశాలు కీలక గస్తీ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఆయన స్పందన వచ్చింది. తాజా ఒప్పందం ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం విలేకరుల సమావేశంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. "వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. గత కొన్ని వారాలుగా దౌత్య, సైనిక సంధానకర్తలు జరుపుతున్న చర్చల ఫలితంగా ఈ పురోగతి చోటుచేసుకుంది" అని ఆయన తెలిపారు. రష్యాలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు మంగళవారం ప్రధాని మోదీ బయల్దేరతారనగా ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రకటన వెలువడటం గమనార్హం. సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశాలున్నాయని దౌత్య వర్గాలు పేర్కొంటున్నాయి. 2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన తీవ్ర ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. ఘర్షణలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోష్ బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. కానీ ఆ సంఖ్యను వెల్లడించలేదు. చాలా నెలల తర్వాత ఐదుగురు చనిపోయినట్లు అధికారికంగా అంగీకరించింది. ఘర్షణల నేపథ్యంలో ఇరు దేశాలు ఎల్ఏసీ వెంబడి భారీ స్థాయిలో బలగాలను మోహరించాయి. అప్పటినుంచి రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**ఒప్పందాన్ని ధ్రువీకరించిన చైనా..** తూర్పు లద్దాఖ్‌లో ప్రతిష్టంభనకు ముగింపు పలికేందుకు భారత్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని మంగళవారం చైనా ధ్రువీకరించింది. సరిహద్దు సంబంధిత సమస్యలపై మిలిటరీ, దౌత్య మార్గాల ద్వారా రెండు దేశాల మధ్య కొంతకాలంగా సంప్రదింపులు కొనసాగాయని తెలిపింది. ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికి భారత్‌తో కలిసి పనిచేస్తామని వెల్లడించింది.

## టెల్ అవీవ్‌పై క్షిపణుల వర్షం
### విమాన రాకపోకలకు అంతరాయం



**టెల్ అవీవ్:** ఇజ్రాయెల్ – హెజ్‌బొల్లా మధ్య పోరుతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతు న్నాయి. తాజాగా ఇజ్రాయెల్‌పై ఆ మిలిటెంట్ సంస్థ క్షిపణులతో విరుచుకు పడింది. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కానీ, టెల్ అవీవ్‌లో విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. హెజ్‌బొల్లా మంగళవారం టెల్ అవీవ్‌లోని నిరిట్ ప్రాంతంపై క్షిపణులతో దాడి చేసింది. ఈ క్రమంలో బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాకపోకలు నిలిచిపోయాయి. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో యూఎస్ విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ ఇజ్రాయెల్‌లో పర్య టిస్తున్నారు. హెజ్‌బొల్లా దాడులకు దిగడం ఆందోళనకరంగా మారింది. మరోవైపు సోమవారం దక్షిణ బీరుట్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఐదుగురు మృతి చెందగా.. వారిలో ఒక చిన్నారి ఉన్నట్లు ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది.

## మీ పిల్లలకు తమిళ పేర్లే పెట్టండి
### యువ జంటలకు ఉధయనిధి స్టాలిన్ పిలుపు



**చెన్నయ్:** తమిళనాడులో రాజకీయాలు వేడెక్కాయి. రాష్ట్ర గీతంలో 'ద్రావిడ' పదాన్ని తొలగించడంపై అధికార డీఎంకే పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసున్నది. రాష్ట్ర గవర్నర్‌తో పాటు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నది. ఈ క్రమంలోనే డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ నూతన వధూవరులకు కీలక విజ్ఞప్తి చేశారు. తమిళనాడుపై హిందీని రుద్దేందుకు చాలామంది ప్రయత్నాస్తున్నారని.. ఈ పరిస్థితుల్లో యువ జంటలు తమకు పుట్టబోయే పిల్లలకు తమిళంలోనే పేరుపెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నూతన వధూవరులు తమ పిల్లలకు తమిళ పేర్లుపెట్టి హిందీని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తమిళనాడు ఎప్పటికీ హిందీని స్వీకరించదని స్పష్టం చేశారు. ఒకరు తమిళనాడు పేరును మార్చేందుకే ప్రయత్నించారని.. కానీ, రాష్ట్రవ్యాప్తంగా అభ్యంతరాలు రావడంతో క్షమాపణలు చెప్పారన్నారు. డీఎంకే పార్టీ, తమిళుడు ఉన్నంత వరకు ఎవరూ తమిళం, తమిళనాడు, ద్రావిడ పదాలను తుడిచివేయలేరన్నారు. తమిళనాడు ఎప్పటికీ హిందీ రుద్దడాన్ని ఆమోదించదంటూ స్పష్టం చేశారు.

## పట్టాలు తప్పిన శాలిమార్ ఎక్స్‌ప్రెస్
### నాగ్‌పూర్ సమీపంలో ఘటన



**నాగ్‌పూర్:** శాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తృటిలో పెనుప్రమాదం తప్పింది. రైలులోని రెండు బోగీలు పట్టాలు తప్పాయి. అయి తే లోకో పైలట్ అప్రమత్తమై రైలు ను వెంటనే నిలిపేయడంతో పెను ముప్పు తప్పినట్లయ్యింది. ఈ ఘటనలో ప్రయాణికులు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నగర సమీపంలోగల కాలమ్నా రైల్వే స్టేషన్‌కు కొద్ది దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు పట్టాలు తప్పడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించాల్సిన కొన్ని రైళ్లను నిలిపేశారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. ప్రస్తుతం పట్టాలు తప్పిన బోగీలను సరిచేసి మళ్లీ ట్రాక్ ఎక్కించే పనులు కొనసాగుతున్నాయి. ఈ పునరుద్ధరణ పనులు పూర్తయితే రైలు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు.

## మరో 10 ఇండిగో విమానాలకు బెదిరింపులు





**దిల్లీ:** భారత్‌కు చెందిన విమానాలకు వరుస బాంబు బెదిరింపులు ప్రజల్లో ఆందోళన సృష్టిస్తున్నాయి. విమానయాన సంస్థలు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా.. ఇవి ఆగడం లేదు. కాగా మంగళవారం మరో 10 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లుగా ఇండిగో ఎయిర్‌లైన్స్ అధికారులు వెల్లడించారు. దేశీయ సర్వీసులే కాకుండా జెడ్డా, ఇస్తాంబుల్, రియాద్ లాంటి అంతర్జాతీయ సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ఇవి వచ్చాయని పేర్కొన్నారు. ఈ వారంలో ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు మొత్తం 100కు పైగా హెచ్చరికలు వచ్చాయని తెలిపారు. "జెడ్డా, ఇస్తాంబుల్, రియాద్ అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణించే విమానాలకు మంగళవారం బాంబు బెదిరింపులు రావడంతో మా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. ప్రయాణికులను తరలించి.. తనిఖీలు నిర్వహిస్తున్నాము" ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

# ఎల్ఏసీపై ప్రతిష్టంభన ముగిసింది
### ప్రకటించిన చైనా..!



బీజింగ్: వాస్తవాధీన రేఖ వెంట పెట్రోలింగ్, సైనిక ఉద్రిక్తలను తగ్గించడంపై చైనా, భారత్ మధ్య ఏకాభిప్రాయం కురిరింది. సైనిక, దౌత్య స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. ఈ క్రమంలో చైనా ఎల్ఏసీ వెంట ప్రతిష్ఠంభన ముగింపునకు సంబంధించి ఓ ప్రకటన విడుదల చేసింది. తూర్పు లద్దాఖ్ లోని ఎల్ఏసీపై ఒప్పందం కుదిరిందని పేర్కొంది. ఈ విషయంపై భారత విదేశాంగ కార్యదర్శి ప్రకటన విడుదల చేసింది. సరిహద్దుకు సంబంధించిన సమస్యలపై దౌత్య, సైనిక మార్గాల ద్వారా భారత్, చైనాల మధ్య చర్చలు జరిగాయని ఆ దేశ విదేశాంగ ప్రతినిధి లిన్ జియాన్ పేర్కొన్నారు. ఇరు పక్షాలు సంబంధిత విషయాలపై ఓ పరిష్కారాన్ని కనుగొన్నాయన్నారు. ఈ ప్రతిపాదనల అమలుకు భారత్‌తో కలిసి చైనా పని చేస్తుందని జియాన్ పేర్కొన్నారు. అయితే, బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడి మధ్య జరిగిన భేటీపై ప్రశ్నించగా.. స్పందించలేదు. సమావేశంపై ఏదైనా వివరాలు తెలిస్తే తెలియజేస్తానన్నారు. సోమవారం విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మాట్లాడుతూ వాస్తవాధీన రేఖ వెంబడి పెట్రోలింగ్‌పై భారత్, చైనాల మధ్య ఒప్పందం కుదిరిందని చెప్పారు. 2020లో ఈ ప్రాంతాల్లో తలెత్తిన సమస్యలకు పరి ష్కారం లభించిందని.. సైనిక, దౌత్యపరంగా చైనాతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ప్రత్యేకంగా దేప్సాంగ్, డెమ్‌చోక్ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌కు సంబంధించి ఒప్పందం కుదిరింది. ఎల్ఏసీపై సరిహద్దు పెట్రోలింగ్‌పై భారత్, చైనాల మధ్య కుదిరిన ఒప్పందంపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కూడా స్పందించారు. చైనాతో బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిందని చెప్పగలమని పేర్కొన్నారు. 2020కి ముందు మనం చేస్తున్న ప్రదేశాల్లో గస్తీ నిర్వహించగలుగుతామని.. ఇది మంచి పరిణామంగా భావిస్తున్నామన్నారు. వాస్తవానికి గాల్వాన్‌లోయలో ఇరుదేశాల సైనికుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇరుదేశాల 50-60వేల మంది సైనికులను ఎల్ఏసీలో మోహరించాయి. చైనాను ఎదుర్కొనేందుకు డోక్లామ్ తరహాలో భారత్ వ్యూహాలను సిద్ధం చేసింది. చైనా సైన్యాన్ని ఉపసంహరించుకోవాల్సిందేనని భారత్ స్పష్టం చేసింది. 2020 నాటి పరిస్థితిని పునరుద్ధరించాల్సిందేనని చెప్పింది. దాదాపు నాలుగున్నరేళ్ల తర్వాత చైనా మెట్టుదిగి వచ్చింది. జూన్ 15, 2020న గాల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య ఘర్షణలో కల్నల్‌తో సహా 20 మంది సైనికులు అమరులయ్యారు. చైనాకుచెందిన 40 మంది సైతం ప్రాణాలు కోల్పోయారు. అయితే, సైనికుల మరణాలను చైనా ధ్రువీకరించలేదు. 1962 యుద్ధం తర్వాత ఇరుదేశాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది.

## దిల్లీ పేలుడు ఘటనలో ఖలిస్థానీ మద్దతుదారుల హస్తం
### టెలిగ్రామ్ సంస్థకు పోలీసుల లేఖ



**దిల్లీ:** దిల్లీ రోహిణి ప్రాంతంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ పాఠశాల సమీపంలో భారీ పేలుడుపై దిల్లీ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఉగ్రకోణంలో ఈ కేసును ఎన్?ఐఏ కూడా దర్యాప్తు చేస్తోంది. ఈ ఘటనకు సంబంధించి "జస్టిస్ లీగ్ ఇండియా" అనే టెలిగ్రామ్ ఛానల్‌పై దిల్లీ పోలీసులు దృష్టి పెట్టారు. ఈ ఛానెల్ వివరాలు ఇవ్వాలని టెలిగ్రామ్ సంస్థకు దిల్లీ పోలీసులు లేఖ రాశారు. ఇతర సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలను కూడా పోలీసులు కోరారు. సీఆర్?పీఎఫ్? పాఠశాల వద్ద బాంబు పేలుడు ఘటన వివరాలను సీసీటీవీ ఫుటేజీతో సహా "జస్టిస్ లీగ్ ఇండియా" టెలిగ్రాం ఛానల్‌లో ప్రసారం చేశారు. ఖలిస్థాన్ వేర్పాటువాదులను మట్టుబెట్టడానికి భారత ఏజెంట్లు చేపట్టిన చర్యలకు ప్రతీకారంగా ఈ పేలుడు జరిపినట్లు జస్టిస్ లీగ్ ఇండియా టెలిగ్రామ్ గ్రూప్‌లో పోస్ట్? చేసింది. 'కొందరు గూండాలతో భారత నిఘా ఏజెన్సీ మా సభ్యుల నోరుమూయించాలని చూస్తే, ప్రపంచంలో వారే మూరు?లు. మేము వారికి ఎంత దగ్గరగా ఉన్నామో ఏమాత్రం ఊహించలేరు. ఏక్షణమైనా దాడి చేయగల సత్తా మా దగ్గర ఉంది. ఖలిస్థాన్ జిందాబాద్' అనే సందేశాన్ని 'జస్టిస్ లీగ్ ఇండియా' అని పోస్టులో ఉంది. దీంతో పేలుడు ఘటనలో ఖలిస్థానీ కోణంపై దర్యాప్తు చేయాలని టెలిగ్రామ్‌కు దిల్లీ పోలీసులు లేఖ రాశారు. అయితే ఈ విషయంపై టెలిగ్రామ్ సంస్థ ఇంకా స్పందించలేదు. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ పేలుడుకు సంబంధించి ఏ సంస్థ పేరూ వెలుగులోకి రాలేదన్నారు. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. మరోవైపు పేలుడు నేపథ్యంలో దిల్లీలో హై అలర్ట్ ప్రకటించారు.

**అనుమానితుడి గుర్తింపు:** అధికారులు పాఠశాల సమీపంలోని సీసీటీవీ దృశ్యాలను విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే తెల్ల టీషర్ట్ ధరించిన ఓ అనుమానితుడిని గుర్తించినట్లు పేర్కొన్నారు. పేలుడు జరగడానికి ముందు రోజు రాత్రి ఆ ప్రదేశంలో అతడు ఏదో చేస్తున్నట్లు ఆ దృశ్యాల్లో ఉన్నట్లు తెలిపారు. పేలుడు పదార్థాలను ఒక పాలిథిన్ బ్యాగ్‌లో చుట్టి అక్కడ అడుగు గోతిలో అమర్చి, ఆపై చెత్తతో కప్పి ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.

విశ్వంభర V3 NEWS

# డ్రోన్ టెక్నాలజీ.. భవిష్యత్తులో గేమ్ ఛేంజర్

- ఏపీ సీఎం చంద్రబాబు
- అమరావతి డ్రోన్ సమ్మిట్ ప్రారంభం



**విశ్వంభర, మంగళగిరి:** డ్రోన్ టెక్నాలజీ.. భవిష్యత్తులో గేమ్ ఛేంజర్ కానుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఇటీవల విజయవాడ వరదల్లో డ్రోన్లు వినియోగించి ఆహారం, తాగునీరు అందించామని చెప్పారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహించిన 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో భారతీయులు చాలా సమర్థులని సీఎం కొనియాడారు. 1995లో తొలిసారి సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీ రంగం అభివృద్ధికి కృషి చేశానని.. ఆరోజుల్లోనే పీపీపీ పద్ధతిలో హైటెక్ సిటీని నిర్మించామన్నారు. అమెరికా వెళ్లి 15 రోజుల పాటు అనేక సంస్థల ప్రతినిధులను కలిసినట్లు గుర్తు చేసుకున్నారు. నివాస అనుకూల నగరాల్లో దేశంలోనే బెస్ట్ సిటీ హైదరాబాద్ అని చెప్పారు. విదేశాల్లో ఉన్న మనదేశ ఐటీ నిపుణుల్లో 30 శాతం తెలుగువారే ఉన్నారని చెప్పారు. "ఇప్పుడు నిజమైన సంపద డేటా. భవిష్యత్తులో దేశానికైనా, కంపెనీకైనా అదే కీలకం. డేటాకు ఏఐను అనుసంధానిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ఇటీవల విజయవాడ వరదల్లో డ్రోన్లు వినియోగించి ఆహారం, తాగునీరు అందించాం. వ్యవసాయం, మౌలిక వసతుల రంగంలో వాటిది కీలకపాత్ర. నగరాల్లో ట్రాఫిక్ నియంత్రణకు వాడొచ్చు. భవిష్యత్తులో వైద్యరంగంలో పెనుమార్పులు రానున్నాయి. రోగులు ఇంటివద్దే ఉండి చికిత్స తీసుకోవచ్చు. కొన్ని దేశాలు యుద్ధాల్లో డ్రోన్లు వాడుతున్నాయి. మేం మాత్రం అభివృద్ధికి ఉపయోగిస్తాం. శాంతిభద్రతల పరిరక్షణకు వినియోగిస్తాం. పోలీసుశాఖలో విస్తృతంగా ఉపయోగించేందుకు కృషి చేస్తాం. డ్రోన్లతో రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచి వారికి చెక్ పెడతాం" అని చంద్రబాబు తెలిపారు. **రెండురోజులపాటు జరగనున్న సదస్సు** 'అమరావతి డ్రోన్ సమ్మిట్-2024' ప్రారంభమైంది. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. రెండు రోజులపాటు జాతీయ స్థాయిలో ఇది జరగనుంది. సదస్సులో తొమ్మిది ప్యానల్ డిస్కషన్లు, 50 స్టాళ్లలో డ్రోన్ల ప్రదర్శన, రాష్ట్ర ముసాయిదా డ్రోన్ పాలసీ పత్రం ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు ఉంటాయి. డ్రోన్ల రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానానికి చేర్చేందుకు ఈ సదస్సు తొలి అడుగుగా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. పౌర విమానయాన శాఖ, డీఎఫ్ఐ, సీఐఐ భాగస్వామ్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. **చంద్రబాబు ఎప్పుడూ కొత్త ఆలోచనలు చేస్తుంటారు:** రామ్మోహన్ నాయుడుఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. "సీఎం చంద్రబాబు ఎప్పుడూ కొత్త ఆలోచనలు చేస్తుంటారు. యువతతో పోటీపడి ఆయన పనిచేస్తుంటారు. నూతన సాంకేతికత వినియోగంపై చర్చలు జరుపుతుంటారు. దేశాభివృద్ధికి ఎప్పుడూ ఆలోచనలు చేస్తున్న వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ. ప్రపంచంలోని అన్నిదేశాలు భారత్ సాధిస్తున్న అభివృద్ధిని పరిశీలిస్తున్నాయి. దేశంలో 74 ఎయిర్‌పోర్టుల నుంచి గత పదేళ్లలో 157కు పెరిగాయి. వచ్చే 20 ఏళ్లలో 200కుపైగా ఎయిర్ పోర్టులు వస్తాయి. విమానాల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది" అన్నారు. ఈజ్‌ఆఫ్ లివింగ్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తమ ప్రభుత్వ విధానమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వివరించారు. పెరుగుతున్న డ్రోన్ల వినియోగాన్ని అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని.. యువ పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. కృష్ణా తీరంలో మంగళవారం సాయంత్రం 5,500 డ్రోన్లతో ప్రదర్శన జరగనుంది. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇది దేశంలోనే అతి పెద్ద డ్రోన్ల ప్రదర్శన కానుంది. డ్రోన్లు సుమారు అర కిలోమీటరు ఎత్తుకు గాల్లో ఎగిరి.. ఏడు ఆకృతులను ఆవిష్కరిస్తాయి.

# 30న కోదండరామస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**విశ్వంభర, తిరుపతి:** తిరుపతి కోదండరామ స్వామివారి ఆలయంలో అక్టోబర్ 29న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయంలో అక్టోబర్ 31వ తేదీ దీపావళి ఆస్థానం సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రమిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. భక్తులను ఉదయం 11 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు. తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రెండు కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం అవుతుందని అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 64,894 మంది భక్తులు దర్శించుకోగా 23,355 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ.3.82 ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

# 'దానా' తుపాను ఎఫెక్ట్ 41 రైళ్లు రద్దు

**విశ్వంభర, సికింద్రాబాద్:** 'దానా' తుపాను ప్రభావంతో దక్షిణ మధ్య రైల్వే అప్రమత్తమైంది. మొత్తం 41 రైళ్లను రద్దు చేసింది. ఈ నెల 23, 24, 25, 27 తేదీల్లో సర్వీసులందించే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు ద.మ. రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. రద్దు చేసిన రైళ్ల వివరాలను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రద్దయిన రైళ్లలో ఎక్కువగా హావ్‌డా, భువనేశ్వర్, ఖరగ్‌పూర్, పూరీ తదితర చోట్ల నుంచి ప్రాంతాలకు సర్వీసులందించే రైళ్లే అధికంగా ఉన్నాయి.

# పెట్రోల్ పోసి నిప్పంటించి.. చిల్లకూరులో టీడీపీ నేత దారుణహత్య



**విశ్వంభర,చిల్లకూరు:** తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం నాంచారంపేటలో దారుణం చోటుచేసుకుంది. రాజకీయ కక్షలతో తెదేపా నేత మల్లారపు హరిప్రసాద్ (20)ను వైసీపీ కార్యకర్తలు చంపారు. సోమవారం రాత్రి తన బంధువు చెలగల కాటయ్యతో హరిప్రసాద్ బయటకు వెళ్లారు. అనంతరం అర్ధరాత్రి దాటాక తిరిగి వచ్చి కాటయ్య ఇంట్లో ఆయన నిద్రిస్తుండగా మంగళవారం వేకువజామున అక్కడికి వెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఘటనాస్థలంలోనే హరిప్రసాద్ మృతిచెందారు. వైసీపీకి చెందిన కట్టా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దుంపల మధు, అతని అనుచరులు దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

# ఇసుక ఇక పూర్తిగా ఉచితం

## వైసీపీ హయాంలో టన్నుకు రూ.475

## ఇకపై ఎలాంటి ఫీజులూ చెల్లించక్కర్లేదు



**విశ్వంభర, అమరావతి:** రాష్ట్రంలో ఇప్పటికే ఉచిత ఇసుక విధానం అమలుచేస్తున్న కూటమి ప్రభుత్వం.. ఇకపై వాటికి సంబంధించి నామమాత్రపు రుసుములనూ తొలగించింది. పూర్తిగా ఉచితంగా సరఫరా చేసేందుకు సిద్ధమైంది. ఇసుకపై సీనరేజ్ రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడంతో వినియోగదారులకు మరింత ఊరట లభించినట్లయింది. ఇప్పటివరకు సీనరేజ్, తదితరాల రూపంలో స్థానిక సంస్థలకు జమయ్యేలా మెట్రిక్ టన్నుకు రూ.88 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇకపై వినియోగదారులు దీన్ని కూడా చెల్లించాల్సిన అవసరం ఉండదు. సీనరేజ్ రద్దు నిర్ణయం అమలుకు సంబంధించి గనులశాఖ అధికారులతో సీఎం సోమవారం సమీక్ష నిర్వహించారు. బుధవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయానికి ఆమోదం తెలపనున్నారు.

# అనంతపురంలో 'పండమేరు' ఉద్ధృతి

## పూర్తిగా నీటమునిగిన కాలనీలు



**విశ్వంభర, అమరావతి:** అనంతపురంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో నగరానికి ఆనుకుని ఉన్న పండమేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వరదతో వాగుకు ఇరువైపులా ఉన్న కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. వరద ప్రవాహం పెరుగుతుండడంతో ప్రజలు ఇళ్లపైకి ఎక్కిసాయం కోసం ఎదురుచూస్తున్నారు. అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు యంత్రాంగం తరలిస్తోంది. పండమేరుకు వరద పోటెత్తడంతో ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ నీట మునిగింది. **హైదరాబాద్-బెంగళూరు రహదారిపై నిలిచిన రాకపోకలు:** కనగానపల్లి మండలంలోని ముక్తాపురం చెరువు అలుగు పారడంతో జాతీయ రహదారిపైకి వర్షపు నీరు చేరింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక పెట్రోల్ బంక్‌లోకి నీరు చేరింది. కనగానపల్లి చెరువు కట్ట తెగి వరద పండమేరులోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. పండమేరు వాగు ఉద్ధృతితో హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. నిన్న రాత్రి కురిసిన వర్షాలకు పుట్టపర్తి వద్ద చిత్రావతి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

# ఏపీలో పౌర సేవలు మరింత సులభం

## మెటా- ఏపీ ప్రభుత్వం మధ్య ఒప్పందం



**విశ్వంభర, ఢిల్లీ:** ఏపీలో పౌర సేవలు మరింత సులభతరం కానున్నాయి. ఈ మేరకు మెటా- ఏపీ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. యువగళం హామీలు నెరవేర్చడంలో మెటాతో ఎంవోయూ చారిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించారు. "విద్యార్థులు, నిరుద్యోగులు వివిధ సర్టిఫికెట్ల కోసం పడుతున్న కష్టాలు యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రత్యక్షంగా చూశా. మొబైల్ ద్వారానే ఆయా సర్టిఫికెట్లు అందిస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చా. ఇచ్చిన హామీ మేరకు వాట్సప్ ద్వారానే వివిధ రకాల సర్టిఫికెట్లు, పౌరసేవలు అందించేలా మెటాతో ఒప్పందం చేసుకున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు ఆన్‌లైన్‌లో అతి సులువుగా, పారదర్శకంగా, అతి వేగంగా పొందే ఏర్పాట్లు చేస్తాం" అని మంత్రి లోకేశ్ తెలిపారు.

**ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం సంతోషం**

మెటాలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవలను వినియోగించుకుని వాట్సప్ ద్వారా ఏపీ ప్రజలకు పౌర సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్ సంధ్యా దేవనాథన్ తెలిపారు. ప్రజలు తమకు కావాల్సిన సేవలు పొందేందుకు వీలుగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వాట్సప్ అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్ ఫేస్ ఉంటుందన్నారు. డిజిటల్ టెక్నాలజీని వాడుకుని ఏపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలు అందించగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీలోని 1 జన్‌పథ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మెటా సంస్థ ప్రతినిధులు రవిగార్గ్, నటాషా, ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్, ఐఏఎస్ అధికారి పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఐదుగురు దుర్మరణం

**విశ్వంభర,అమరావతి:** ఏపీలోని అన్నమయ్య జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు చనిపోగా మరొకరు చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందారు. చిత్తూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న సీఎంఆర్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. అన్నమయ్య జిల్లా దేవపట్ల పంచాయతీ వంగమల్లవారిపల్లిలో చనిపోయిన వ్యక్తి దహన సంస్కారాల్లో పాల్గొని ఆటోలో తిరిగి వస్తున్న ఓ కుటుంబం చిత్తూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఆటోలో ఉన్న 9 మందిలో నలుగురు మృతిచెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. షాహీరబీ,నూరుల్లా, ఖాదర్‌వల్లి, బావాజాన్‌లు స్పాట్‌లో చనిపోగా చికిత్సపొందుతూ దిల్షాద్ మహిళ మంగళవారం మృతి చెందింది.

# పోలీసుల త్యాగాలు మరువలేనివి

## ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

**విశ్వంభర, అమరావతి:** శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది చేసే త్యాగాలు మరువలేనివని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా వారి సేవలను ప్రతీ ఒక్కరూ గుర్తు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 'పోలీసులు వ్యక్తిగత జీవితం కంటే తమ విధులకే ఎక్కువ సమయం కేటాయిస్తారు. విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొంటారు. గత పాలకులు పోలీసుశాఖను తమ రాజకీయ అవసరాలకే ఎక్కువగా వినియోగించుకున్నారు. ఫలితంగా ఉన్నత స్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకూ ఇబ్బందులు చవిచూశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పోలీసు శాఖను సమర్థంగా పనిచేసేలా చేస్తోంది. పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది. అమరులైన పోలీసులకు మన స్ఫూర్తిగా అంజలి ఘటిస్తున్నా' అని పేర్కొన్నారు.

**పింగళి వెంకయ్య పేరును నిర్ణయించడం హర్షణీయం**

మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య పేరు పెట్టడం హర్షణీయమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో ప్రజల్లో స్ఫూర్తి నింపేలా మువ్వన్నెల జెండాను జాతికి అందించారని సోమవారం ఓ ప్రకటనలో కొనియాడారు. 'కళాశాలకు వెంకయ్యలాంటి మహానుభావుని పేరు పెట్టడం వల్ల ఆయన ఇచ్చిన స్ఫూర్తి భావితరాలకు అందుతుంది. ఆయన పేరును నిర్ణయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.



# పోలీసుల సంక్షేమం మా బాధ్యత

## పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో ముఖ్యమంత్రి



**విశ్వంభర, అమరావతి:** రాష్ట్ర పోలీసు సంక్షేమనిధికి ఏటా రూ.20 కోట్ల చొప్పున నిధులివ్వనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. సంక్షేమనిధికి 2014-19 మధ్య తాము రూ.55 కోట్లు ఇచ్చామని, గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఒక్క రూపాయీ కేటాయించలేదని అన్నారు. పోలీసుల సరెండర్ లీవులు, జీపీఎఫ్, టీఏ బిల్లులు తదితరాలకు గత ప్రభుత్వం పెట్టిన రూ.763 కోట్ల బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వైకాపా హయాంలో అర్ధంతరంగా నిలిపేసిన 6,100 పోలీసు కానిస్టేబుల్ పోస్టుల నియామక ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని గోషామహల్ మైదానం తరహాలో అమరావతిలో పోలీసు అమరవీరుల స్తూపం, స్మారక మైదానం నిర్మిస్తామని.. వచ్చే ఏడాది నుంచి అక్కడే పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తామని మాట ఇచ్చారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. రాష్ట్రం కోసం కేఎస్ వ్యాస్, పరదేశినాయుడు, ఉమేశ్‌చంద్ర వంటి ఐపీఎస్ అధికారులతోపాటు ఎందరో పోలీసులు ప్రాణాలర్పించారని, వారి త్యాగం గొప్పదని కొనియాడారు.


# ఏపీలోని పలు జిల్లాల్లో డిస్టిలరీలపై సీఐడీ ఏకకాల దాడులు



**విశ్వంభర, అమరావతి** : ఏపీలో సీఐడీ అధికారులు పలు జిల్లాలోని డిస్టిలరీలపై ఏకకాల దాడులు నిర్వహించారు. గత కొన్నేళ్లుగా డిస్టిలరీలు తయారు చేసిన మద్యం వివరాలను సేకరించేందుకు సీఐడీ అధికారులు దాడులు చేశారు. తిరుపతి, అనకాపల్లి, ప్రకాశం, ఎన్టీఆర్, కడప , నంద్యాల, చిత్తూరు జిల్లాలో ఉన్న డిస్టిలరీలపై పోలీసుల బందోబస్తు మధ్య దాడులను కొనసాగించారు. కార్యాలయంలోకి ఎవరూ రాకుండా ప్రధాన గేట్ల వద్ద పోలీసులు మోహరించారు. కార్యాలయాల్లో సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహించి పలు ఫైళ్లను పరిశీలించారు. చిత్తూరు జిల్లా కుప్పంలోని డిస్టిలరీ, కడప శివారులోని ఈగల్ డిస్టిలరీ, ప్రకాశం జిల్లాలోని సింగారయకొండ మండలం పాత సింగరాయకొండ పరిధిలోని పెరల్ డిస్టిలరీని అధికారులు తనిఖీలు చేశారు.నంద్యాలలో సీఐడీ అదనపు ఎస్పీ ముస్సేన్ పీర ఆధ్వర్యంలో ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌ను సోదాలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గండేపల్లి సెంటినీ బయోటెక్ ఇండస్ట్రీస్‌లో మద్యం బాటిలింగ్ యూనిట్‌లో తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలో ఉన్న ఎస్వీఆర్ డిస్టిలరీపై సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు.

# రేపు, ఎల్లుండి భారీ వర్షాలు

## ఏపీకి వాతావరణశాఖ హెచ్చరిక



**విశ్వంభర, అమరావతి:** ఏపీలో ఈనెల 23,24వ తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రేపటికి తుఫాన్‌గా బలపడనుందని వెల్లడించింది. రెండు రోజుల పాటు ఉత్తరకోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. తీరం వైపు వెళ్లే కొద్దీ తుఫాన్ మరింత బలపడనున్నట్లు అధికారులు తెలిపారు. తుఫాను తీరందాటే సమయంలో గంటకు 100-110 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. తూర్పుమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం అక్టోబరు 24, 25న పూరీ, సాగర్ ద్వీపం మధ్య తీరం దాటే అవకాశం ఉందని ఈ ప్రభావంతో అనకాపల్లి విజయనగరం, మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అల్లూరి జిల్లాల్లోని కొన్ని చోట్ల భారీ వర్షాలు, మిగిలిన చోట్ల విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ కూర్మనాథ్ తెలిపారు.

# దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రికి రూ.9.31 కోట్లు ఆదాయం



**విశ్వంభర, విజయవాడ:** దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయవాడలోని ఇంద్రకీలాద్రిలోని దుర్గగుడి భారీ ఎత్తున ఆదాయం సమకూరింది. దాదాపు రూ. 9.31 కోట్లు ఆదాయం హుండీకి వచ్చిందని ఆలయ అధికారులు వెల్లడించారు. మూడు విడతలుగా లెక్కించిన వివరాలను ప్రకటించారు. మొదటి విడతగా లెక్కించిన హుండీలో రూ. 3.50 కోట్లు ఆదాయం వచ్చినట్లు వివరించారు. రెండో విడతలో రూ. 2.76 కోట్లు, మూడో విడతలో రూ. 3.05 కోట్లు కానుకల రూపేణా వచ్చినట్లు ఆలయ ఈవో రామారావు తెలిపారు. వీటితో పాటు 733 గ్రాముల బంగారం, 25.705 కిలోల వెండి వస్తువులను భక్తులు అమ్మవారికి సమర్పించుకున్నారని పేర్కొన్నారు.



అవసరమైతే ఒక్కఫోన్‌కాల్ చేయండి..

# వచ్చేస్తా: డేవిడ్ వార్నర్

**సిడ్నీ:** ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో ఆడాలనే ఉత్సాహంతో ఉన్నాడు. తన సేవలు అవసరమని భావిస్తే ఈ సిరీస్‌లో ఆసీస్ తరఫున ఆడేందుకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నాడు. బోర్డర్-గావస్కర్‌లో ఆడటం కోసం అంతకంటే ముందు షెఫీల్డ్ షీల్డ్ (ఆస్ట్రేలియా దేశవాళీ టోర్నీ)లో ఆడేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. వార్నర్ అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరిలో పాకిస్థాన్‌తో టెస్టు మ్యాచ్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2023 వన్డే ప్రపంచ కప్, 2024 టీ20 ప్రపంచకప్‌తో ఆయా ఫార్మాట్లకు వీడ్కోలు పలికాడు. ''నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. ఒక్కఫోన్ కాల్ చేయండి చాలు. ఆటపట్ల నేనెప్పుడూ సీరియస్‌గా ఉంటాను. ఫిబ్రవరి తర్వాత ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఒక టెస్టు మ్యాచ్ ఆడారు. నేను కూడా దాదాపు అంతే సన్నద్ధంగా ఉన్నా. ఈ సిరీస్ (బోర్డర్-గావస్కర్ ట్రోఫీ)కి ఆస్ట్రేలియాకు నేను అవసరమైతే తదుపరి షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్ ఆడతాను. ఆ టోర్నీలో ఆడితే చాలా సంతోషంగా ఉంటుంది. నేను సరైన కారణాల వల్ల ఆటకు వీడ్కోలు పలికాను. కానీ, అవసరమైతే జట్టు తరఫున ఎల్లప్పుడూ ముందుంటా. ఈ విషయంలో సిగ్గుపడను'' అని వార్నర్ పేర్కొన్నాడు.

## భారత్‌తో రెండో టెస్టుకూ కేన్ విలియమ్సన్ దూరం

**పుణె:** భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు అక్టోబర్ 24 నుంచి ప్రారంభంకానుంది. పుణె వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌కు ముందు కివీస్‌కు గట్టి షాక్ తగిలింది. రెండో టెస్టు మ్యాచ్‌కూ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ అందుబాటులో ఉండట్లేదు. శ్రీలంకతో టెస్టు సిరీస్ సమయంలో కేన్‌కు గజ్జల్లో గాయమైంది. దాని నుంచి కోలుకుంటాడని భావించి భారత్ సిరీస్‌కు ఎంపిక చేశారు. కానీ, జట్టుతో కలిసి అతడు భారత్‌కు రాలేదు. స్వదేశంలోనే చికిత్స పొందుతున్నాడు. పూర్తిగా రికవరీ కాకపోవడంతో తొలి టెస్టులోనూ ఆడలేదు.. ఇప్పుడు రెండో టెస్టుకూ దూరమయ్యాడు. ''కేన్ విలియమ్సన్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. వేగంగా కోలుకుంటున్నాడు. ఇంకా వంద శాతం ఫిట్‌గా మాత్రం లేదు. మరికొన్ని రోజుల్లో మూడో టెస్టుకు అందుబాటులోకి రావచ్చని ఆశిస్తున్నాం'' అని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. మూడు టెస్టుల సిరీస్‌లో న్యూజిలాండ్ 1-0 ఆధిక్యంలో ఉంది. బెంగళూరు టెస్టులో విజయం సాధించి మంచి ఊపుమీదున్న కివీస్.. రెండో టెస్టులోనూ అదే జోరు కొనసాగించేలా ప్రణాళికలు రచిస్తోంది. న్యూజిలాండ్ దూకుడుకు కళ్లెం వేసి మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమ్‌ఇండియా భావిస్తోంది.

# సాక్షి వ్యాఖ్యలను తోసిపుచ్చిన వినేశ్ ఫొగాట్

**ఢిల్లీ:** మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించాడంటూ జాతీయ రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ పై భారత స్టార్ రెజ్లర్లు దిల్లీ వీధుల్లో చేసిన ఆందోళన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే నిరసన సమయంలో కలిసికట్టుగా పోరాడిన ఆ కుస్తీ యోధుల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. సాక్షి మాలిక్ వ్యాఖ్యలతో ఆ విషయం బయటపడింది. ఇక ఆమె చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ విభేదించారు.గత సంవత్సరం ఆసియా క్రీడల ట్రయల్స్ నుండి మినహాయింపు కోరుతూ వినేశ్, బజరంగ్ పునియాలు అభ్యర్థించడం తమ నిరసనను బలహీన పరిచిందని సాక్షి మాలిక్ అభిప్రాయపడ్డారు. దీనిపై వినేశ్ స్పందిస్తూ.. ''అది ఆమె వ్యక్తిగత అభిప్రాయం. ఆ మాటలను అంగీకరించను. నేను బలహీనంగా ఉంటే తప్ప.. పోరాటం బలహీనం కాదు. అది నా నమ్మకం. సాక్షి, వినేశ్, బజరంగ్ పునియా బతికున్నంతకాలం.. ఆ పోరాటం బలహీనపడదు. గెలవాలని అనుకునేవారు ఎప్పటికీ బలహీనులు కాకూడదు. వారు పోరాటాన్నే ఎంచుకోవాలి. ఆ క్రమంలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకు మేం సిద్ధంగా ఉన్నాం'' అని వినేశ్ అన్నారు. ఇటీవల 'విట్‌నెస్' పేరుతో సాక్షి మాలిక్ విడుదల చేసిన పుస్తకంలో పలు అంశాలపై స్పందించారు. వినేశ్, పునియా చుట్టూ ఉన్న మనుషులు వారి మనసులను దురాశ నింపడంతో తమ నిరసనకు పగుళ్లు రావడం మొదలైందని ఆమె అందులో వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే.. హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ముందు వినేశ్, పునియా కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. జులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన వినేశ్ విజయం సాధించారు.



# అధిక బరువు, క్రమశిక్షణ లోపించడమే కారణమా?

**ముంబయి:** ప్రతిభావంతుడైన యువ క్రికెటర్ పృథ్వీ షా చేజేతులా తన కెరీర్‌ను నాశనం చేసుకుంటున్నాడు. తనతో కలిసి ఆడిన క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తుంటే 24 ఏళ్ల పృథ్వీ షా మాత్రం ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటూ ఆటపై దృష్టి పెట్టలేకపోతున్నాడు. ఇప్పటికే భారత జట్టుకు దూరమైన అతడు.. తాజాగా రంజీ ట్రోఫీ జట్టులోనూ స్థానం కోల్పోయాడు. ముంబయి రంజీ టీమ్‌లోకి పృథ్వీ షాను ఎంపిక చేయలేదు. అతడిని పక్కనపెట్టడానికి ముంబయి క్రికెట్ అసోసియేషన్ స్పష్టమైన కారణం చెప్పలేదు. కానీ.. ఫిట్‌నెస్, క్రమశిక్షణారాహిత్యం వల్లే షాపై వేటు వేసినట్లు తెలుస్తోంది.నెట్ సెషన్స్‌కు అతడు ఆలస్యంగా రావడంతోపాటు అప్పుడప్పుడు డుమ్మా కొడుతున్నాడట. ఒక వేళ పాల్గొన్నా.. వాటిని సీరియస్‌గా తీసుకోవట్లేదని సమాచారం. అతడి ఫిట్‌నెస్ కూడా అంతంత మాత్రంగానే ఉంది. పృథ్వీ షా అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నాడట. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న ముంబయి క్రికెట్ అసోసియేషన్ సెలక్టర్లు అతడిపై క్రమశిక్షణాచర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారట. పృథ్వీని జట్టు నుంచి తప్పించాలనే నిర్ణయం కేవలం మేనేజ్‌మెంట్, సెలక్టర్లు తీసుకున్నది కాదట. కెప్టెన్, కోచ్ కూడా దీనిని సమర్థించినట్లు సమాచారం. కేవలం 18 ఏళ్ల వయసులోనే భారత జట్టు తరఫున టెస్టు కెరీర్ ఆరంభించిన పృథ్వీ షా తొలి మ్యాచ్‌లోనే సెంచరీ కొట్టి అబ్బురపరిచాడు. అంత గొప్పగా కెరీర్‌ను ఆరంభించిన కుర్రాడు.. ఇప్పుడు టీమ్‌ఇండియా ఛాయల్లోనే లేడు. ప్రతిభకు లోటు లేని ఇతడిలో.. క్రమశిక్షణ కొరవడి, ఫిట్‌నెస్ లేక చేజేతులా కెరీర్‌ను దెబ్బ తీసుకుంటున్నాడు. టీమ్‌ఇండియా తరఫున అతడు చివరగా 2021 జులైలో శ్రీలంకతో టీ20 మ్యాచ్ ఆడాడు.





# కామన్వెల్త్ క్రీడల నుంచి హాకీ, క్రికెట్, బ్యాడ్మింటన్ ఔట్

**బర్మింగ్ హామ్:** గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ క్రీడల నుంచి హాకీ, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, స్క్వాష్, షూటింగ్, నెట్ బాల్, రోడ్ రేసింగ్‌ను తొలగించారు. ఈ మేరకు కామన్వెల్త్ క్రీడల సమాఖ్య ప్రకటన చేసింది. 2022 క్రీడల్లో (బర్మింగ్‌హామ్) 19 ఈవెంట్‌లను నిర్వహించారు. అయితే, ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ సారి 10 ఈవెంట్‌లను మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు. నాలుగేళ్లకొసారి జరిగే కామన్వెల్త్ క్రీడలు 2026లో స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో జరగనున్నాయి. వచ్చే ఏడాది జులై 23 నుంచి ఆగస్టు 2 వరకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ నిర్ణయం భారత్‌కు ఒకరకంగా ఇబ్బందికరమే. ఎందుకంటే హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, క్రికెట్, షూటింగ్‌లో భారత్‌కు పతకాలు వచ్చే ఛాన్స్ ఉండేది. ఇప్పుడు ఆ క్రీడాంశాలను తొలగించడంతో వాటి సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశముంది. 2022 కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం 61 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది. ఇందులో 22 స్వర్ణాలు, 16 రజతాలు, 23 కాంస్యాలున్నాయి. రెజ్లింగ్‌లో అత్యధికంగా 12 పతకాలు రాగా.. వెయిట్ లిఫ్టింగ్‌లో 10 వచ్చాయి. వాస్తవానికి వచ్చే కామన్వెల్త్ క్రీడలు ఆస్ట్రేలియాలోని విక్టోరియాలో జరగాల్సింది. కానీ ఖర్చులు పెరగడంతో విక్టోరియా ఆతిథ్య హక్కులను వదులుకుంది. దీంతో టోర్నీ నిర్వహణకు స్కాట్లాండ్ ముందుకొచ్చింది.

# సెబీ బాస్‌పై వచ్చిన ఆరోపణల నుంచి ఉపశమనం

**మాధబి పురీకి కేంద్రం క్లీన్ చిట్..! రాజీనామా అక్కర్లేదన్న కేంద్రం**



**ఢిల్లీ:** వరుస వివాదాల్లో చిక్కుకున్న సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ) ఛైర్‌పర్సన్ మాధబి పురి బుచ్‌కు ఉపశమనం లభించింది. సెబీ చీఫ్ హోదాలో ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారంటూ వచ్చిన ఆరోపణల వ్యవహారంలో కేంద్రం ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఈ ఆరోపణల వ్యవహారంపై పార్లమెంటరీ ప్రజా పద్దుల కమిటీ ఇటీవల చేపట్టిన దర్యాప్తు ముగిసింది. అయితే, మాధబి గానీ, ఆమె కుటుంబ సభ్యులు గానీ తప్పు చేసినట్లుగా దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించలేదని సదరు వర్గాలు చెప్పినట్లు సమాచారం. అందువల్ల వారిపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని, మాధబి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని కేంద్రం పేర్కొన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఆమె తన పదవీ కాలంలో కొనసాగుతారని అధికార వర్గాల కథనం. అదానీ గ్రూప్‌నకు చెందిన ఆఫ్‌షోర్ కంపెనీల్లో మాధబి పెట్టుబడులు పెట్టారని గతంలో హిండెన్‌బర్గ్ చేసిన పోస్ట్ సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆమెపై మరిన్ని ఆరోపణలు వచ్చాయి. సెబీ ఛైర్‌పర్సన్ హోదాలో ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారని, ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి వేతనం అందుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. అంతేగాక, ఆమె భర్త ధావల్ బుచ్ తో సంబంధం ఉన్న గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ సంస్థ బ్లాక్ స్టోన్ కు లబ్ధి చేకూర్చేందుకు రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్ మెంట్ ట్రస్టులకు మాధాబీ పురీ బుచ్ ప్రోత్సాహం ఇచ్చారని కాంగ్రెస్ మరో ఆరోపణ చేసింది. తన కన్సల్టెన్సీ సంస్థ అగోరా అడ్వైజరీ ప్రైవేటు లిమిటెడ్‌తో సెబీకి సంబంధాలున్నాయని ఆరోపణలు చేసింది. వీటిపై ఇటీవల ఆమె మౌనం వీడారు. 'అవన్నీ తప్పుడు ఆరోపణలు. దురుద్దేశపూర్వకంగా తమ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి చేసినవ'ని భర్త ధావల్ బచ్‌తో కలిసి ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. తనకు 99% వాటా ఉన్న అగోరా అడ్వైజరీ, అగోరా పార్టనర్స్‌లకు సంబంధించిన ఫైల్స్ విషయంలో తాను జోక్యం చేసుకోలేదన్నారు. 2017లో సెబీలో పూర్తికాల సభ్యురాలిగా చేరినప్పుడే, ఈ కంపెనీల సమాచారం బహిర్గతం చేసినట్లు తెలిపారు.

# ఇండెక్స్‌లు 'బేర్' చూపులు.. నష్టాల్లో ముగిసిన స్టాక్స్

**సెన్సెక్స్ 930 పాయింట్లు ధమాల్..**

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ -50 సూచీ నిఫ్టీ మంగళవారం తీవ్ర నష్టాలతో ముగిశాయి. తొలుత ఊగిసలాటకు లోనయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలతో ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ -50 సూచీ నిఫ్టీ మంగళవారం తీవ్ర నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఏకంగా 930 పాయింట్లు పడిపోగా.. నిఫ్టీ 300 పాయింట్లకు పైగా కుంగింది.సెన్సెక్స్, నిఫ్టీ ఒక్కో శాతం చొప్పున పతనం అయ్యాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 930.55 పాయింట్ల పతనంతో 80,220.72 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 309 పాయింట్ల నష్టంతో 24,472.10 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇంట్రాడే ట్రేడింగ్ లో సెన్సెక్స్ 1001.74 పాయింట్ల వరకూ పతనమైంది.డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.08 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎంఅండ్ఎం, ఎస్‌బీఐ, పవర్‌గ్రిడ్, టాటాస్టీల్, ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ, ఎన్టీపీసీ, బజాజ్‌ఫైనాన్స్, రిలయన్స్ సహా 27 షేర్లు నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్ షేర్లు మాత్రమే లాభాల్లో ముగియడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.82 డాలర్ల వద్ద ఉండగా.. బంగారం ఔన్సు 2,744.90 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.హ్యూందాయ్ మోటార్స్ ఇండియా షేర్లు నేడు లిస్టింగ్‌లో తేలిపోయాయి. మదుపర్లు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్న ఈ ఐపీఓ 1శాతం డిస్కౌంట్‌తో దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చాయి. మార్కెట్ ముగిసే సమయానికి షేరు ధర 6.62 శాతం క్షీణించి రూ. 1830.15 వద్ద ముగిసింది.పేటీఎం రెండో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. రూ.928.3 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.



ఫలితాల నేపథ్యంలో షేరు 5.78శాతం తగ్గి రూ.684.00 వద్ద ముగిసింది.ఇక ప్రభుత్వ రంగ బ్యాంకుల ఇండెక్స్ 3.59 శాతం, రియాల్టీ 3.39 శాతం, మెటల్, ఆటో, కన్జూరబుల్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్సులు 2-3 శాతం మధ్య నష్టాలతో ముగిశాయి. బ్యాంకు, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫార్మా అండ్ హెల్త్ కేర్ ఇండెక్సులు 0.55 నుంచి రెండు శాతం మధ్య పతనం అయ్యాయి. నిఫ్టీ బ్రాడ్ మార్కెట్ ఇండెక్సుల్లో నిఫ్టీ స్మాల్ క్యాప్ 3.62 శాతం, మిడ్ క్యాప్ 2.35 శాతం నష్టాలతో ముగిశాయి.


**జొమాటో క్యూ2 ఫలితాలు...**

ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో క్యూ2 ఫలితాల్లో రూ.176 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలో రూ.36 కోట్లను నమోదు చేసింది. మంగళవారం మార్కెటెట్ ముగిసే సమయానికి షేరు 3.44 శాతం నష్టపోయి 256.55 వద్ద ముగిసింది. క్యూఐపీ పద్ధతిలో రూ.8,500 కోట్లను సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపినట్లు జొమాటో తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది.

# సవాళ్లను తట్టుకునేలా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలి

**నిర్మలా సీతారామన్**

**ముంబయి:** ప్రపంచం సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ కూడా నూతన వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భారత్ మెరుగైన స్థానంలో ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వస్తు, సేవల విభాగంలో అనేక దేశాలకు భారత్ కీలక భాగస్వామిగా మారాలని భావిస్తోందన్నారు. కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న మంత్రి ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. దేశీయంగా సమర్థతను పెంచుకోవడంతో పాటు.. బయటి నుంచి వచ్చే సవాళ్లను తట్టుకొనేలా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు సీతారామన్ చెప్పారు. భారత్‌లోని పెట్టుబడి అవకాశాలను ఆమె ప్రస్తావించారు. ఉపాధి కల్పనే దేశం ముందున్న అతిపెద్ద సవాలన్నారు. ''చాలా మంది యువత డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారు. కానీ, తమకున్న అర్హతకు, సాధించిన ఉద్యోగానికి మధ్య వ్యత్యాసం ఉందని వారు భావిస్తున్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కృత్రిమ మేధ (AI) వంటి సాంకేతికతల్లో నైపుణ్యాన్ని అందించేందుకు యువతను సన్నద్ధం చేస్తోంది'' అని ఆర్థిక మంత్రి అన్నారు.యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ గురించి ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. భారత్ ప్లాస్టిక్ కార్డుల నుంచి క్యూఆర్ కోడ్‌కు వేగంగా మారినట్లు ఆమె తెలిపారు. చిరు దుకాణాలు, కూరగాయల కోసం కూడా దీనిని వినియోగిస్తున్నామన్నారు. ఫలితంగా చెల్లింపులు మరింత పారదర్శకంగా మారాయని, నగదుపై ఆధారపడటం తగ్గిందన్నారు. థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నుంచి సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధనం వైపు వేగంగా మారుతోందన్నారు.



# క్యూ2 ఫలితాల్లో పేటీఎం లాభం రూ.928 కోట్లు

**ముంబయి:** పేటీఎం బ్రాండ్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫిన్‌టెక్ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో కంపెనీ రూ.928.3 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలో రూ.290.5 కోట్ల నష్టాల్ని నమోదు చేసిన కంపెనీ తాజాగా లాభాల బాట పట్టింది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 34.1శాతం క్షీణించి రూ.1,659.5 కోట్లకు చేరింది. పేటీఎం సినిమాలు, ఈవెంట్ల టిక్కెట్ల బుకింగ్ విభాగాన్ని జొమాటోకు విక్రయించడంతో రూ.1,345 కోట్లు లాభం పొందినట్లు కంపెనీ స్వయంగా వెల్లడించింది. దీంతో కంపెనీ తిరిగి లాభాల్ని నమోదు చేసుకుంది. ఆర్థిక సేవల విభాగం నుంచి వచ్చే ఆదాయం 9శాతం పెరిగి రూ.376 కోట్లకు చేరిందని, పేటీఎం వ్యాపారం సేవల నుంచి వచ్చే ఆదాయం ఏకంగా 34శాతం పెరిగి రూ.981 కోట్లుగా నమోదైందని వెల్లడించింది. కంపెనీ ఖర్చులు 17శాతం తగ్గి రూ.1,080 కోట్లకు చేరాయని తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పేటీఎం షేరు బీఎస్ఈలో 4.73 నష్టంతో రూ.692.15 వద్ద ముగిసింది.ఆర్‌బీఐ ఆంక్షలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేటీఎం.. వాటి నుంచి గట్టెక్కేందుకు ఆహార పంపిణీ సంస్థ జొమాటో తో చర్చలు జరిపింది. సినిమాలు, కార్యక్రమాల టికెట్ బుకింగ్ వ్యాపారాన్ని ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌కు విక్రయించింది.

# సిమెంట్ వ్యాపారంలో అదానీ దూకుడు..

- **ఓరియంట్‌లో మెజార్టీ వాటా కొనుగోలుకు సిద్ధం**

**ముంబయి:** గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ సిమెంట్ వ్యాపారంలో తన దూకుడును కొనసాగిస్తోంది. ఇప్పటికే ఈ రంగంలో తన వ్యాపారాన్ని వేగంగా విస్తరిస్తున్న ఈ సంస్థ.. తాజాగా మరో కంపెనీలో వాటా కొనుగోలుకు సిద్ధమైంది. ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్‌లో (ఓసీఎల్)లో 46.8శాతం షేర్లు దక్కించుకోనున్నట్లు ప్రకటించింది. 2025 ఆర్థిక సంవత్సరంలో తన మార్కెట్ వాటాను పెంచుకోవాలని అదానీ గ్రూప్ చూస్తోంది. అందులో భాగంగానే సామర్థ్యాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా అంబుజా ఈ కొనుగోళ్లు చేపట్టనుంది. ఓరియంట్ సిమెంట్‌లో 46.8శాతం వాటాను తీసుకొనేందుకు రూ.8,100 కోట్లు వెచ్చించనున్నట్లు ప్రకటించింది. ప్రమోటర్ల నుంచి 37.9శాతం, పబ్లిక్ నుంచి అదనంగా 8.9శాతం కొనుగోలు చేయనున్నట్లు అదానీ గ్రూప్ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది. మరో 26శాతం వాటా కోసం ఆఫర్ ఫర్ సేల్‌కు వెళ్లాలని యోచిస్తోంది. ఈ కొనుగోలుతో 2025 నాటికి ఏటా ఉత్పత్తి 100 మిలియన్ టన్నులకు చేరనుందని అంబుజా సిమెంట్ డైరెక్టర్ కరణ్ అదానీ ధీమా వ్యక్తం చేశారు.అంబుజా, ఏసీసీ సిమెంట్స్‌లో వాటాల కొనుగోలు ద్వారా సిమెంట్ వ్యాపారంలోకి ప్రవేశించిన అదానీ గ్రూప్ ఇప్పుడు విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. 2028 ఆర్థిక సంవత్సరానికి దేశీయ సిమెంట్ మార్కెట్‌లో తన షేర్‌ను 20శాతానికి పెంచుకోవాలని చూస్తోంది. రుణ రహితంగా ఉండాలని నిర్ణయించుకుంది. 2028 నాటికి ఏటా ఉత్పత్తిని 140 మిలియన్ టన్నులకు చేర్చాలని, వృద్ధితో దూసుకెళ్లాలని ప్రణాళికలు రచిస్తోంది. అదానీ గ్రూప్ ఎంట్రీతో సిమెంట్ వ్యాపారంలో ఇప్పటికే ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ గట్టి పోటీని ఎదుర్కొంటోంది.





# అంచనాలను రెట్టింపు చేసిన లక్కీ భాస్కర్ ట్రైలర్

## ఇది నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం : దుల్కర్ సల్మాన్

వైవిధ్యభరితమైన సినిమాలు, పాత్రలతో దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్. దుల్కర్ సినిమాలను ఖచ్చితంగా థియేటర్లలో చూసి అనుభూతి చెందాలనే ప్రేక్షకుల నమ్మకాన్ని ఆయన పొందగలిగారు. తెలుగులోనూ "మహానటి", "సీతా రామం" వంటి ఘన విజయాలను సొంతం చేసుకున్న దుల్కర్, తన తదుపరి చిత్రం 'లక్కీ భాస్కర్' కోసం బ్లాక్ బస్టర్ దర్శకుడు వెంకీ అట్లూరి , ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. "సాధారణ మనిషి అసాధారణ ప్రయాణం"గా 'లక్కీ భాస్కర్' చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. ఇక ఇప్పుడు చిత్ర బృందం, అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'లక్కీ భాస్కర్' ట్రైలర్‌ను శనివారం ఆవిష్కరించింది. హైదరాబాద్ లోని ఏఎంబీ సినిమాస్ లో ట్రైలర్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కథానాయకుడు దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. "14 నెలల తర్వాత నా నుంచి వస్తున్న సినిమా 'లక్కీ భాస్కర్'. ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ఇది నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. హాస్యం ఉంటుంది, భావోద్వేగాలు ఉంటాయి, కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలు ఉంటాయి, సంగీతం బాగుంటుంది. ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను." అన్నారు. కథానాయిక మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. "ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. ఇప్పటివరకు నేను చేసిన పాత్రల్లో సుమతి పాత్ర నాకు బాగా ఇష్టమైన పాత్ర. ఈ 'లక్కీ భాస్కర్' అనేది నా మనసుకి బాగా దగ్గరైన చిత్రం. ఈ సినిమాలో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. నాకు ఈ అవకాశమిచ్చిన దర్శక నిర్మాతలు వెంకీ గారు, వంశీ గారికి ధన్యవాదాలు. దుల్కర్ గారితో కలిసి నటించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. " అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "సినిమాలో ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటుంది. బ్యాంకింగ్ నేపథ్యంలో కుటుంబం భావోద్వేగాలతో నడిచే ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది." అన్నారు. 'లక్కీ భాస్కర్' ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. డబ్బు కోసం ఎంతటి రిస్క్ అయినా చేసే భాస్కర్ పాత్రలో దుల్కర్ సల్మాన్ కనిపిస్తున్నారు. అతను మంచివాడు లేదా చెడ్డవాడిగా ఉండాలనుకోవడంలేదు. తాను తలచుకుంటే ఏదైనా చేయగలిగే అంత ధనవంతుడు కావాలని అనుకుంటాడు. బాగా డబ్బు సంపాదిస్తే, శ్వాస కూడా గౌరవిస్తుంది అనేది అతని సిద్ధాంతం. రచయిత-దర్శకుడు వెంకీ అట్లూరి కలం నుంచి జాలువారిన భాస్కర్ అనే అద్భుతమైన పాత్రను దుల్కర్ సల్మాన్ తన భుజాలపై మోసి మరో స్థాయికి తీసుకెళ్లారు. సుమతి పాత్రలో మీనాక్షి చౌదరి తనదైన ముద్ర వేశారు. దుల్కర్ సల్మాన్‌తో ఆమె సన్నివేశాలు కట్టి పడేశాయి. భారతీయ సినిమాకి అద్భుతమైన ప్రదర్శనలతో కూడిన వైవిధ్యభరితమైన డ్రామాని అందిస్తున్నట్లు ట్రైలర్ తో స్పష్టమవుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఎక్కడా రాజీ పడకుండా భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, మలయాళం, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో అక్టోబర్ 31న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.



# బ్లడీ బెగ్గర్ తెలుగు రిలీజ్ డేట్ ఫైనల్!

కోలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ల జాబితాలో టాప్‌లో ఉంటాడు కవిన్. ఈ స్టార్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న తాజా చిత్రం బ్లడీ బెగ్గర్ . శివ బాలన్ ముత్తుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఫిలమెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై స్టార్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బ్లడీ బెగ్గర్ తమిళ్ వెర్షన్ దీపావళి కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. కాగా తెలుగు వెర్షన్ విడుదలయ్యేది ఎప్పుడో క్లారిటీ వచ్చేసింది. బ్లడీ బెగ్గర్‌ను తెలుగులో నవంబర్ 7న విడుదల చేయనున్నారు. ఈ చిత్రాన్ని తెలుగులో ఏసియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ విడుదల చేయనుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ రిలీజ్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. జెన్ మార్టిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రం నెల్సన్ దిలీప్‌కుమార్ తొలి ప్రొడక్షన్ వెంచర్ కావడం విశేషం.

# రికార్డ్ ప్రీ రిలీజ్ బిజినెస్‌లో పుష్ప 2 టాప్ ప్లేస్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం పుష్ప 2 ది రూల్ . సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సీక్వెల్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ మూవీని డిసెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఏదో ఒక వార్తతో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. తాజాగా ప్రీ రిలీజ్ బిజినెస్‌లో టాప్ ప్లేస్‌లో నిలిచి సరికొత్త బెంచ్‌మార్క్ నమోదు చేసిందన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా రూ.1000 కోట్లకుపైగా ప్రీ రిలీజ్ బిజినెస్‌తో అరుదైన రికార్డును నమోదు చేసినట్టు ఇండస్ట్రీ సర్కిల్ సమాచారం. ఈ బిజినెస్‌లో కేరళ- రూ.20 కోట్లు, రూ.120 కోట్లు, రూ.275 కోట్లు, రూ.65 కోట్లు, రూ.85 కోట్లుగా నమోదైనట్టుగా ఇన్‌సైడ్ టాక్. ఈ మొత్తంలో నాన్ థియాట్రికల్ రైట్స్ రూ.460 కోట్లు , డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్- రూ.275 కోట్లు, శాటిలైట్ రైట్స్- రూ.120 కోట్లు, మ్యూజిక్ రైట్స్ – రూ.65 కోట్లు. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.





# ఆ పేరు పోగొట్టుకోవడానికి రెట్టింపు శ్రమించా

2014లో టైగర్ ష్రాఫ్ హీరోగా వచ్చిన 'హీరోపంటీ' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు నటి కృతి సనన్ . ఆ తర్వాత 'బరేలీ కి బర్ఫీ', 'దిల్‌వాలే' వంటి చిత్రాల్లోనూ నటించి బాలీవుడ్‌లో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, ఇండస్ట్రీలో 'టైగర్ ష్రాఫ్ హీరోయిన్' అని పిలవడంపై తాజాగా కృతి మాట్లాడారు. సినీ నేపథ్యం లేకుండా వచ్చినందుకు ఇండస్ట్రీలో తనకంటూ గుర్తింపు తెచ్చుకోవడం కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పారు. ''నేను ఎన్ని పెద్ద ప్రాజెక్టులలో చేసినా 'టైగర్ ష్రాఫ్ హీరోయిన్' అనే పిలిచేవారు. మనకు సినీ నేపథ్యం లేనప్పుడు ప్రేక్షకులు ఇలాంటి పేర్లు పెట్టేస్తారు. 'హీరోపంటీ' తర్వాత నేను నటించిన 'బరేలీ కి బర్ఫీ' దర్శకురాలు అశ్వనీ పిల్లలు కూడా నన్ను ఇదే పేరుతో పిలిచేవారు. ఆ పేరు పోవాలని రెట్టింపు కష్టపడ్డాను. పరిశ్రమలోకి వచ్చాక 'హీరోపంటీ' లాంటి గొప్ప సినిమాలో అవకాశం రావడానికి ఎంతో సమయం పట్టలేదు. దాని కంటే ముందు నేను '1 నేనొక్కడినే'లో నటించా. 'హీరోపంటీ'లో కొత్త వాళ్లు కావాలని మేకర్స్ భావించారు. అప్పటికి నేను బాలీవుడ్‌లో నటించలేదు. అందుకే నన్ను ఎంపిక చేశారు. ఆ తర్వాత తెలుగు సినిమాలు చేసినప్పటికీ బాలీవుడ్ హీరోయిన్‌గానే గుర్తింపు వచ్చింది' అని కృతి సనన్ అన్నారు. కృతిసనన్ నటిగా కెరీర్ ఆరంభించి పదేళ్లు అవుతోంది. 2014లో విడుదలైన '1 నేనొక్కడినే'తో ఆమె హీరోయిన్‌గా తెరంగేట్రం చేశారు. ఈ దశాబ్దకాలం నుంచి తెలుగు, హిందీ భాషల్లో వరుస సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. 2021లో విడుదలైన 'మిమీ'కి గాను ఉత్తమ నటిగా ఆమె జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం పలు ప్రాజెక్ట్‌లకు నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు.

# నిర్మాత ఏక్తాకపూర్‌ను విచారించిన పోలీసులు





బాలీవుడ్ ప్రముఖ నిర్మాత ఏక్తా కపూర్, ఆమె తల్లి శోభాకపూర్‌లను ముంబయి పోలీసులు మంగళవారం ప్రశ్నించారు. ఆల్ట్ బాలాజీ వెబ్ సిరీస్ 'గంధీభాత్' ఎపిసోడ్‌లో మైనర్ బాలికలపై అసభ్యకరమైన సీన్స్‌ను చిత్రీకరించినందుకు ఏక్తా కపూర్‌తోపాటు ఆమె తల్లి శోభపై పోక్సో చట్టం కింద కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు విచారించారు. ఈ నెల 24న మరోసారి విచారణకు రావాలని ముంబయి పోలీసులు ఆదేశించారు. ఆల్ట్ బాలాజీ టెలిఫిల్మ్ లిమిటెడ్‌కు చెందిన ఏక్తా కపూర్‌తో పాటు ఆమె తల్లి శోభా కపూర్‌పై ఈ నెల 20న ముంబయిలో ఎంబీహెచ్ పోలీస్‌స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్ 295ఏ, ఐటీచట్టంతో పాటు పోక్సోచట్టంలో సెక్షన్ 13, సెక్షన్ 15 కింద మైనర్లపై అశ్లీల దృశ్యాలను చిత్రీకరించారని ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోక్సో నిబంధనలు ఉల్లంఘించే సన్నివేశాలు ఉన్నాయన్నారు. అయితే, ఈ వివాదాస్పద ఎపిసోడ్‌ని యాప్‌లో స్ట్రీమింగ్ నుంచి తొలగించారు. గొప్ప వ్యక్తులతో పాటు సాధువులను సైతం అవమానించారని, దాంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. పోక్సోతో పాటు సమాచార సాంకేతిక చట్టం-2000, మహిళా నిషేధ చట్టం 1986, పొగాకు ఉత్పత్తుల చట్టం-2003 తదితర చట్టాలను ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం పోలీసులు పోక్సో చట్టంలో సెక్షన్ 13, సెక్షన్ 15, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2000 – 67 (A), బీఎన్ఎస్ సెక్షన్ 295 (A)తో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే సోషల్ మీడియాలో 'బ్యాన్ ఆల్ట్ బాలాజీ' హ్యాష్‌ట్యాగ్ 'ఎక్స్'లో ట్రెండ్ అవుతున్నది.

## దేవర అయుధ పూజ

# పాట వచ్చేసింది

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'దేవర. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మించారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా టాలీవుడ్‌కి పరిచయం అయిన ఈ సినిమాలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటించారు. అనిరుధ్ సంగీతం అందించారు. దసరా పర్వదినం సందర్భంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా రూ.500కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టి బ్లాక్‌బస్టర్ విజయం సాధించింది. సినిమా విడుదలై నెల రోజులు కావొస్తుండగా థియేటర్లలో వసూళ్లు గట్టిగానే రాబడుతోంది. ఇటీవల రిలీజైప వేట్టయాన్, వశ్వం సినిమాలను మించి కలెక్షన్లు కొల్లగొట్టి ఔరా అనిపిస్తోంది. అయితే జూ. ఎన్టీఆర్ అభిమానులు చాలా రోజుల నుంచి ఎదురు చూస్తున్న సమయం మంగళవారం వచ్చింది. దేవర సినిమాలో బాగా పాపులర్ అయిన ఆయుధ పూజ ఫుల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రచించగా అనిరుధ్ సంగీతంలో కాలభైరవ పాడిన ఈ పాట విడుదలైన క్షణాల్లోనే మిలియన్లకు పైగా సాధించి రికార్డు సృష్టించింది. ఇదిలాఉండగా దీపావళి అనంతరం ఈ చిత్రాన్ని ఓటీటీకి తీసుకు రానున్నారు.




# సీమ వంకాయ కనిపిస్తే వదలకుండా తినండి

కూరగాయల్లో చాలా రకాలు ఉంటాయి. వీటిల్లో మనం ఎక్కువగా తినేవి వంకాయలు. వంకాయలు అంటే చాలా మందికి ఇష్టం. వీటితో ఎగ్రీ చేసినా.. బజ్జీలు చేసినా ఎంతో రుచిగా ఉంటాయి. వెజిటేబుల్స్‌లో రాజు ఎవరంటే వంకాయ అనే అంటారు. ఈ వంకాయల్లో కూడా ఎన్నో రకాలు ఉంటాయి. వీటిల్లో నచ్చినవి తెచ్చుకుని తింటూ ఉంటారు. అలా వీటిల్లో సీమ వంకాయ కూడా ఒకటి. చాలా మందికి ఈ వంకాయ గురించి పెద్దగా తెలియక పోవచ్చు. ఇవి ఎక్కువగా గ్రామాల్లో లభిస్తాయి. చూడటానికి తెల్ల వంకాయలా ఉంటుంది. కానీ ఇది కొంచెం డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ మధ్య సిటీలకు కూడా తీసుకొచ్చి అమ్ముతున్నారు. ఈ సీమ వంకాయలతో కర్రీ చేశారంటే అస్సలు మర్చిపోరు. అంత రుచిగా ఉంటుంది. కేవలం రుచి మాత్రమే కాకుండా ఆరోగ్య పరంగా కూడా ఎన్నో లాభాలు ఉన్నాయి. మరి అవేంటో ఇప్పుడు చూద్దాం.

**షుగర్ లెవల్స్ కంట్రోల్**

ప్రస్తుత కాలంలో చాలా మంది షుగర్ వ్యాధితో బాధ పడుతున్నారు. ఇలాంటి ఈ సీమ వంకాయలు తినడం వల్ల చాలా మంచిది. ఈ వంకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్.. రక్తంలో షుగర్ లెవల్స్‌ను నియంత్రించి అదుపు చేస్తుంది. కాబట్టి డయాబెటీస్‌ను కంట్రోల్ చేయవచ్చు.

**అందం పెరుగుతుంది**

సీమ వంకాయలు తినడం వల్ల అందం కూడా పెరుగుతుంది. చర్మ, జుట్టు సమస్యలు అదుపులోకి వస్తాయి. ఈ వంకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి.. శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను, విష పదార్థాలను బయటకు పంపుతుంది. దీంతో చర్మం కాంతివంతంగా మారుతుంది. వంకాయలో ఉండే పోషకాలు జుట్టును బలంగా ఉంచేలా చేస్తుంది.

**ఊబకాయానికి చెక్**

సీమ వంకాయ తినడం వల్ల ఊబకాయం కూడా అదుపులోకి వస్తుంది. ఊబకాయంతో బాధ పడేవారు సీమ వంకాయను మీ డైట్‌లో చేర్చుకోండి. ఇందులో పీచు పదార్థాలు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా.. క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కాబట్టి అధిక బరువు, ఊబకాయాన్ని తగ్గించుకోవచ్చు.

**గర్భిణీలకు మంచిది**

గర్భిణీలు సీమ వంకాయ తింటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఫోలేట్ అనేది ఎక్కువగా లభిస్తుంది. ప్రెగ్నెంట్ లేడీస్‌కి కూడా ఇది చాలా అవసరం. కాబట్టి మీ ఆహారంలో సీమ వంకాయ చేర్చుకుంటే.. పుట్టే బిడ్డ ఆరోగ్యంగా పుడతాడు.

# ఈ సమస్యలున్న వారు చపాతీ తినొద్దు

ఆరోగ్యానికి మంచిది కదాని చాలా మంది చపాతీ తినేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. అయితే ఇది అందరికీ మంచిది కాదు. ముఖ్యంగా కొన్ని రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు చపాతీ అస్సలు తినకూడదు. పొరబాటున తింటే మాత్రం చిక్కుల్లో పడిపోతారు..చపాతీ అంటే వెంటనే మన గుర్తుకు వచ్చేది వెయిట్‌లాస్ బెస్ట్ డైట్ ఫుడ్. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ప్రజల ప్రధాన ఆహారం చపాతీ. చపాతీ లేకుండా వారికి రోజు గడవదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ ఫిట్‌నెస్‌పై ఎక్కువ శ్రద్ధ పెట్టేవారు చపాతీలను ఎక్కువగా తీసుకుంటుంటారు. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యానికి సొంతం చేసుకోవచ్చని చాలా మంది నమ్ముతారు. అయితే ఈ ఆరోగ్య సమస్యలున్నవారు మాత్రం చపాతీ తినడం మానుకోవాలని నిపుణులు అంటున్నారు. అవేంటంటే..

**మధుమేహ వ్యాధిగ్రస్తులు**

ఇటీవలి కాలంలో మధుమేహంతో బాధపడే వారి సంఖ్య గణనీయంగా పెరిగి పోతుంది. దీంతో మధుమేహ వ్యాధిగ్రస్తులు అన్నానికి బదులు గోధుమ చపాతీ ఎక్కువగా తింటుంటారు. కానీ మధుమేహ వ్యాధిగ్రస్తులు చపాతీ తినకూడదు. ఇందులో అమిలోపెక్టిన్ అనే స్టార్చ్ మాలిక్యూల్స్ ఉంటాయి. కాబట్టి బ్లడ్ షుగర్ ఎక్కువగా ఉన్నవారు చపాతీని తక్కువగా తీసుకోకూడదు. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు.

**అలసటతో బాధపడేవారు**

ఎప్పుడు అలసిపోయినట్లు అనిపించేవారు చపాతీ తినకపోవడమే మంచిది. ఎందుకంటే గోధుమలలోని కార్బోహైడ్రేట్ రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. దీనివల్ల అలసట, నీరసం మరింత పెరుగుతాయి. ఇది శక్తిని తగ్గించి ఆకలిని పెంచుతుంది. కాబట్టి, అలసటగా ఉంటే చపాతీ తినకపోవడమే మంచిది.

**థైరాయిడ్ సమస్య**

మీకు ఏదైనా థైరాయిడ్ సమస్య ఉంటే చపాతీ తినకూడదు. ఎందుకంటే గోధుమలలో గ్లూటెన్ పెద్ద మొత్తంలో ఉంటుంది. ఇది ఆటో ఇమ్యూన్ థైరాయిడ్ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. దీని వల్ల థైరాయిడ్ సమస్య కూడా తీవ్రమయ్యే అవకాశం ఉంది.



**అధిక బరువు**

చాలామంది అన్నం మానేసి చపాతీ తింటారు. అయితే చపాతీలు ఎక్కువగా తింటే బరువు పెరుగుతారనిపిస్తుంది. గోధుమల్లో ఉండే గ్లూటెన్‌లోని కార్బోహైడ్రేట్లు శరీరంలో కొవ్వును నిల్వ చేయడానికి కారణమవుతాయి. ఇది చాలా సులభంగా బరువు పెరగడానికి దారితీస్తుంది. కాబట్టి వీలైనంత వరకు చపాతీకి దూరంగా ఉండటం మంచిది.

**జీర్ణ సమస్యలు ఉన్నవారు**

చపాతీ ఎక్కువగా తినడం వల్ల గ్యాస్, ఎసిడిటీ, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. అలాగే, గోధుమలలోని గ్లూటెన్ పేగులలో మంటను కలిగిస్తుంది. ఇది జీర్ణ సమస్యలను కూడా కలిగిస్తుంది. కాబట్టి పొట్ట సంబంధిత సమస్యలతో బాధపడేవారు దీనిని తీసుకోకుండా ఉండటం ఆరోగ్యానికి మంచిది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com